PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 316 | విజయవాడ, శుక్రవారం 21 జూన్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 21 June 2024 | Rs

అదరగొట్టిన టీమిండియా

- సూర్యకుమార్ అర్ధసెంచరీ
- బుమ్రా, అర్ష్‌దీప్‌కు మూడేసి వికెట్లు
- ఆఫ్ఘనిస్తాన్‌పై 47పరుగుల తేడాతో ఘన విజయం

8

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ ఢిల్లీలో విద్యార్థుల ఆందోళన

7

అమరావతి, పోలవరం
సంపద సృష్టి కేంద్రాలు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు • రాజధానిలో భవనాల పరిశీలన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'ఏపి అనే పదంలోనే అమరావతి, పోలవరం ఉన్నాయి. అవి వ్యక్తిగత అంశాలు కావు. రాష్ట్రంతో ముడిపడి ఉన్నాయి. రాష్ట్రానికి సంపద సృష్టి కేంద్రాలు కూడా అవే. వాటిని పూర్తిచేస్తే అవే రాష్ట్రాభివృద్ధికి బాటలువేస్తాయి.' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గురువారం ఆయన రాజధాని ప్రాంతంలో పర్యటించారు. తొలుత గత ప్రభుత్వం కూల్చివేసిన ప్రజావేదికను పరిశీలించారు. కూల్చివేతకు అనుమతులున్నాయా? అని సిఆర్‌డిఎ అధికారులను అడగగా, లేవని వారు సమాధానం ఇచ్చారు. అక్కడ నుండి బయలుదేరి రాజధానికి శంకుస్థాపన జరిగిన ఉద్దండ్రాయునిపాలెం చేరుకున్నారు. శంకుస్థాపన స్థలం వద్ద మోకాళ్లపై కూర్చుని నమస్కరించారు. రాజధాని నమూనాను చూశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు సిఎంను సన్మానించారు. అక్కడ నుండి రాయ పూడిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఎఎస్, కమిష నర్లు, ముఖ్య కార్యదర్శులు, జడ్జిలు, ఎన్‌జిఒలు, గెజిటెడ్ అధికారుల కోసం నిర్మించిన భవనాలు, అమరావతి గవర్నమెంటు కాంప్లెక్స్ (ఎజిసి) పునా దులను పరిశీలించారు. అనంతరం రాయపూడిలోని సిఆర్‌డిఎ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐదేళ్లగా రాజధాని అమరావతిని ధ్వంసం చేశారని చెప్పారు. 80 శాతం పూర్తయిన భవనాలనూ వినియోగించుకోలేదని అన్నారు. రోడ్లను తవ్వేశారన్నారు. 'అమరావతి రైతులు 1631 రోజులు ఆందోళన చేశారు. ఈ సంఖ్య కలిపితే వైసిపికి వచ్చిన సీట్లతో సరిపోతాయి. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తరువాత రాజధాని పూర్తవుతుందన్న నమ్మకంతో ఆందోళన విరమించారు. వారందరికీ ధన్యవాదాలు.' అని చెప్పారు.. 'సిఎం అయిన తరువాత ప్రజలను మెప్పించాలి. కానీ, ప్రజావేదిక కూల్చివేతతో పాలన ప్రారంభించారు' అని విమర్శించారు.



రాజధాని శంకుస్థాపన స్థలం వద్ద నమస్కరిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

రాజధానిలో ఎక్కడ పనులు అక్కడే ఉన్నాయని చెప్పారు. విశాఖను ఆర్థిక రాజధానిగా, కర్నూలును ఆధునిక నగరంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. రాజధానితో గత పాలకులు మూడు ముక్కలాట ఆడారని, రాజధానికి వ్యతిరేకంగా ఏమి చేయాలో అన్నీ చేశారని అన్నారు. 'పోలవరం పూర్తయితే రాష్ట్రం మొత్తానికి నీరు వస్తుందనే ఉద్దేశ్యంతో దానికి ప్రాధాన్యత ఇచ్చాం. పోలవరం పూర్తయితే రాయలసీమ రతనాలసీమగా మారుతుంది. కానీ, పోలవరాన్ని వైసిపి ప్రభుత్వం నాశనం చేసింది. రాష్ట్రానికి వరంగా మారాల్సిన పోలవరాన్ని శాపంగా మార్చింది.' అని అన్నారు. గత ముఖ్యమంత్రి జగన్‌కు రాజకీయాల్లో ఉండే అర్హత లేదని చెప్పారు. రాజకీయాలకు పనికిరాని వ్యక్తి ముఖ్యమంత్రి అయితే ఎలా ఉంటుందో గత ఐదేళ్ల ప్రత్యక్షంగా చూశామన్నారు. రాష్ట్రంలో రౌడీయిజం, దౌర్జన్యాలు చేయాలని చూస్తే నిర్మోహమాటంగా అణచివేస్తామని హెచ్చరించారు. ఓడిపోయినా వైసిపి నాయకులు ఇంకా టిడిపి నాయకులపై దాడులు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని చెప్పారు. దీనిని సహించేది లేదన్నారు. రాజధాని ప్రాంతంలో రోడ్లను తవ్వేశారని, పైపులు, రోడ్డు, మట్టిని దొంగతనం చేశారని తెలిపారు. రాజధానిలో ఎక్కడ కట్టిన బిల్డింగ్‌లు అలాగే ఉన్నాయని, ఐకానిక్ కట్టడాలు నిలిచిపోయాయని, ఐఎఎస్, ఐపిఎస్ భవనాలు, అసెంబ్లీ భవనాల్లో తుమ్మచెట్లు మొలిచాయని అన్నారు. తప్పులు చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సిఎం వెంట పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ, పొన్నూరు ఎమ్మెల్యే డి.నరేంద్ర, ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్, సిఆర్‌డిఎ కమిషనర్ కాటంనేని భాస్కర్, తిరువూరు ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాస్, తాడికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి తదితరులు ఉన్నారు.

ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న బుచ్చయ్య చౌదరి, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

నేటి నుంచి అసెంబ్లీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర 16వ శాసనసభ తొలి సమావేశాలు ఈ నెల 21న ఉదయం 9 గంటల 46 నిమిషాలకు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గవర్నరు ఈ నెల 19న నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. తొలిరోజు శాసన సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుంది. అనంతరం స్పీకరు ఎన్నిక కార్యక్రమం ఉంటుంది. ఆ తర్వాత గవర్నరు ప్రసంగం, ధన్యవాద తీర్మానాలు ఉండనున్నాయి.

ప్రొటెం స్పీకరుగా బుచ్చయ్య చౌదరి ప్రమాణం

శాసనసభలో సీనియర్ శాసనసభ్యులైన గోరంట్ల బుచ్చయ్య చౌదరిని ప్రభుత్వం ప్రొటెం స్పీకరుగా నియమించింది. ఈ నెల 21 నుంచి శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో గురువారం రాజ్‌భవన్‌లో ఆయనతో గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్ ప్రొటెం స్పీకరుగా ప్రమాణ స్వీకారం చేయించారు. శాసనసభలో నూతనంగా ఎన్నికైన శాసనసభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. అనంతరం నూతన స్పీకరు ఎన్నిక ప్రక్రియ పూర్తయ్యే వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, గొట్టిపాటి రవి, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, ఎంఎస్ రాజు, సుంకర విజయ్‌కుమార్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

నీట్‌పై స్వతంత్ర కమిటీ దర్యాప్తు

- సుప్రీంకోర్టులో పిటిషనర్ల వాదన
- ఎన్‌టిఎ ఛైర్మన్ నేతృత్వంలో దర్యాప్తుపై అభ్యంతరకరం
- కేంద్రానికి, ఎన్‌టిఎకు ధర్మాసనం నోటీసులు

న్యూఢిల్లీ : నీట్ పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) ఛైర్మన్‌గా ఉన్న వ్యక్తినే దర్యాప్తు కమిటీకి కూడా ఛైర్మన్‌గా నియమించడంపై సుప్రీంకోర్టులో పలువురు పిటిషనర్లు విస్మయం వ్యక్తం చేశారు. ఎన్‌టిఎ ఛైర్మనే దర్యాప్తు కమిటీకి నేతృత్వం వహిస్తే నిష్పక్షపాత విచారణ సాధ్యపడదని ఆందోళన వ్యక్తం చేశారు. స్వతంత్ర కమిటీతోనే దర్యాప్తు చేయించాలని విన్నవించారు. పిటిషనర్ల వాదనలతో సానుకూలంగా స్పందించిన సుప్రీంకోర్టు ధర్మాసనం దీనిపై స్పందన కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి, ఎన్‌టిఎకు గురువారం నాడు నోటీసులు జారీ చేసింది. పిటిషనర్ల వాదనల అనంతరం ఈ అంశంపై జులై 8న విచారణ చేపట్టాలని ధర్మాసనం నిర్ణయించింది. గ్రేస్ మార్కులు కలిపిన 1563 మంది అభ్యర్థులకు తిరిగి నీట్ పరీక్ష నిర్వహించాలని సిఫార్సు చేసిన ఉన్నతస్థాయి కమిటీకి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) ఛైర్మన్ ప్రొఫెసర్ ప్రదీప్ కుమార్‌ను నియమించడాన్ని ప్రశ్నిస్తూ దాఖలైన పిటిషన్లను విచారించాలని ధర్మాసనం నిర్ణయించింది. నీట్ యుజి పరీక్షను నిర్వహించిన ఎన్‌టిఎ ప్రశ్నాపత్రాల లీక్‌లు, ఇతర అవకతవకలకు సంబంధించి పలు ఆరోపణలను ఎదుర్కొంటోంది. గత రెండు వారాల్లో కేంద్రానికి, ఎన్‌టిఎకు వ్యతిరేకంగా అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. "ఈ ఉన్నతస్థాయి కమిటీ ఛైర్‌పర్సన్ ఎన్‌టిఎ అధిపతి కూడా. ఎక్కడా ఎలాంటి తప్పు జరగలేదని చెప్పుకుంటూ 1563 మంది అభ్యర్థుల స్కోర్లను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు." అని పిటిషనర్‌దారుల్లో ఒకరి తరపు న్యాయవాది పేర్కొన్నారు. మొత్తంగా నీట్ 2024 సంక్షోభంపై సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన స్వతంత్ర ప్యానెల్‌తో దర్యాప్తు జరిపించాలని పిటిషనర్లు కోరుతున్నారు. అదానీ - హిండెన్‌బర్గ్ షార్ట్ సెల్లింగ్ కేసులో సుప్రీం మాజీ న్యాయమూర్తి అధ్యక్షతన కోర్టు ఇటువంటి కమిటీని ఏర్పాటు చేసిన విషయాన్ని న్యాయవాది ఉదాహరణగా ప్రస్తావించారు. సెబీని మిగతా 2లో

విద్యామంత్రి రాజీనామా చేయాలి

- సీతారాం ఏచూరి డిమాండ్

న్యూఢిల్లీ : పరీక్షా ప్రశ్నాపత్రాల లీకులతో విద్యావ్యవస్థకు ప్రమాదమని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆందోళన వ్యక్తం చేశారు. నీట్, నెట్ అక్రమాల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రిగా కొనసాగే నైతిక అర్హత ధర్మేంద్ర ప్రధాన్ కోల్పోయారని, ఆయన తక్షణమే రాజీనామా చేయాలని ఏచూరి డిమాండ్ చేశారు. నీట్ నిర్వహణలో ఘోర వైఫల్యానికి కారణమైన ఎన్‌టిఎను రద్దు చేయాలని కోరారు. నీట్‌లో అవకతవకలు, యుజిసి నెట్.. 2024 రద్దు భావితరంపై తీవ్ర ప్రభావం చూపనున్నాయని ఆయన తెలిపారు. ప్రశ్నాపత్రాల లీకేజీ కుంభ కోణాలను నిరసిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి కార్యాలయం వద్ద ఎస్‌ఎఫ్‌ఐ తదితర విద్యార్థి సంఘాలు చేపట్టిన ఆందోళనకు ఆయన సంఘీ భావం తెలి యజేశారు. ఈ సందర్భంగా ఏచూరి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఈ పరీక్షలు రాసిన విద్యార్థులకు తాము సంఘీభావం తెలియజేస్తు న్నామన్నారు. పరీక్షల నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) విఫలమైందన్నారు. ఎన్నో ఆశలతో ఏళ్ల తరబడి కష్టపడి చదివితే.. వారి భవిష్యత్ లీకులతో నాశనమవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యమా.. లేక మరే కారణం ఉన్నా సమగ్ర విచారణ జరపాలని ఏచూరి డిమాండ్ చేశారు. లీకులకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ముగ్గురు సీనియర్ ఐపిఎస్‌ల బదిలీ

- సునీల్‌కుమార్, రిషాంత్‌రెడ్డిలకు నో పోస్టింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సీనియర్ ఐపిఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ ప్రసాద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎసిబి డిజి, మాజీ ఇన్‌ఛార్జి డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డిని ప్రింటింగ్, స్టేషనరీ అండ్ స్టోర్స్ కమిషనర్‌గా నియమించారు. ఎసిబి డిజిగా అతుల్‌సింగ్‌ను ఫుల్ అడిషనల్ చార్జ్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఎపి డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఫైర్ సర్వీసెస్ డిజి పివి సునీల్‌కుమార్‌ను జిఎడిలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఫైర్ సర్వీసెస్ ఫుల్ అడిషనల్ చార్జ్‌ను శంఖబ్రత బాగ్చీకి ఇచ్చారు. అలాగే ఇంటెలిజెన్స్ ఎస్‌పి రిషాంత్‌రెడ్డిని డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోవాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డిజిపిగా కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి, సిఐడి చీఫ్‌గా పివి సునీల్‌కుమార్, తిరుపతి ఎస్‌పిగా రిషాంత్‌రెడ్డిలు వైసిపికి అనుకూలంగా తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టించారనే కారణంతో వీరిపై చర్యల్లో భాగంగానే ఈ బదిలీల ప్రక్రియ జరిగినట్లు పోలీస్‌వర్గాల్లో టాక్.

కీలక పోస్టుల్లోని రిటైర్డు ఉద్యోగుల తొలగింపు

- ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా పలు కీలక శాఖల్లో పలువురు రిటైర్డు ఉద్యోగులు సేవలందించాలని గత ప్రభుత్వ ఉత్తర్వులను ప్రస్తుత ప్రభుత్వం గురువారం రద్దు చేసింది. అటువంటి వారిని వెంటనే తొలగించాలని, లేక తక్షణమే ఆయా ఉద్యోగుల నుంచి రాజీనామా పత్రాలు తీసుకోవాలని, హెచ్‌ఒడిలు, ప్రభుత్వ కార్యదర్శులు, సెక్రటరీలకు సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రిటైర్డు ఉద్యోగుల తొలగింపులకు సంబంధించిన నివేదికను ఈ నెల 24లోగా ఇవ్వాలని కూడా ఆదేశించారు. ఉద్యోగ విరమణ చేసిన వారి సేవలు ఆ శాఖలో తప్పనిసరి అవసరమైతే నిబంధనలను అనుసరించి ప్రభుత్వం వద్ద నూతనంగా ఉత్తర్వులు పొందాలని సూచించారు. ఉద్యోగ విరమణ చేసిన వారు అత్యధికంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, జలవనరులు, గృహ నిర్మాణశాఖల్లో పనిచేస్తున్నట్లు ప్రభుత్వ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అంతేకాకుండా ఆయా ఉద్యోగులకు నిబంధనలకు మించి వేతనాలు చెల్లిస్తున్నట్లు ప్రచారమూ జరుగుతోంది.

నష్టపోయాం... ఆదుకోండి

- కేంద్ర కరువు బృందం ఎదుట రైతుల ఏకరువు

పెట్టుబడి సాయం రూ.20 వేలు జమ చేయాలి

- 24న కలెక్టర్లకు వినతిపత్రాలు • ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

సస్పెండైన ఉపాధ్యాయులకు పోస్టింగు

- సిఇఒ మీనాకు యుటిఎఫ్ వినతి

లోపలి పేజీల్లో

కేజ్రీవాల్‌కు బెయిల్

- రౌస్ అవెన్యూ కోర్టు తీర్పు
- నేడు విడుదల?

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఊరట లభించింది. ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కేజ్రీవాల్‌కు రౌస్ అవెన్యూ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ.లక్ష పూచీకత్తుపై వెకేషన్ బెంచ్ ప్రత్యేక న్యాయమూర్తి బెయిల్‌ను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కేజ్రీవాల్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై రెండు రోజుల పాటు విచారించిన అనంతరం అవెన్యూ కోర్టు వెకేషన్ బెంచ్ న్యాయమూర్తి నియాయ్ బిందు ఈ ఉత్తర్వులు ఇచ్చారు. గురువారం ఉదయం విచారణ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ (ఎఎస్‌జి) ఎస్‌వి రాజు వాదనలు వినిపిస్తూ బెయిల్ పిటిషన్‌ను వ్యతిరేకించారు. అలాగే ఎక్సైజ్ పాలసీ కేసులో కేంద్ర ఏజెన్సీ ఆరోపణలకు మనీ ట్రయల్, ఆధారాలు లేవని కేజ్రీవాల్ తరపు న్యాయవాది వాదనను వ్యతిరేకించారు. 'ఇడి గాలిలో దర్యాప్తు చేయటం లేదు. మా వద్ద ఖచ్చితమైన ఆధారాలు ఉన్నాయి' అని రాజు అన్నారు. కిక్‌బ్యాక్‌లుగా ఇచ్చిన డబ్బులో భాగమైన కరెన్సీ నోట్ల ఫోటోలు ఈడి వద్ద ఉన్నాయని అన్నారు. గోవాలోని సెవెన్ స్టార్ హోటల్‌లో కేజ్రీవాల్ బస చేసిన

విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. హోటల్ బసను కిక్‌బ్యాక్ మనీ ద్వారా చెల్లించారని ఆయన వాదించారు. కేజ్రీవాల్ తన మొబైల్ ఫోన్ గురించి రహస్యంగా ఉన్నందున ఆయనపై వచ్చిన ఆరోపణలను పరిగణలోకి తీసుకోవచ్చని కూడా వాదించారు. 'కేజ్రీవాల్ తన పాస్‌వర్డ్ ఇవ్వడానికి నిరాకరించారు. ఆయన ఫోన్ ఇస్తే చాలా బయటకు వస్తాయి' అని అన్నారు. కేజ్రీవాల్ వ్యక్తిగతంగా ఎలాంటి నేరాల్లో పాలుపంచుకోకపోయినా మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) కింద ఆయనపై విచారణ జరపాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

రాజకీయ నేతల చేతుల్లో కీలుబొమ్మలా ఇడి ..

కేజ్రీవాల్‌కు సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి వాదనలు వినిపించారు. రాజకీయ నేతల చేతుల్లో ఇడి కీలుబొమ్మలా వ్యవహరిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇడి తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ (ఎఎస్జి) ఎస్వి రాజుకు కౌంటర్ ఇచ్చారు. ఇడి ఆరోపణలకు ఎటువంటి ఆధారాలు లేవని పునరుద్ఘాటించారు. 'ఇడి ఒక స్వతంత్ర ఏజెన్సీనా? లేదా కొంతమంది రాజకీయ నాయకుల చేతుల్లో ఆడుతుందా? ఇడి ఎటువంటి ఆధారాలు లేవు. వారు ఇప్పటికీ ఆధారాలు సేకరిస్తూనే ఉంటారు. అది ఎప్పటికీ ముగుస్తుంది. ఆప్ జాతీయ కన్వీనర్ అందుకే పార్టీ చేసిన ప్రతిదానికీ నేను బాధ్యత వహిస్తున్నారు. ఇది ఎల్లప్పుడూ ఊహాగానాలు, నమ్మకాల పరిధిలోనే ఉంది. రూ.100 కోట్ల లంచం అందిందని ప్రకటన చేస్తూనే ఉంటున్నాం. కానీ ఎటువంటి ఆధారం లేదు' అని చౌదరి వాదించారు. కేజ్రీవాల్‌కు ఇతర వ్యక్తుల మాదిరిగానే స్వేచ్ఛను కల్పించాలని కోరారు. అనంతరం కేజ్రీవాల్ బెయిల్‌పై వెకేషన్ బెంచ్ న్యాయమూర్తి నియాయ్ బిందు తీర్పును రిజర్వ్ చేశారు. సాయంత్రం బెయిల్‌ను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కేజ్రీవాల్ శుక్రవారం విడుదలయ్యే అవకాశం ఉంది. రూ.లక్ష బెయిల్ బాండ్ చెల్లించిన తరువాత ఆయన విడుదల కానున్నారు. ఆర్డర్‌పై 48 గంటల పాటు స్టే విధించాలని ఇడి కోరగా, కోర్టు తిరస్కరించింది. ఆదేశాలపై ఎటువంటి స్టే విధించమని న్యాయమూర్తి నియాయ్ బిందు స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు మార్చి 21న కేజ్రీవాల్‌ను మద్యం పాలసీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అరెస్టు చేసింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆయన సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. తిరిగి ఆయన జూన్ 2న తీహార్ జైలులో లొంగిపోయిన సంగతి తెలిసిందే.

ఉద్యోగ కల్పనే అతిపెద్ద సవాల్

- రాయిటర్స్ సర్వేలో నిపుణులు

న్యూఢిల్లీ : దేశ వ్యాప్తంగా నిరుద్యోగ నిర్మూలన, యువతకు ఉద్యోగ కల్పనే ప్రభుత్వానికి అతి పెద్ద సవాల్‌గా మారనుంది. ప్రపంచ ప్రసిద్ధ వార్తాసంస్థ రాయ్‌టర్స్ నిర్వహించిన సర్వేలో రానున్న ఐదేళ్ల కాలంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించడమే అత్యంత కీలకమని తేలింది. మే 15 నుండి జూన్ 18 వరకు దేశవ్యాప్తంగా రాయిటర్స్ సంస్థ ఈ సర్వే నిర్వహించింది. సర్వేలో భాగంగా పలువురు ఆర్థికవేత్తలను, విద్యావేత్తలను రాయ్‌టర్స్ సంస్థ ప్రతినిధులు కలిశారు. వారి అభిప్రాయాలను సేకరించారు. తాము కలిసిన వారిలో 91శాతం మంది నిరుద్యోగ సమస్యను ప్రధానంగా ప్రస్తావించారని, దానిని పరిష్కరించడమే అత్యంత కీలకమని చెప్పారని ఆ సంస్థ గురువారం విడుదల చేసిన ఒక నివేదికలో పేర్కొంది. ఆ నివేదిక ప్రకారం

ఉద్యోగాలను కల్పించడంలో ప్రభుత్వ సామర్థ్యాన్ని సర్వేలో పాల్గొన్న వారిలో పలువురు ప్రశ్నించారు. గడిచిన కాలంలో ఈ విషయంలో ప్రభుత్వం విఫలం చెందిందని వారు అభిప్రాయపడ్డారు. 'గత ఆర్థిక సంవత్సరం భారత్ 8 శాతం పైగా వృద్ధి నమోదు చేసింది. ప్రభుత్వ మూలధన వ్యయం ఇందుకు మద్దతునిచ్చింది. అయినా అసమానతలు కొనసాగాయి, ద్రవ్యోల్బణం కారణంగా ప్రజలు ఒత్తిడికి గురయ్యారు. ఉద్యోగ కల్పన దాదాపుగా జరగలేదు. అరకొరగా జరిగిన చోటు కూడా నామమాత్రపు జీతాలే వచ్చాయి' అని ఈ నివేదికలో పేర్కొన్నారు 'ఈ కారణాల వల్లే ప్రధానీ నరేంద్రమోడీ ఆధ్వర్యంలోని బిజెపి ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికలలో భారీగా మెజారిటీని కోల్పోయింది.' అని తెలిపింది. రానున్న ఐదేళ్ల కాలానికి సంబంధించి ఉద్యోగ కల్పన కోసం నిర్దిష్ట వ్యూహాన్ని కలిగి ఉండాలని, ప్రాథమిక సామాజిక సేవలు అయినా ఆరోగ్యం, విద్య, పోషకాహారం, పారిశుధ్య రంగాల్లో ప్రభుత్వ ఉపాధిని భారీగా పెంచాలని పలువురు నిపుణులు సూచించినట్లు పేర్కొంది.

వృద్ధి రేటు ఉన్నా....

"భారత్‌లో మనకు చాలా విచిత్రమైన సమస్య ఉంది. వృద్ధి రేటు ఎక్కువగా ఉన్నప్పటికీ.. ఉపాధిలో పెరుగుదల లేదు. యువతకు ఉద్యోగాలు, మెరుగైన జీవితాన్ని అందిస్తామని మోడీ అధికారంలోకి వచ్చారు. కానీ పరిస్థితులు చాలా దారుణంగా మారాయి" అని మసాచుసెట్స్ అమ్హెర్స్ట్ యూనివర్శిటీ ప్రొఫెసర్ జయతి ఘోష్ తెలిపారు. దేశంలోని 80 శాతం మంది అసంఘటిత రంగంలోనే ఉన్నారని ఇటీవల ఆర్‌బిఐ ఓ రిపోర్ట్‌లో వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ గ్రామీణ ప్రాంతాలలో ఉన్న వారిని నిరుద్యోగులుగా నమోదు చేయడం లేదని యూనివర్శిటీ ఆఫ్ మాంచెస్టర్‌లో డెవలప్‌మెంట్ ఎకనామిక్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ప్రొఫెసర్ బీనా అగర్వాల్ చెప్పారు.

ఢిల్లీలో వడగాడ్పులకు 17 మంది మృతి

న్యూఢిల్లీ : ఢిల్లీలో అధిక ఉష్ణోగ్రతలు ప్రజల్ని బెంబేలెత్తిస్తున్నాయి. వడగాల్పుల బారినపడి గడిచిన 24 గంటల్లో 17 మంది మరణించినట్లు సంబంధిత అధికారులు గురువారం ఉదయం 10 గంటల ప్రాంతంలో తెలిపారు. అలాగే వడదెబ్బ తగిలి ఆసుపత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోందని చెప్పారు. సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో వడదెబ్బ సంబంధిత సమస్యలతో 33 మంది చేరినట్లు అధికారులు తెలిపారు. వీరిలో గత 24 గంటల్లో 13 మంది చనిపోయారన్నారు. రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రిలో 22 మంది చేరారని, వారిలో నలుగురు మరణించినట్లు చెప్పారు. మిగిలిన ఆసుపత్రుల్లో కూడా వడదెబ్బ బాధితులు గణనీయంగా చేరుతున్నారని అధికారులు తెలిపారు. ఢిల్లీతో పాటు ఉత్తర భారతంలో అనేక ప్రాంతాల్లో గత కొన్ని రోజుల నుంచి వేడి గాలులు వీస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఢిల్లీలో గురువారం ఉదయం వర్షం కురియడంతో కాస్త ఉపశమనం లభించింది.

మళ్లీ మనమే!

- చంద్రబాబు హామీలను అమలు చేయలేరు
- వైసిపి విస్తృత సమావేశంలో మాజీ సిఎం జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'ఎన్నికల్లో ఓటమిపై ఎవరూ నిరుత్సాహ పడవద్దు. అబద్ధాల హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఐదేళ్లలో ఏ ఒక్క హామీని అమలు చేయలేరు. 2029లో మళ్లీ మనదే అధికారం. తెలుగుదేశం పార్టీని సింగిల్ డిజిట్‌కే ప్రజలు పరిమితం చేస్తారు.' అని వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం వైసిపి విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఇటీవల జరిగిన ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన అభ్యర్థులు హాజరయ్యారు. వారి నుద్దేశించి మాట్లాడిన జగన్ చంద్రబాబునాయుడు 2014లో అమలుకాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చినా 2019 ఎన్నికల నాటికి ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. అదే తీరులోనే 2024 ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో కూడా విఫలం చెందుతారని చెప్పారు. ప్రజలు ఇవన్నీ గుర్తు పెట్టుకుని వైసిపిని మళ్లీ ఆశీర్వదిస్తారని అన్నారు. 2029లో చంద్రబాబునాయుడికి కేవలం సింగిల్ డిజిట్ మాత్రమే వస్తుందని అన్నారు. రాష్ట్రంలో వైసిపి విశ్వసనీయతతో రాజకీయాలు చేసిందన్నారు. 2014కు ముందుగానీ, 2024 ఎన్నికలకు ముందుగానీ అమలుకు సాధ్యంకానీ హామీలను ఇవ్వాలని తనపై విపరీతమైన ఒత్తిడి వచ్చినా విశ్వసనీయత దెబ్బతింటుందని ఇవ్వలేదన్నారు. 2014 ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయలేక తెలుగుదేశం మాయ చేస్తే 2019లో మిగతా 2లో

మంత్రులుగా ప్రమాణస్వీకారం చేస్తున్న నిమ్మల రామానాయుడు,

ఆనం రామనారాయణ రెడ్డి,

అనగాని సత్యప్రసాద్,

కందుల దుర్గేష్,

ఎస్ సవిత,

టిజి భరత్,

కె శ్రీనివాస్

'పోలవరం'పై శ్వేతపత్రం ఇస్తాం

- జలవనరులశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును వైసిపి ప్రభుత్వం విధ్వంసం చేసిన తీరుతోపాటు ప్రస్తుత పరిస్థితులపై శ్వేతపత్రం విడుదల చేస్తామని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. గురువారం అమరావతిలోని సచివాలయం నాలుగో బ్లాక్‌లో నిమ్మల రామానాయుడు జలవనరులశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరంతోపాటు ఇతర ప్రాజెక్టులను ప్రాధాన్యతగా తీసుకుని పూర్తిచేస్తామన్నారు. గత ప్రభుత్వం సాగునీరు, వ్యవసాయం, రైతుల పట్ల నిర్లక్ష్యం వహించిందన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం సాగునీటి రంగానికి రూ.80 వేల కోట్లు ఖర్చు చేస్తే ఆ తర్వాత వైసిపి ప్రభుత్వం నిధులివ్వకుండా సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేసి 20 ఏళ్లు వెనక్కు నెట్టిందన్నారు. వ్యవసాయ రంగాన్ని కూడా విస్మరించిందన్నారు. సాగునీటి రంగాన్ని గాడిలో పెట్టాల్సి వుందన్నారు. ఈ సవాళ్లను అధిగమించి పోలవరాన్ని సకాలంలో పూర్తిచేస్తామని తెలిపారు. ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా వైసిపి నేతలు తమ తప్పులను సమర్థించుకునే ప్రయత్నాలు చేయడం తగదని అన్నారు. పంటకాల్వల్లో గుర్రపుడెక్క తొలగింపు సహా పూడికతీతపై ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు తొలి సంతకం చేశారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నింటికీ గేట్లు, షట్టర్లు, లాకుల మరమ్మతు కోసం నిధులు విడుదల చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్, ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఇఎన్‌సి నారాయణరెడ్డి, ప్రభుత్వ సలహాదారు వెంకటేశ్వర్లు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయ భూముల పరిరక్షణకు కృషి

- దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ఆలయాలను కాపాడటంతోపాటు వాటికి సంబంధించిన ప్రతి సెంటు భూమినీ పరిరక్షించేందుకు కృషి చేస్తామని దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. విజయవాడ గొల్లపూడిలోని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ కమిషనరేట్‌లో గురువారం ఆయన మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ధూప దీప నైవేద్య పథకం కింద అర్చకులకు ఇస్తున్న మొత్తం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచే ఫైలుపై తొలి సంతకం చేశారు. ఆలయ పునర్నిర్మాణ పనుల పర్యవేక్షణ, అనుమతులకు సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటుకు సంబంధించిన మరో ఫైల్‌పైనా సంతకాలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 26 వేలకు పైగా ఆలయాలున్నాయని, వాటి ఆస్తులు, ఆదాయాలు నిర్వహణలో లోపాలను సరిదిద్ది ప్రక్షాళన చేయనున్నామన్నారు. పాలక వర్గాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర సచివాలయంలో మరమ్మతు పనులు జరుగుతున్నాయని, జులై 3 తర్వాత పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ కమిషనరు ఎస్ సత్యనారాయణ, అడిషనల్ కమిషనరు-1 చంద్రకుమార్, అడిషనల్ కమిషనరు-2 కె.రామచంద్రమోహన్‌తో పాటు ఉన్నతాధికారులు రత్నరాజు, చంద్రశేఖర్ ఆజాద్, ఆర్‌జెసిలు సుబ్బారావు, మూర్తి, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ఇఒ కెఎస్ రామారావు, పలువురు ఇఒలు పాల్గొన్నారు.

రెవెన్యూశాఖలో జవాబుదారీతనం

- కోర్టు కేసుల సమర్థ నిర్వహణకు ఆన్‌లైన్‌లో రెవెన్యూ కోర్టు
- మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రెవెన్యూశాఖ అందించే పౌరసేవల విషయంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేలా చర్యలు చేపట్టడంతోపాటు శాఖలో జవాబుదారీ తనం పెంపొందించేలా కృషి చేస్తామని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. గురువారం సచివాలయంలోని నాలుగో బ్లాక్‌లో రెవెన్యూశాఖ మంత్రిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూశాఖను దేశంలోనే ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దేందుకు అన్ని విధాలా కృషి చేస్తానన్నారు. ప్రస్తుతం భూముల రీసర్వేలో రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు, ప్రత్యేక అకాడమీని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గురువారం రెవెన్యూ దినోత్సవం సందర్భంగా మంత్రి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. నిర్ణీత కాలవ్యవధిలో సర్టిఫికెట్ల జారీకి తగిన కార్యాచరణ చర్యలు తీసుకుంటామన్నారు. కోర్టు కేసుల సమర్ధ నిర్వహణ కోసం ఆన్‌లైన్‌లో రెవెన్యూ కోర్టు విధానాన్ని తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. మంత్రి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ముందు ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జి సాయిప్రసాద్, అజయ్‌జైన్, రెవెన్యూశాఖకు చెందిన మరో అధికారి ప్రభాకర్‌రెడ్డి, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు చెందిన రవికుమార్, ఎపి రెవెన్యూ సర్వీసెస్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రముఖ పర్యాటక కేంద్రంగా రాష్ట్రం : దుర్గేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సహజసిద్ధమైన ప్రకృతి అందాలతో రాష్ట్రాన్ని దేశంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సచివాలయంలో గురువారం ఆయన మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. రూ.2.31 కోట్ల అంచనా వ్యయంతో 10 టూరిజం బోట్లను కొనుగోలు చేసే ఫైల్‌పై ఆయన తొలి సంతకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 974 కిలోమీటర్ల సముద్రతీర ప్రాంతంతో, సహజ సిద్ధమైన ప్రకృతి అందాలతో అలరారే రాష్ట్రానికి పర్యాటకపరంగా ఉజ్వల భవిష్యత్తు ఉందని చెప్పారు. పర్యాటకం, కళల పట్ల ప్రత్యేక శ్రద్ధ ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో, పర్యావరణహితమైన పర్యాటకాన్ని అభివృద్ధి పర్చాలనే ఆలోచన ఉన్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నేతృత్వంలో రాబోయే ఐదేళ్లలో అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్దిదిద్దుతామని చెప్పారు. సినీరంగ పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన స్టూడియోల నిర్మాణానికి రాష్ట్రం ఎంతో అనువుగా ఉందన్నారు. స్టూడియోల నిర్మాణానికి, మౌలిక వసతుల మెరుగు సినీ రంగ ప్రముఖులు, నిర్మాతలు రాష్ట్రానికి పెద్దయెత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పర్యాటకాభివృద్ధి కార్పొరేషన్ ఎమ్‌డి కన్నబాబు, ఇడి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

- రెవెన్యూ మంత్రికి విఆర్ఎల సంఘం వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ రెవెన్యూ సహాయకులకు పే స్కేలు అమలుతోపాటు 2018 నుంచి రికవరీ చేసిన డిఎ బకాయిలను తిరిగి చెల్లించాలని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి అంజి, కె ఉమామహేశ్వరరావు మంత్రిని కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. అర్హులైన వారికి ఉద్యోగోన్నతులు కల్పించాలని, తెలంగాణలో అమలవుతున్న విధంగా పే స్కేలు అమలు చేయాలని, నామినీలను విఆర్ఎలుగా గుర్తించాలని, గ్రాట్యూటీ చెల్లింపు కాలపరిమితిని 2 నుంచి 10 పదేళ్లకు పెంచాలని మంత్రిని కోరారు. రీ సర్వే విధులు నిర్వహిస్తున్న విఆర్ఎలకు టిఎ, డిఎలు చెల్లించాలని, అటెండర్, వాచ్‌మెన్, విఆర్‌ఒ, రికార్డు అసిస్టెంట్, డ్రైవరు, స్వీపర్, ఖాళీ పోస్టుల్లో అర్హులైన విఆర్ఎలను నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

'పిన్నెల్లి' పిటిషన్లపై తీర్పు రిజర్వ్

ప్రజాశక్తి-అమరావతి

పోలీసులు పెట్టిన మూడు కేసుల్లో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై గురువారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. తీర్పును తర్వాత వెలువరిస్తామని జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు గురువారం ప్రకటించారు.

ఇవిఎం కేసులో, రెండు హత్యాయత్నం కేసుల్లో గతంలో హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఎన్నికల సంఘం, పోలీసుల తీరును పిటిషనరు తరపున సీనియర్ అడ్వకేట్ నిరంజన్‌రెడ్డి తప్పుపట్టారు. పోలీసులు పరిధి దాటి వ్యవహరించారని, గతంలో ఎన్నడూ లేని విధంగా ఇసి తీరు ఉందన్నారు. పోలీసుల న్యాయవాది ఎన్ అశ్వనీ కుమార్ ప్రతివాదన చేస్తూ.. ఇవిఎం ధ్వంసం ఘటనను తీవ్రమైనదని చెప్పారు. హత్యాయత్నం కేసుల్లో ఉపశమనం కల్పించవద్దని కోరారు. బెయిల్ ఉత్తర్వులను కూడా ఉల్లంఘించారని అన్నారు. అశ్వనీకుమార్ వాదించడంపై నిరంజన్‌రెడ్డి అభ్యంతరం చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ లేదా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నియామకం చేసేందుకు మాత్రమే రూల్స్ ఉన్నాయని స్పెషల్ కౌన్సిల్ గురించి చట్టంలో లేదన్నారు. వాదనల తర్వాత హైకోర్టు తీర్పును వాయిదా వేసింది.

పోలీసులపై హైకోర్టు ఆగ్రహం

పోలీసులు స్వాధీనం చేసుకున్న 195 ఆవులు, ఎద్దులు, దూడలను స్వాధీనం చేసుకున్న తర్వాత వాటి విషయంలో చట్ట ప్రకారం చర్యలు ఎందుకు తీసుకోలేదని హైకోర్టు ప్రశ్నించింది. ఎవరో వచ్చి వాటి యజమానిని తానేనని చెబితే వాటిని ఎలా అప్పగిస్తారని నిలదీసింది. పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై తీవ్ర పరిణామాలు ఎదుర్కొనాల్సి ఉంటుందని విజయవాడ, భవానీపురం పోలీసులను హెచ్చరించింది. ఆవులు, దూడల యజమానిగా చెప్పుకునే ఉమర్ షారూక్ అనే వ్యక్తి వినతి మేరకు ప్రతివాదిగా చేర్చేందుకు అనుమతినిచ్చింది. విచారణను శుక్రవారానికి వాయిదా వేస్తూ జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ జగడం సుమతితో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశాలిచ్చింది.

పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆవులు, దూడలకు తానే యజమాని అని చెబితే పోలీసులు వాటిని ఇచ్చేయడాన్ని సవాల్ చేస్తూ విజయవాడకు చెందిన గోపాలరావు, సురేష్‌బాబు దాఖలు చేసిన పిటిషన్‌ను బెంచ్ విచారణ జరిపింది.

నెల రోజుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం

- రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణంపై రానున్న 15 రోజుల్లో కమిటీ వేసి, పక్క రాష్ట్రాల్లో అధ్యయనం చేసి నెల రోజుల్లో అమలు చేస్తామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి ఎం రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విజయవాడ బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రామ్‌ప్రసాద్ ఎపిఎస్ ఆర్‌టిసి ఎమ్‌డిగా బాధ్యతలను నిర్వహించి, రాష్ట్ర డిజిపిగా బాధ్యతలు స్వీకరించనున్న ద్వారకా తిరుమలరావును అభినందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆర్‌టిసిని గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. ఐదేళ్లలో కొత్త బస్సులను కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. ఆర్‌టిసిని గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రయాణికులు, ఉద్యోగులను కాపాడుకునే బాధ్యత తనపై ఉందన్నారు. ఆర్‌టిసి మనుగడ కాపాడేందుకు, నాణ్యమైన సేవలు అందించేందుకు కషి చేస్తామని తెలిపారు. అలాగే ఆర్‌టిసికి వున్న వేల కోట్ల రూపాయల ఆస్తులను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రయాణికులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు.

ఇకపై ఉద్యోగులు చనిపోతే ఇచ్చే మట్టిఖర్చులను రూ.15వేల నుండి రూ.25 వేలకు పెంచుతామన్నారు. దూర ప్రాంతాలకు నడిచే బస్సుల సంఖ్యను కూడా పెంచుతామని తెలిపారు. కొత్తగా ఎలక్ట్రిక్ బస్సులు కొంటామని చెప్పారు. అన్ని బస్ స్టేషన్లలో భోజన సదుపాయాలు, వాష్‌రూమ్‌లు మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మంత్రి వెంట ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ గోపినాథ్‌రెడ్డి, ఎన్‌టిఆర్ జిల్లా ప్రజారవాణా అధికారి ఎంవై దానం తదితరులు వున్నారు.

ఉద్యోగ సంఘాల అభినందన

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి మొదటిసారి విజయవాడ ఆర్‌టిసి బస్టాండ్‌కు వచ్చిన సందర్భంగా ఆర్‌టిసిలోని పలు ఉద్యోగ సంఘాల నాయకులు మంత్రికి ఘనస్వాగతం పలికారు. అలాగే ఆర్‌టిసి ఎమ్‌డిగా వుంటూ రాష్ట్ర డిజిపిగా వెళ్తున్న ద్వారకా తిరుమలరావుకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలానిభాష, రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య, నాయకులు దొర తదితరులు మంత్రిని కలిసి అభినందించారు. అలాగే ఎపిపిటిడి కార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌వి శేషగిరిరావు, వై శ్రీనివాసరావు, నాయకులు కె సురేంద్ర తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎపిపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జివి నర్సయ్యలు మంత్రిని, ఎమ్‌డిని అభినందించారు.

నెల్లూరులో ఘోర అగ్నిప్రమాదం

- వికలాంగురాలు సజీవదహనం
- రెండు పూరిగుడిసెలు ఆహుతి

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరులో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. నగరంలోని 5వ డివిజన్ బర్మాషల్ గుంట ప్రాంతంలోని పేదల పూరిగుడిసెలు అగ్నికి ఆహుతయ్యాయి. ఒక్కసారిగా నల్లటి పొగ కమ్మేయడంతో ఏమి జరుగుతుందోనన్న భయంతో చుట్టు పక్కల వారు, స్థానికంగా ఉన్న వారు ప్రాణభయంతో పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది అతికష్టం మీద మంటలను అదుపులోకి తీసుకువచ్చింది. స్థానికుల వివరాల మేరకు.. ఈ కాలనీలో నివసిస్తున్న కొందరు రోజువారి కార్మికులు. మరికొందరు బీడిలు, చుట్టలు చుట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం నాగలక్ష్మి అనే వికలాంగురాలు ఇంటిలో గ్యాస్‌లీకైంది. దీనికి తోడు షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. ఒక ఇంటి నుంచి మరో ఇంటికి మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకుని అతికష్టం మీద మంటలను అదుపుచేసింది.

మంటల్లో చిక్కుకున్న నాగలక్ష్మి (12) బయటకు రాలేక సజీవదహనమయ్యారు. ఈ ప్రమాదంలో రెండు పూరిగుడిసెలు పూర్తిగా కాలిపోగా 14 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కార్మికులందరూ పనులకు వెళ్లడంతో ఇంటిలోని సామాగ్రి కాలిబూడిదైంది. కలెక్టర్ హరినారాయణన్ సంఘట స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం తరుపున సాయం చేస్తామన్నారు. ఘటనాస్థలాన్ని సిపిఎం, జిల్లా కార్యదర్శి మూలం రమేష్, టిడిపి జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ పరిశీలించారు. ప్రమాదంలో ఇళ్లు కోల్పోయినవారికి ప్రభుత్వమే పక్కా ఇళ్లు నిర్మించాలని రమేష్ విజ్ఞప్తి చేశారు. బాలిక కుటుంబానికి రూ.50 వేలు, దెబ్బతిన్న ఇళ్లకు రూ.15 వేలు ఆర్థిక సహాయం ప్రభుత్వం అందజేస్తుందని మంత్రి నారాయణ ప్రకటించారు.

సచివాలయానికి మరమ్మతులు

- మంత్రుల ఛాంబర్లలో సమూల మార్పులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కొత్త ప్రభుత్వం కొలువు తీరుతున్న వేళ రాష్ట్ర సచివాలయంలో మరమ్మతు పనులు జోరుగా సాగుతున్నాయి. అలాగే మంత్రులకు కేటాయిస్తున్న ఛాంబర్ల పనులు కూడా నిర్విరామంగా జరుగుతున్నాయి. ఈ కారణంగానే మంత్రుల బాధ్యతల స్వీకరణలో జాప్యం జరుగుతోందని అధికారులు చెబుతున్నారు. 2016లో తాత్కాలిక సచివాలయంలోకి ప్రభుత్వ శాఖలు వచ్చినప్పటి నుంచి అనేక సమస్యలు నెలకొంటున్నాయి. కారిడార్లలో నేలపై పలకలు విరిగిపోవడం, కొన్ని అదృశ్యమవడం, ఈ ప్రాంతాల్లో గుంతలు ఏర్పడి నడిచేవారికి తీవ్ర ఇబ్బందులు నెలకొనడం తరచూ జరుగుతుండేది. అలాగే అన్ని భవనాల్లో గోడలు బీటలువారడం కూడా కనిపించింది. ఇన్నాళ్లూ వీటిని పట్టించుకోని యంత్రాంగం ఇప్పుడు హడావుడిగా పగుళ్లు కనిపించకుండా తెల్లటి సున్నం రాయడం, పలకలను కొత్తగా తెప్పించి వేయడం వంటి చర్యలు తీసుకుంటుంది. అలాగే మంత్రుల అభీష్టం మేరకు ఛాంబర్లలో కూడా భారీ మార్పులు చేస్తున్నారు. కొత్త కొత్త ఫర్నీచర్లను తెప్పించి అలంకరణలు చేస్తున్నారు.

వార్షిక బడ్జెట్ వరకు కెవివి సత్యనారాయణ కొనసాగింపు?

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న ఆర్థికశాఖ కార్యదర్శి కెవివి సత్యనారాయణను బడ్జెట్ సమావేశాలు పూర్తయ్యేంత వరకు కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు ఆయనను ఆర్థికశాఖలోనే కొనసాగిస్తున్నట్లు కొద్ది రోజుల క్రితం మెమో కూడా జారీ చేసింది. ప్రస్తుతం ఆర్థికశాఖలో అనుభవం ఉన్నది ఒక్క సత్యనారాయణ మాత్రమే కావడం, ముఖ్యమంత్రి అభీష్టం మేరకు ఓట్ ఆన్ అకౌంట్‌ను పూర్తిగా మార్పు చేయాల్సిన అవసరం ఉండడంతో సత్యనారాయణను కొనసాగించాలని నిర్ణయించారు. వచ్చే నెలలో పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలు జరగనున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆర్థికశాఖకు ఇద్దరు యువ ఐఎఎస్ అధికారులను నియమించారు. జానకి, వినయ్‌చంద్‌లు ఇద్దరికీ ఆర్థికశాఖపై ఇంకా అనుభవం లేకపోవడం వల్ల, సెలవుపై ఉన్న రావత్ స్థానంలో కొత్త అధికారిని నియమించాలని నిర్ణయించడం వల్లనే సత్యనారాయణను కొనసాగించాలని నిర్ణయించినట్లు సమాచారం.

ఉద్యోగులపై దాడులు సరికావు

- సిఎం చంద్రబాబుకు బండి శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులపై టిడిపి, జనసేన కార్యకర్తలు బెదిరింపులకు, దాడులకు పాల్పడుతున్నారని, తక్షణం ఆ దాడులను నిలిపేయాలని ఎపిఎన్‌జిఒ రాష్ట్ర మాజీ అధ్యక్షులు బండి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు గురువారం ఆయన లేఖ రాశారు. ఉద్యోగుల పట్ల జెసి ప్రభాకర్‌రెడ్డి, అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడు భయభ్రాంతులకు గురిచేసేలా మాట్లాడుతున్నారని అన్నారు. అలాగే కృష్ణా జిల్లాలో జనసేన కార్యకర్తలు దౌర్జన్యం చేశారని పేర్కొన్నారు. తక్షణం అలాంటి వారిని కట్టడి చేసి ఉద్యోగులకు అండగా నిలవాలని సిఎంను కోరారు.

సిఇఓ మీనాకు టిడిపి నేతల సత్కారం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాను టిడిపి నాయకులు సత్కరించారు. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఆధ్వర్యాన మీనాను సచివాలయంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా సహకరించారని చెప్పారు. ఓటరు వెరిఫికేషన్‌లో పారదర్శకత, ఎన్నికల నోటిఫికేషన్ నుంచి ఫలితాలు వచ్చే వరకు ఎటువంటి పెద్ద ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నారని అభినందించారు. దేశంలోనే అత్యధిక పోలింగు జరిగేలా చూడటంలో మీనా కృషి ఎనలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజశేఖర్, మాజీ ఎమ్మెల్సీ ఎఎస్ రామకృష్ణ, నాయకులు బుచ్చి రామ్‌ప్రసాద్, కోడూరి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

కీలకశాఖగా ఉన్న హోంమంత్రి పదవిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దళిత ఎస్‌సి మహిళకు ఇవ్వడం గర్వకారణమని వర్ల రామయ్య అన్నారు. హోంమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వంగలపూడి అనితను సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామయ్య ఆశీర్వాదం అనిత తీసుకున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలపై ఇరువురు చర్చించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడటంలో, ఎస్‌సిలపై దాడులను అరికట్టడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. అలాగే హోంమంత్రి కార్యాలయం వద్ద కనపడిన రాజధాని మహిళా రైతులను రామయ్య అభినందించారు. రాజధాని కోసం అలుపెరగని పోరాటాలు చేశారని గుర్తుచేశారు.

ఘనంగా భువనేశ్వరి జన్మదిన వేడుకలు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి జన్మదినం సందర్భంగా టిడిపి కార్యాలయంలో వేడుకలు జరిగాయి. భువనేశ్వరి నిర్వహించిన నిజం గెలవాలి టీం సభ్యుల ఆధ్వర్యాన కేక్ కటింగ్ నిర్వహించారు.

నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో ప్రజలంతా చైతన్యం పొందారని, నిజాన్ని గెలిపించారని ఈ సందర్భంగా భువనేశ్వరి అన్నారు. ఈ కార్యక్రమంలో నిజం గెలవాలి కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ పి అనురాధ, కార్యాలయ కార్యదర్శి రమణ, నాయకులు బ్రహ్మం చౌదరి, సూర్యప్రకాష్, వాలంటీర్ల కో-ఆర్డినేటర్ రవి నాయుడు, మీడియా కో-ఆర్డినేటర్ జస్వంత్ కాసరనేని తదితరులు పాల్గొన్నారు.

బిసి స్టడీ సర్కిళ్లలో ఉచిత డిఎస్‌సి కోచింగ్

- తొలిసంతకం చేసిన బిసి సంక్షేమమంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో బిసి స్టడీ సర్కిళ్లలో వెనుకబడిన తరగతుల విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉచిత డిఎస్‌సి కోచింగ్ అందించే దస్త్రంపై బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత సంతకం చేశారు. సచివాలయంలో గురువారం ఆమె మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఎన్టీఆర్ విదేశీ విద్య పథకం కొనసాగింపు పథకాలపై రెండో సంతకం చేశారు. 2014-19లో ఉమ్మడి జిల్లాలకు మంజూరు చేసిన బిసి భవన్ల నిర్మాణాలను పూర్తిచేస్తామని చెప్పారు. చేనేత కళాకారులు, హస్త కళాకారులకు తగిన సబ్సిడీలు, ప్రోత్సాహకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. వారానికి ఒక్కసారైనా సచివాలయ ఉద్యోగులు, ప్రజలు చేనేత వస్త్రాలు ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ, ఇడబ్ల్యుఎస్ సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి అనంతరాము, చేనేత జౌళి శాఖ ముఖ్యకార్యదర్శి కె సునీత, కమిషనర్ ఎంఎం నాయక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సచివాలయంలో మూడో బ్లాక్‌లో ఉన్న లేపాక్షి ఎంపోరియాన్ని సునీతతో కలిసి సందర్శించారు.

పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధిపరుస్తాం: బాధ్యతలు స్వీకరించిన భరత్

రాష్ట్ర పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి పరుస్తానని పారిశ్రామిక, వాణిజ్య, ఆహార శుద్ధిశాఖ మంత్రి టిజి భరత్ అన్నారు. సచివాలయంలో గురువారం ఆయన మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. పారిశ్రామికంగా రాష్ట్రాన్ని సమగ్రాభివృద్ధి పరిచేందుకు పటిష్టమైన ప్రణాళికతో వ్యూహాత్మకంగా ముందుకు అడుగులు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ కార్యదర్శి, ఎండి యువరాజ్, అదనపు కార్యదర్శి మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నపరిశ్రమల ఏర్పాటుకు కృషి: మంత్రి కొండపల్లి శ్రీనివాస్

రాష్ట్రంలో చిన్న పరిశ్రమల ఏర్పాటు, ఎన్ఆర్ఐల సహకారంతో యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడానికి, డ్వాక్రా గ్రూప్ మహిళల పారిశ్రామిక ఎదుగుదలకు ఒక రోడ్ మ్యాప్‌ను త్వరలోనే రూపొందిస్తామని చిన్న, మధ్య, సూక్ష్మ పరిశ్రమల, సెర్ప్, ఎన్ఆర్ఐ సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సచివాలయంలో గురువారం ఆయన మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 20 ఆదర్శ మండలాలకు రూ.10లక్షల చొప్పున నిధులు, ఎస్‌సి, ఎస్‌టి, ఎస్‌హెచ్‌జిలకు అందుబాటులో ఉన్న నిధులతో వడ్డీలేని రుణాలు మంజూరు చేస్తూ రెండు ఫైళ్లపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కార్యదర్శి ఎన్ యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపిపై దాడుల వివరాలివ్వండి : హైకోర్టు

ప్రజాశక్తి - అమరావతి

చట్టసభలకు జరిగిన ఎన్నికల సమయంలో వైసిపి కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగాయనే కేసులో పూర్తి వివరాలను నివేదించాలని రాష్ట్రానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, డిజిపిలకు నోటీసులిచ్చింది. విచారణను 4 వారాలకు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశాలిచ్చింది. దాడులను పోలీసులు చూస్తూ ఉన్నారని, ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ రాజ్యసభ సభ్యుడు, వైసిపి సీనియర్ నేత వైవి సుబ్బారెడ్డి వేసిన పిల్ తరపున న్యాయవాది కొవ్వూరి వెంకట్రామిరెడ్డి వాదించారు.

నీట్‌పై స్వతంత్ర కమిటీ దర్యాప్తు

(మొదటి పేజీ తరువాయి)

దర్యాప్తు చేయాల్సిందిగా ఆదేశించారు. కానీ ఈ కోర్టు కూడా స్వతంత్ర ప్యానెల్‌ను ఏర్పాటు చేసిందని న్యాయవాది పేర్కొన్నారు.

గురువారం విచారణకు వచ్చిన దాదాపు 10 పిటిషన్లు కూడా జూన్ 23న 1563 మంది అభ్యర్థులకు తిరిగి పరీక్ష నిర్వహించాలని నిర్ణయించడానికి ఎన్‌టిఎ ఉపయోగించిన విధానాన్ని, పద్ధతిని ప్రశ్నించాయి. 'ఆ 1563 మందికి మళ్లీ పరీక్ష పెట్టాలని ఎలా నిర్ణయించారు? ఇందుకు ఎటువంటి ప్రామాణికాలు అనుసరించారు? ఇంతవరకు ఆ విద్యార్థుల జాబితాను వెబ్‌సైట్‌లోగానీ మరెక్కడా గానీ ప్రచురించలేదు. ఇదంతా కూడా పూర్తిగా ఏకపక్షంగా జరిగింది.' అని పిటిషనర్లు వాదించారు. పిటిషనర్లలో పరీక్షలు రాసిన అభ్యర్థులు, వారి బంధువులు, కోచింగ్ సెంటర్ల ప్రతినిధులు ఉన్నారు. అసలు తిరిగి పరీక్ష నిర్వహించడాన్ని ఒక పిటిషనర్ సవాలు చేశారు. ఏడాదికి ఒకసారి మాత్రమే నీట్ జరగాలని చట్టం చెబుతోందన్నారు. అందువల్ల ఏడాదిలో రెండుసార్లు ఎలా పెడతారని ప్రశ్నించారు. జులై 8కి ఈ పిటిషన్లపై విచారణకు కోర్టు నిర్ణయించింది. 'కౌన్సెలింగ్‌ను ఆపేది లేదు. ఒకవేళ పరీక్ష జరిగితే, కౌన్సెలింగ్ కూడా జరుగుతుంద'ని జస్టిస్ విక్రమ్ నాథ్ వ్యాఖ్యానించారు.

మళ్లీ మనమే !

(మొదటి పేజీ తరువాయి)

వైసిపి మేనిఫెస్టోను 99శాతం అమలు చేశామని తెలిపారు. ఈ నిజాయితీనే మనల్ని నిలబెడుతుందన్నారు. తమకు ఉన్న సంఖ్యాబలం చాలా తక్కువే అయినా ప్రజలకు తోడుగా ఉంటామని, వారికి మద్దతుగా పోరాటాలు చేస్తామని చెప్పారు. స్పీకర్ పదవి తీసుకునే వ్యక్తి మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయని, జగన్ ఓడిపోయాడు.. ఇంకా చావలేదని, చచ్చే వరకు జగన్‌ను కొట్టండనే మాటలను ప్రజలు గమనిస్తుంటారని అన్నారు. ఇలాంటి వ్యక్తి రేపు స్పీకర్ అవుతారంటే రాష్ట్రంలో రాజకీయం ఎలా వుంటుందో అర్థం అవుతూనే వుందన్నారు. 'మనం ఇలాంటి కౌరవ సామ్రాజ్యంలోకి వెళ్లబోతున్నాం. అక్కడ మనం ఏదో చేస్తామనే నమ్మకం మాత్రం లేదు' అని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు సమయానికి అందే బటన్‌నొక్కే కార్యక్రమాలన్నింటిని నిలిపేశారని విమర్శించారు వైసిపి ప్రభుత్వం పార్టీలకతీతంగా పాలనసాగిస్తే ఇప్పుడు తమకు ఓటేయలేదనే కారణంతో ప్రజలను హింసిస్తున్నారన్నారు. వారి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని, వారి పాపాలు పండే సమయం త్వరలోనే వస్తుందని అన్నారు. కేంద్రంలో బిజెపికి తగిన సంఖ్యాబలం లేనందున తెలుగుదేశం గెలుపొందిన 16 ఎంపి స్థానాలు చాలా కీలకంగా మారాయని, ఇలాంటి నేపథ్యంలో రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదాను చంద్రబాబు అడగకపోవడం ద్రోహం చేసినట్లవుతుందని చెప్పారు.

శ్రీవారిని దర్శించుకున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారిని మంత్రి కొల్లు రవీంద్ర దర్శించుకున్నారు. గురువారం ఉదయం విఐపి దర్శన సమయంలో స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నష్టపోయిన అని వర్గాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించానన్నారు. కొల్లు రవీంద్రను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కలిసి దుశ్శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వృద్ధురాలు దారుణ హత్య

- రూ.25వేల నగదు, కమ్మలు అపహరణ

ప్రజాశక్తి - మడకశిర

శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలంలో వృద్ధురాలు దారుణహత్యకు గురయ్యారు. పోలీసుల వివరాల మేరకు..ఎల్లోటి గ్రామానికి చెందిన చంద్రక్క (52) ఒంటరిగా నివసిస్తున్నారు. గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో కాలినడకన తడకలపల్లికి బయలుదేరారు. మార్గమధ్యంలో గుర్తు తెలియని దుండగులు ఆమె గొంతుకోసి హత్య చేశారు. చంద్రక్క వద్ద ఉన్న రూ.25వేల నగదు, బంగారు కమ్మలను దోచుకెళ్లారు. రక్తపు మడుగులో పడి ఉన్న వృద్ధురాలిని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. దొంగతనం నేపథ్యంలో హత్య జరిగిందా? మరే ఇతర కారణమేమైనా ఉందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కర్నూలు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

గుంటూరులో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

'నీట్'ను రద్దు చేయండి

- మళ్లీ పరీక్షలు నిర్వహించి న్యాయం చేయాలి
- రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

దేశవ్యాప్తంగా పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుకున్న నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం ఆందోళనలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థులకు జరిగిన అన్యాయంపై ప్రధాని మోడీ క్షమాపణ చెప్పాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

నీట్ పరీక్షలో అక్రమాలను నిరసిస్తూ శ్రీకాకుళం నగరంలోని అంబేద్కర్ కూడలి నుంచి డే అండ్ నైట్ వరకు ర్యాలీ నిర్వహించారు. నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని, బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. విజయనగరంలో విద్యార్థులు ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి బాలాజీ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. కర్నూలులోని గాయత్రి ఎస్టేట్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం గాంధీ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. నీట్, నెట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలు, పేపర్ లీకేజ్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గుంటూరులోని చంద్రమౌళీ నగర్ నుండి లక్ష్మీపురం మదర్‌థెరిస్సా విగ్రహం వరకూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మదర్ థెరిస్సా విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. ఎన్‌టిఆర్ జిల్లాలో ఆందోళనలు, అనకాపల్లి జిల్లాలో ర్యాలీలు, వైఎస్ఆర్, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ధర్నా నిర్వహించారు. నీట్ పరీక్షపై జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ను రద్దు చేయాలని, రాష్ట్రాల హక్కులు, స్వయం ప్రతిపత్తిని కాపాడాలని, పరీక్షల పేరుతో విద్యను కేంద్రీకరించడం ఆపాలని, పరీక్షల నిర్వహణ నుంచి ఎన్‌టిఎని తప్పించాలని డిమాండ్ చేశారు.

విజయనగరంలో విద్యార్థుల మానవహారం

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

గ్రామాల్లో సోషల్ ఆడిట్

- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం నిధులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. గ్రామాల్లో పకడ్బందీగా సోషల్ ఆడిట్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ సోషల్ ఆడిట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ నిధులు ఏమాత్రం దుర్వినియోగం కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ పక్కాగా ఉండాలని అధికారులను ఆయన ఆదేశించారు.

ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ జరిగే తీరు, నిధుల దుర్వినియోగం జరిగితే గుర్తించే పద్ధతిని అధికారులు పవన్‌కల్యాణ్‌కు వివరించారు. వీటితోపాటు సోషల్ ఆడిట్ సమావేశాలు ఎన్ని గ్రామాల్లో నిర్వహించిందనే వివరాలు తెలిపారు. క్షేత్రస్థాయిలో ఉపాధి మేట్లు పరిధిలో జరిగిన పనులు, వాటి వివరాలు, ఉపాధి హామీ పనుల పురోగతి, నిధులు ఏ మేరకు సద్వినియోగం అయ్యాయి? దుర్వినియోగానికి సంబంధించి నమోదైన కేసుల వివరాలు తెలిపారు. అనంతరం పలు శాఖలపై డిప్యూటీ సిఎం సమీక్ష నిర్వహించారు. గ్రామీణ వ్యవస్థలో పూర్తి స్థాయి అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ చట్టాలు, అటవీ చట్టాల గురించి ఆయా శాఖల్లో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చట్టాలకు అనుగుణంగా, పాలనలో ముందుకు సాగాలని, ప్రతి అంశం చట్టపరిధిలో ఉండేలా సమిష్టిగా పనిచేద్దామని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. రక్షిత మంచినీరు, రహదారి కల్పన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి వేయించి నీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా నిర్దేశించుకుని పనిచేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

బడ్జెట్‌పై తొలి సమీక్ష

- హాజరైన కొత్త కార్యదర్శులు
- పియూష్ కూడా..

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పూర్తి స్థాయి వార్షిక బడ్జెట్ సమీక్ష గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆధ్వర్యాన జరిగింది. ఈ సమావేశానికి కొత్తగా ఆర్థికశాఖ కార్యదర్శిగా నియమితులైన ఐఎఎస్ అధికారి జానకితోపాటు ఇప్పటికే అదనపు బాధ్యతలతో ఉన్న గౌర్, ప్రస్తుత ఆర్థికశాఖ కార్యదర్శి కెవివి సత్యనారాయణ కూడా హాజరయ్యారు. అలాగే ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ స్థానంలో నియమితులవుతారన్న ప్రచారం జరుగుతున్న సీనియర్ ఐఎఎస్ అధికారి, ప్రస్తుతం కేంద్ర సర్వీసులో ఉన్న పియూష్ కుమార్ కూడా హాజరు కావడం గమనార్హం. ఈ సమావేశంలో వచ్చే నెల్లో నిర్వహించనున్న బడ్జెట్‌పై కీలక చర్చ జరిగినట్లు తెలిసింది. గతేడాది రూ.2.79 లక్షల కోట్లతో బడ్జెట్‌ను ప్రతిపాదించగా, ప్రస్తుతం ప్రభుత్వం మారి చంద్రబాబు నేతృత్వంలో కొత్త సర్కారు ఏర్పడిన నేపథ్యంలో బడ్జెట్ రూపురేఖలపై చర్చ జరిగినట్లు తెలిసింది. చంద్రబాబు ఇచ్చిన పింఛను పెంపు, ఉచిత బస్సు ప్రయాణం, పోలవరం, రాజధాని అభివృద్ధి వంటి అంశాల కారణంగా మరిన్ని ఎక్కువ నిధులు అవసరమవుతాయని, అందుకే అదనపు నిధులతో బడ్జెట్ ఎలా ప్రవేశపెట్టాలన్న కోణంలో సిఎస్ చర్చించినట్లు తెలిసింది.

పెట్టుబడి సాయం రూ.20 వేలు జమ చేయాలి

- 24న కలెక్టర్లకు వినతిపత్రాలు
- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా పెట్టుబడి సాయం రూ.20 వేలు రైతుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కోరింది. సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలు ఈ నెల 18, 19 తేదీల్లో రెండు రోజులపాటు సంఘం అధ్యక్షులు వి కృష్ణయ్య అధ్యక్షతన జరిగాయి. సమావేశ నిర్ణయాలను అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకరరెడ్డి గురువారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. టిడిపి కూటమి మెజార్టీతో రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, గత ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతకు తోడు సూపర్ సిక్స్ పేరుతో కూటమి ఇచ్చిన హామీలు కూడా పెద్దయెత్తున ప్రభావం చూపాయని వివరించారు. గత ఖరీఫ్, రబీ సీజన్‌లలో వర్షాభావంతో ఒకవైపు కరువు అయితే మరోవైపు డిసెంబరులో వచ్చిన తుపానుతో పంటలు దెబ్బతిని రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని వివరించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని, ఈ ఖరీఫ్‌లో వ్యవసాయ పెట్టుబడుల కోసం రైతాంగం తీవ్రంగా ఇబ్బంది పడుతుందని తెలిపారు.

సున్నా, పావలా వడ్డీ రాయితీలు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో వడ్డీ, అసలు కట్టాలని రైతులపై బ్యాంకులు ఒత్తిడి చేసి వసూలు చేస్తున్నాయని వివరించారు. వడ్డీ రాయితీ విడుదల చేసి రైతుల ఖాతాల్లో వేయాలని, పెట్టుబడి సహాయం కింద ఇస్తామన్న రూ.20 వేలను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. కోనసీమ, కాకినాడ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన రబీ ధాన్యం బకాయిలు రూ.1,600 కోట్లు తక్షణమే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో 2023 రబీలో వేసిన పప్పుశనగ, కంది, జొన్న, మొక్కజొన్న, మిరప, తెల్లకుసుమ, పొద్దు తిరుగుడు, ఉలవలు వంటి పంటలు వర్షాభావం వల్ల దెబ్బతిన్నాయని తెలిపారు. రబీలో పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో కరువు సహాయం కింద తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎకరాకు రూ.10 వేల నష్టపరిహారంగా రైతులకు ఇవ్వాలని కోరారు. ఆలయ భూములు సాగుచేస్తున్న కౌలురైతులకు గుర్తింపు కార్డులివ్వాలని కోరారు. భూయజమానుల సంతకంతో నిమిత్తం లేకుండా కౌలురైతులందరికీ గుర్తింపు కార్డులివ్వాలన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే గత ప్రభుత్వ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ నెల 24న జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని వివరించారు. ఈ సమావేశంలో ఎఐకెఎస్ అఖిల భారత సహాయ కార్యదర్శి టి సాగర్, ఉమ్మడి ఎపి రైతు సంఘం పూర్వ కార్యదర్శి వి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు వై కేశవరావు, ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ, కౌలు రైతుల సంఘం కార్యదర్శి మాగంటి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయాం...ఆదుకోండి

- కేంద్ర కరువు బృందం ఎదుట రైతుల ఏకరువు
- అనంతపురం, నంద్యాల, ప్రకాశంలో పర్యటన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'శనగ, జొన్న పంటల దిగుబడి 75 శాతం వరకు తగ్గిపోయింది. సాగుచేసిన ప్రతి ఎకరాకు బీమా సదుపాయం కల్పించాలి. 50 శాతం రాయితీతో వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, డ్రిప్పులు, స్ప్రింక్లర్ పైపులు అందించాలి. పంట నష్టపరిహార పరిమితిని రెండు హెక్టార్ల నుండి నాలుగు హెక్టార్ల వరకు పెంచాలి. నష్టపరిహారాన్ని ఎకరాకు రూ.నాలుగు వేల నుంచి రూ. పదివేలకు పెంచాలి'. అని కరువు బృందం సభ్యులను రైతులు కోరారు. పూర్తిగా నష్టపోయామని తమను ఆదుకోవాలని కోరారు. సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లి సాయం అందేందుకు ప్రతిపాదనలు పంపిస్తామని బృందం సభ్యులు హామీ ఇచ్చారు. రెండు రోజు పర్యటనలో భాగంగా అనంతపుం, నంద్యాల, ప్రకాశం జిల్లాల్లో పర్యటించింది. క్షేత్ర స్థాయిలో పంట పొలాలను పరిశీలించేందుకు వీలులేకపోవడంతో రైతులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం పెద్దకౌకుంట్లలో కరువు బృందం పర్యటించింది. ఎకరా పొలంలో రూ.28 వేలు ఖర్చు పెట్టి పప్పుశనగ సాగుచేస్తే దిగుబడి రాలేదని రామాంజినేయులు అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. పశుగ్రాసం లేక పశువుల పోషణ భారంగా మారిందని, దాణాలేక పశువులు అల్లాడుతున్నాయని పాడి రైతు కృష్ణారెడ్డి కన్నీటిపర్యంతమయ్యారు. టిఎంఆర్, సైలేజ్ పశు గ్రాసాన్ని సబ్సిడీతో అందివ్వాలని కోరారు. అనంతరం కణేకల్ మండలం సొల్లాపురం గ్రామ రైతులతో బృందం సభ్యులు ముచ్చటించారు. నవంబరు, డిసెంబరులో చినుకు జాడలేక వేసిన పప్పుశనగ పంట మొత్తం పోయిందని రైతు వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు..

నంద్యాల జిల్లా కోవెలకుంట్ల, దొర్నిపాడు, ఉయ్యాలవాడ మండల కార్యాలయాల్లో ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించడం, రైతులు చెప్పింది వినడం వరకే బృందం సభ్యులు పరిమితమయ్యారు. కోవెలకుంట్ల మండలం భీమునిపాడులో దెబ్బతిన్న శనగ, మినుము, జొన్న పంటల రైతులతో మాట్లాడారు. ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం వేములకోట గ్రామంలో 30 ఏళ్లగా ఎండిపోయిన చెరువును కరువు బృందం పరిశీలించింది. అక్కడి రైతులతో మాట్లాడారు. ఎండిన పంట పొలాలను, బీడుగా వదిలేసిన భూములను సందర్శించారు. గతంలో రైతులు సాగు చేసి పంట నష్టపోయిన పొలాలను పరిశీలించారు.

ఆర్థిక తోడ్పాటుకు కృషి చేయండి : మంత్రి బాల వీరాంజనేయ స్వామి

ప్రకాశం జిల్లాలోని నెలకొన్న కరువు పరిస్థితుల దృష్ట్యా ఆర్థిక సహాయం, నష్టపోయిన రైతులకు ఆర్థిక తోడ్పాటు అందించేందుకు తమ వంతు కృషి చేయాలని కేంద్ర కరువు బంద సభ్యులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ, వికలాంగులు, వయో వృద్ధుల సంక్షేమం, సచివాలయాల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి కోరారు. కలెక్టరేట్‌లో ఫొటో ఎగ్జిబిషన్‌ను బృందం సభ్యులు పరిశీలించారు. కరువు పరిస్థితుల కారణంగా జరిగిన నష్టాలను ఆయా శాఖల అధికారులు వివరించారు.

పెద్ద కౌకుంట్ల గ్రామంలో ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కేంద్ర కరువు బృందం సభ్యులు

ఓలా ఇవి ఐపిఒకు సెబీ ఆమోదం

బెంగళూరు : విద్యుత్తు ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ) ప్రతిపాదనలకు సెబీ ఆమోదం తెలిపింది. డిసెంబర్‌లో ఈ కంపెనీ ఐపిఒ కోసం దరఖస్తు చేసుకుంది. కాగా దేశంలో రానున్న ఇవి విభాగం తొలి ఐపిఒ ఇదే కానుంది. దీంతో రూ.7,250 కోట్ల నిధులు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఇష్యూలో ఆఫర్ ఫర్ సేల్ కింద 9.52 కోట్ల షేర్లను విక్రయించనుంది.

పదేళ్లలో ఎలక్ట్రానిక్స్ రంగం 400% వృద్ధి

విజయవాడ : గడిచిన పదేళ్లలో భారత్‌లో ఎలక్ట్రానిక్స్ రంగం 400 శాతం వృద్ధిని నమోదు చేసిందని సెల్‌కాన్ గ్రూపు సిఎండి వై గురు అన్నారు. ప్రస్తుతం రూ.1.2 లక్షల కోట్ల మొబైల్ ఫోన్ల ఎగుమతులు జరుగుతున్నాయన్నారు. ఈ రంగంలో ఎగుమతులకు ఆంధ్రప్రదేశ్‌కు గొప్ప అవకాశాలు ఉన్నాయన్నారు. ఎపి నూతన ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఎపిని ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీకి పవర్‌హౌస్‌గా మార్చడానికి రాబోయే రోజుల్లో ప్రభుత్వంతో కలిసి పని చేస్తామన్నారు. రాష్ట్రాన్ని ఐటి హబ్‌గా మార్చడానికి, అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉన్నామని నారా లోకేష్ పేర్కొన్నట్లు తెలిపారు.

బే విండోకు డిజైన్ ఎక్సలెన్స్ అవార్డు

హైదరాబాద్: తమ సంస్థకు ప్రతిష్టాత్మక డిజైన్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2024 దక్కిందని బే విండో వెల్లడించింది. అసాధారణమైన డిజైన్, ఆవిష్కరణల పట్ల తమ అంకితభావానికి ఇది నిదర్శమని బే విండో డిజైన్ లీడ్ సిద్ధాంత్ ఆనంద్ పేర్కొన్నారు. ఈ సంస్థ ఫర్నీచర్ ఉత్పతుల రంగంలో ఉంది.

టెల్కోల రెవెన్యూ 87 శాతం పెరుగుదల

న్యూఢిల్లీ : తమకు ఆదాయాలు సరిపోవడం లేదని.. ఛార్జీలు మరింత పెంచాల్సిన అవసరం ఉందని టెలికం కంపెనీలు చేస్తున్న ప్రకటనలకు వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. గత ఐదేళ్లలో ఆదాయాలు దాదాపు రెట్టింపు అయ్యాయి. ఆర్థిక సంవత్సరం 2018-19 నాటి ఆదాయాలతో పోల్చితే.. 2023-24లో టెల్కోల రెవెన్యూ ఏకంగా 87 శాతం పెరిగి రూ.2.39 లక్షల కోట్లకు చేరిందని గ్లోబల్ బ్రోకరేజీ సంస్థ సిఎల్ఎస్ఎ వెల్లడించింది. ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో సేవలను ప్రారంభం తర్వాత టెల్కోల ఆదాయాల్లో భారీ పెరుగుదల చోటు చేసుకుందని తెలిపింది. గడిచిన ఆర్థిక సంవత్సరం 2023-24లో వొడాఫోన్ ఐడియా మార్కెట్ వాటా స్వల్పంగా తగ్గినప్పటికీ.. రెవెన్యూ మాత్రం యథాతథంగా 37,700 కోట్లుగా చోటు చేసుకుంది. ఎయిర్‌టెల్ రెవెన్యూ 12 శాతం పెరిగి రూ.88,700 కోట్లుగా, జియో ఆదాయం 10 శాతం పెరిగి రూ.99,200 కోట్లుగా నమోదయ్యింది.

పేటియంతో సామ్‌సంగ్ ఒప్పందం

గుర్‌గావ్ : సామ్‌సంగ్ వాలెట్‌పై విమాన, బస్సు, సినిమా, ఈవెంట్‌ల టిక్కెట్ బుకింగ్‌లను చేసుకోవడానికి వీలుగా పేటియం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్‌తో ఒప్పందం కుదర్చుకున్నట్లు ఆ సంస్థ తెలిపింది. సామ్‌సంగ్ వాలెట్ ద్వారా నేరుగా సౌకర్యవంతమైన, ఇంటిగ్రేటెడ్ బుకింగ్ అనుభవాన్ని అందించడం ద్వారా వినియోగదారుల సౌకర్యాన్ని మెరుగుపరచడం ఈ భాగస్వామ్యం లక్ష్యమని పేర్కొంది. ఈ భాగస్వామ్యంతో గెలాక్సీ స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు ప్రయాణ, ఈవెంట్‌లకు సంబంధించిన బుకింగ్‌లను పేటియంతో సౌకర్యవంతమైన యాక్సెస్‌ను పొందవచ్చని తెలిపింది.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని కేంద్రం ప్రకటించాలి

- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - అనకాపల్లి, విశాఖ కలెక్టరేట్ విలేకరులు

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను నిలుపుదల చేస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఇప్పట్లో ఉండదని, గనులు వేలంలో విశాఖ స్టీల్ యాజమాన్యం కూడా పాల్గొనవచ్చని కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. ప్లాంట్‌ను స్ట్రాటజిక్ సేల్ పేరుతో అమ్మాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో కిషన్‌రెడ్డి కూడా ఉన్నట్టు గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించగా, గత ప్రభుత్వం చీపురుపల్లి, కింతాడ, గర్భాం మైనింగ్‌లను రెన్యువల్ చేయకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించిందని తెలిపారు. కేంద్ర గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కిషన్ రెడ్డి విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయిస్తామని చెప్పకుండా గనుల వేలంలో యాజమాన్యం పాల్గొని క్యాపిటల్ మైనింగ్‌ను పొందవచ్చని సెలవివ్వడం దారుణమన్నారు. దీనిని బట్టి ఉక్కు పరిరక్షణ పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరి ఇట్టే అర్థమవుతోందని తెలిపారు. ఇప్పటికైనా ప్రజల ఆకాంక్షను గుర్తెరిగి స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, రూ.ఐదు వేల కోట్లు వర్కింగ్ క్యాపిటల్ మంజూరు చేయాలని, ఖాళీగా వున్న ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సస్పెండైన ఉపాధ్యాయులకు పోస్టింగు

- సిఇఒ మీనాకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల సందర్భంగా వివిధ కారణాలతో సస్పెండైన ఉపాధ్యాయులకు వెంటనే పోస్టింగు ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాను యుటిఎఫ్ కోరింది. పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుతో కలిసి ఫెడరేషన్ అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు సచివాలయంలో మీనాను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. మాచర్ల నియోజకవర్గంలో సస్పెండైన పిఇ, ఎపిఒలకు తిరిగి రీ పోస్టింగ్ ఇవ్వాలని, ఎన్నికల విధులకు హాజరుకాలేదనే పేరుతో కొద్దిమంది ఉపాధ్యాయులను స్థానిక కలెక్టర్లు సస్పెండ్ చేశారని తెలిపారు. ఎన్నికల నిబంధనావళి ఉల్లంఘించారనే పేరుతో కొద్దిమంది ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారని వివరించారు. వీరందరికీ తిరిగి పోస్టింగు ఇవ్వాలని కోరారు. కొద్దిమందికి జారీ చేసిన షోకాజ్ నోటీసులను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల విధులు నిర్వహించినన్ని రోజులకు ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్లు ఆధారంగా ఆర్జిత సెలవు మంజూరు చేసేలా తగు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. వివిధ కారణాలతో సస్పెండైన వారిని రీవోక్ చేసేందుకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆర్జిత సెలవు విషయంపై ఆర్థికశాఖ అధికారుల అనుమతితో తగు ఉత్తర్వులు జారీ చేస్తామని వారికి తెలిపారు.

సిఇఒ మీనాకు వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మణరావు, వెంకటేశ్వర్లు

పిడుగుపాటుకు ఇద్దరు మృతి

ప్రజాశక్తి - బూర్జ (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలంలో గురువారం పిడుగుపాటుకు గురై ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. రెండు ఆవులూ మృత్యువాత పడ్డాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బూర్జ మండలంలోని కటకమయ్యపేటకు చెందిన చెందిన దేవరపల్లి బారికయ్య (72) వ్యవసాయ పనులకు వెళ్లారు. ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పొలం నుంచి ఇంటికి బయలుదేరుతుండగా పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందారు. బారికయ్యకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. అదే మండలంలోని అయ్యవారిపేటకు చెందిన చోడవరపు వెంకట సత్యనారాయణ (25) తన స్నేహితుడు మామిడి ధనుంజయరావుతో కలిసి గ్రామ సమీపంలో ఆవులను మేతకు తీసుకెళ్లారు. గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పిడుగు పడటంతో వెంకట సత్యనారాయణ మృతి చెందారు. రెండు ఆవులు మృత్యువాత పడ్డాయి. సమీపంలో ఉన్న ధనుంజయరావుకు గాయాలు కావడంతో స్థానికులు ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
TN No. 01/2024-2025/CE/SE(WS)/EE-III(WS)/DB-III, Dt. 20-06-2024
No. of Works : 1
Value of Work : Rs. 450.41 Lakhs (3rd Call)
Downloading Starting Date : 21-06-2024
Tender Closing Date : 05-07-2024
Further Details at http : // tender.apeprocurement.gov.in
O/o EE-III(WS) Cell No. 9912349448 Sd/- For COMMISSIONER

సంపాదకీయం

చరిత్రకు మసిపూత

గతంలో ఏం జరిగిందో, ఎలా జరిగిందో చరిత్ర చెప్పాలి. దానిని ఒక పాఠంగానో, గుణపాఠంగానో తీసుకొని వర్తమానంలో ప్రవర్తించాలి. తదనుగుణంగా భవిష్యత్తుని నిర్మించుకోవాలి. జరిగిన దానిని జరిగినట్టుగా చరిత్రలో నమోదు చేస్తే-దానిలోని మంచిచెడ్డలను బేరీజు వేసుకునే బృహత్తర బాధ్యతను అధ్యాపకులు, అభ్యాసకులూ చేస్తారు. ఏ దేశంలో అయినా, ఏ కాలంలో అయినా చరిత్రకు ఉన్న ప్రాధాన్యత, ప్రయోజనమూ ఇది. అలాంటి చరిత్రకు మసిపూసి, దేశ ప్రజలను, అందునా భావి భారత పౌరులనూ మభ్యపెట్టాలని చూస్తోంది కేంద్రంలోని మోడీ-షా ప్రభుత్వం! 2014లో మోడీ అధికారంలోకి వచ్చింది మొదలు-పరివార శక్తులు చెప్పే వక్రీకరణ పాఠాలనే పాఠ్య పుస్తకాల్లో పొందుపర్చేందుకు పనిగట్టుకొని ప్రయత్నిస్తోంది. ఉన్నత విద్యా సంస్థల ముఖ్య స్థానాల్లో ఆరెస్సెస్ నేపథ్యమున్న వ్యక్తులను కూచోబెట్టి, పాఠ్య పుస్తకాలను కాషాయీకరించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగానే ఎన్‌సిఇఆర్‌టి పాఠ్య పుస్తకాల్లో మత సామరస్యాన్ని బోధించే పాఠాలను ఒక్కటొక్కటిగా అటకెక్కించారు. వివిధ రామాయణాల తులనాత్మక అధ్యయనాన్ని ఒక విశ్వవిద్యాలయం సిలబస్ నుంచి ఎత్తివేశారు. భగత్‌సింగ్ భావాలను; మత వివక్ష గురించి పూలే, అంబేద్కర్ చెప్పిన సంగతులను పాఠాల్లోంచి తొలగించారు. స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో వీసమెత్తు పోరాట పాత్ర లేని సావర్కర్ వంటి లొంగుబాటు నేతలను గొప్ప యోధులుగా చిత్రీకరించే బోధనలను బిజెపి పాలిత రాష్ట్రాల్లో ప్రవేశపెట్టారు. అండమాన్ జైల్లో బందీగా ఉన్న సావర్కర్ రాత్రివేళల్లో బుల్‌బుల్ పిట్ట రూపంలో బయటికొచ్చి, దేశంలో తిరుగాడేవాడని పిట్టకథలను కర్ణాటక పాఠశాలల్లో వినిపించారు. విజ్ఞానంతో, వివేకంతో, వివేచనా శక్తితో మోసులెత్తాల్సిన విద్యార్థుల మెదళ్లను అబద్ధాలతోనూ, అశాస్త్రీయ అంశాలతోనూ నింపే ప్రయత్నం చేశారు.

తాజాగా 12వ తరగతి రాజకీయశాస్త్రం పాఠ్యపుస్తకంలో బాబ్రీ మసీదు అంశానికి సంబంధించిన పాఠాన్ని వాస్తవాలకు విరుద్ధంగా మార్చేశారు. బాబ్రీ మసీదు అన్న మాటను పూర్తిగా ఎత్తేసి, మూడు గోపురాల నిర్మాణంగా పేర్కొన్నారు. అది రామజన్మభూమి అని సుప్రీంకోర్టు తేల్చి చెప్పినట్టుగా అసత్యాన్ని జోడించారు. మూడు దశాబ్దాల క్రితం-1992 డిసెంబరు 6వ తేదీన జరిగిన బాబ్రీ మసీదు కూల్చివేత దుర్మార్గం చరిత్ర పుటల్లో, దేశ ప్రజల హృదయాల్లో ఇంకా పచ్చి పచ్చిగానే ఉంది. అది స్వతంత్ర భారతదేశంలో జరిగిన అత్యంత దురుద్దేశపూరిత విధ్వంస ఘట్టం. ఆరెస్సెస్, విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్ వంటి మతోన్మాద సంస్థలు మూకుమ్మడిగా చేపట్టిన ఈ కూల్చివేత ఉదంతం దేశంలో తీవ్రమైన అశాంతికి, అల్లర్లకు, మతతత్వ ఘర్షణలకూ కారణమైంది. వేలాదిమంది అమాయక ప్రజలూ మత కొట్లాటల్లో ప్రాణాలు కోల్పోవటానికి; ప్రభుత్వ, ప్రయివేటు ఆస్తులు ధ్వంసం కావటానికీ దారి తీసింది. ప్రజలను తీవ్ర ఉద్వేగాల్లో ముంచెత్తి, ఆ ఉన్మాదపు మంటల్లో రాజకీయంగా లబ్ధి పొందటానికి ప్రయత్నించింది బిజెపి. భారత స్వాతంత్ర్యోద్యమం నెలకొల్పిన ఘనమైన వారసత్వానికి గండి కొట్టి; సామరస్యానికి, సమైక్యతకు చిల్లులు పెట్టి, మెజారిటీ, మైనారిటీ వాదాలతో అధికార పీఠానికి మెట్లు పేర్చుకొంది. ఈ చారిత్రక సత్యాన్ని మరుగున పర్చి, రామాలయ నిర్మాణం గురించి గొప్పలు చెప్పే పనిని ఎన్‌సిఇఆర్‌టి నెత్తిన వేసుకొంది.

ఈ మసిపూతల మీద దేశవ్యాప్తంగా విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థి సంఘాలూ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తుంటే- ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్ దినేశ్ ప్రసాద్ సక్లాని స్పందించిన తీరు విడ్డూరంగా ఉంది. "విద్యార్థులు అల్లర్లు, హింసాత్మక సంఘటనల గురించి తెలుసుకొని అణగారిపోకుండా ఆశావహంగా పాఠాలను మార్చటంలో తప్పేముంది?" అని ఎదురు ప్రశ్న వేశారు. చరిత్రను చరిత్రలా చెప్పే బదులు దానిలో అబద్ధాలను జొప్పించాల్సిన పనేమిటి? బిజెపికి నచ్చినట్టు, కాషాయ శక్తులు మెచ్చినట్టు పాఠాలను మార్చేస్తే-ఇక చదువులకు అర్థం ఏముంది? మన రాజ్యాంగ మౌలిక లక్ష్యాలను అపహాస్యం చేసే ఇలాంటి వక్రీకృత చరిత్రను ప్రజాస్వామిక, లౌకికవాదులు ఎవరూ అంగీకరించరు. చరిత్రకు మసి పూసిన వాళ్లు రేపు కచ్చితంగా చరిత్ర హీనులవుతారు!

మహనీయుల మాట

నీ అభిప్రాయాలతో ఏకీభవించక పోవచ్చు. కానీ నీ అభిప్రాయం చెప్పే హక్కు కోసం నా ప్రాణమిస్తా.
-వోల్టేర్,
ఫ్రెంచి తత్వవేత్త.

కపట నాటక సూత్రధారి ఆర్‌ఎస్‌ఎస్

విశ్లేషణ

'నిజానికి మోడీ ఉత్సవమూర్తి మాత్రమే. అసలు దేవతామూర్తి అయిన ఆర్‌ఎస్‌ఎస్ నాగపూర్ గుడిలో సుఖంగా కూర్చునుంటే ఉత్సవ మూర్తి మాత్రం దేశమంతటా విశృంఖలంగా తిరుగుతూ ఉంటుంది.' అని ఆర్‌ఎస్‌ఎస్‌కు బిజెపి కి వున్న అనుబంధం గురించి కన్నడ సుప్రసిద్ధ సాహితీవేత్త దేవనూరు మహాదేవ వివరించారు.

మరి అలాంటి దేవతామూర్తి ఎన్నికల ఫలితాల తర్వాత తన ఉత్సవమూర్తిపై ఎందుకు ఇంతగా విరుచుకు పడుతున్నది. మోడీ, ఆయన పార్టీ బిజెపి సాధించే విజయాలకు, అపజయాలకు ఆర్‌ఎస్‌ఎస్సే కర్త, కర్మ, క్రియ కదా! మరి అలాంటి ఆర్‌ఎస్‌ఎస్ తాను సృష్టించిన 'బొమ్మలు' మోడీ, షా లను ఎందుకు ఇంతగా విమర్శిస్తున్నది? కొందరు చెబుతున్నట్టుగా ఇది నిజంగా ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి మధ్య అగాధమా? తీవ్రమైన వైరుధ్యమా? కాదు. కానే కాదు. మాయా విహారి, కపట నాటక సూత్రధారి ఆర్‌ఎస్‌ఎస్ ఆడుతున్న రసవత్తర నాటకంలోని ఇది ఒక అంకం మాత్రమేనని దాని గురించి లోతుగా తెలిసినవారు, గత పది సంవత్సరాల మోడీ ఏలుబడి తీరును అనుభవించిన వారు సులభంగానే అర్థం చేసుకుంటారు.

మోడీ, ఆయన పార్టీ బిజెపి సాధించే విజయాలకు, అపజయాలకు ఆర్‌ఎస్‌ఎస్సే కర్త, కర్మ, క్రియ కదా! మరి అలాంటి ఆర్‌ఎస్‌ఎస్ తాను సృష్టించిన 'బొమ్మలు' మోడీ, షా లను ఎందుకు ఇంతగా విమర్శిస్తున్నది? కొందరు చెబుతున్నట్టుగా ఇది నిజంగా ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి మధ్య అగాధమా? తీవ్రమైన వైరుధ్యమా? కాదు. కానే కాదు. మాయా విహారి, కపట నాటక సూత్రధారి ఆర్‌ఎస్‌ఎస్ ఆడుతున్న రసవత్తర నాటకంలోని ఇది ఒక అంకం మాత్రమేనని దాని గురించి లోతుగా తెలిసినవారు, గత పది సంవత్సరాల మోడీ ఏలుబడి తీరును అనుభవించిన వారు సులభంగానే అర్థం చేసుకుంటారు.

వి. రాంభూపాల్

ఇంతకూ ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు ఏం మాట్లాడారు? 'మర్యాద లోపం' వల్లే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి పరాభవం చెందిందని ఆర్‌ఎస్‌ఎస్ ఛీఫ్ మోహన్ భగవత్ ఫలితాలు వెలువడిన నాలుగో రోజు తేల్చేశారు. అంతేకాదు 'అహం' లేని నాయకుడుకి మాత్రమే 'సేవక్' (ప్రజా సేవకుడు) అని పిలిపించుకునే అర్హత వుంటుందని మోడీని విమర్శించారు. మరో ప్రముఖుడు ఇంద్రేష్ కుమార్ మరింత ఘాటుగా 'లోక్‌సభలో మెజారిటీ సాధించకుండా 'రామ భక్తుడు' అని చెప్పుకునే 'అహంకార పూరిత' పార్టీ (బిజెపి)ని రాముడే అడ్డుకున్నాడని, ప్రతిపక్ష ఇండియా వేదిక 'యాంటీ రామ్' కాబట్టి వారికి కూడా అధికార పీఠాన్ని రాముడే దూరంగా వుంచాడన్నారు. 'ఎన్నికల ఫలితాలు మితి మీరిన విశ్వాసంతో వున్న బిజెపి కార్యకర్తలకు రియలిటీ చెక్ అని ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్త రతన్ శారద తమ పత్రిక ఆర్గనైజర్‌లో రాశారు. 'భారత దేశం మళ్ళీ సంకీర్ణ రాజకీయాల అగ్నికీలల్లోకి జారిపోయిందని, భారత రాజకీయాల్లో వినయం, సభ్యత అనేవి అవసరమైన లక్షణాలని, వాటిని గుర్తించాలని రామ్ మాధవ్ బిజెపి నేతలకు హితవు పలికారు. 'ఇద్దరు నేతలు తమంతట తాము అన్నీ నిర్ణయించుకోవడమే' ఈ ఫలితాలకు కారణమని ఆర్‌ఎస్‌ఎస్ మరో నేత కులకర్ణి చెప్పారు. అభ్యర్థుల ఎంపికలో నాలుగు 'సి' లు (క్యాష్, క్యాస్ట్, కమ్యూనిటీ, క్రైమ్) ప్రాధాన్యతలోకి రావడమే ఈ ఫలితాలకు కారణమని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తన మాటల చాతుర్యాన్ని ప్రదర్శించారు.

ఒకవేళ మోడీ చెప్పుకున్నట్లు తన పార్టీకి 370, ఎన్‌డిఎ కూటమికి 400 సీట్లు వచ్చివుంటే ఆర్‌ఎస్‌ఎస్ నేతలు ఇలా మాట్లాడి వుండేవారా? పదేళ్ళ మోడీ విజయ పరంపరలో అగ్రతాంబూలం పుచ్చుకుంటూ వచ్చిన వారు ఇలా అడ్డం తిరగడానికి రెండు ప్రధాన కారణాలు. ఒకటి-నేడు బిజెపి కి తగిలిన ఎదురు దెబ్బ తమ విధానాల అమలు వల్ల కాదు, మోడీ ఆయన పార్టీ లోని కొందరు నాయకుల వల్ల అని దేశ ప్రజలకు చూపించడం. రెండు-పదేళ్ళ మోడీ పాలన పట్ల వివిధ తరగతుల్లో వచ్చిన నిరసనను పక్కదారి పట్టించడం. మర్యాద అంటే తోటి వారి పట్ల గౌరవంగా వుండడం. వారి విశ్వాసాలను, నమ్మకాలను, ఆలోచనలను గౌరవించడం. దానినే లౌకికవాదం అని రాజ్యాంగం పేర్కొంది. ఈ సెక్యులరిజాన్ని కాపాడడమే ఈ దేశ మర్యాద. భారత ప్రజల ఐక్య జీవనానికి నాభి కేంద్రంగా వున్న లౌకికవాదంపై గత అనేక దశాబ్దాలుగా దాడి చేస్తూ దాన్ని బలహీన పరచిన ఆర్‌ఎస్‌ఎస్ నేడు మర్యాద గురించి మాట్లాడుతున్నది. వారి శాఖలు, శిక్షణా కార్యక్రమాలు, సభలు ఎక్కడ అవకాశం వుంటే అక్కడంతా లౌకికవాద భావజాలాన్ని బలహీనపరుస్తూ వచ్చారు. ఈ ఎన్నికల సందర్భంగా మోడీ చేసిన ఉపన్యాసాల్లో 'చొరబాటుదారులు', 'అధిక సంతానం గలవారు', 'మంగళసూత్రాలు కొట్టేసి వారికి పంచుతారు' లాంటి...అనేక అభ్యంతరకర పదజాలాన్ని విచ్చలవిడిగా వాడగలిగేటట్టు చేసింది ఆర్‌ఎస్‌ఎస్ శిక్షణ కాదా? తాను అందరిలాగా తల్లిదండ్రులకు జన్మించిన వ్యక్తిని కాదని, ఒక కార్యం కోసం దేవుడు తనను ఇక్కడకు పంపాడని, తాను దైవాంశ సంభూతుడిని అన్నట్లుగా ఆర్‌ఎస్‌ఎస్ మాజీ ప్రచారక్, జీవితకాల స్వయంసేవకులలో ఒకరైన మోడీ మాట్లాడగలిగారంటే అది ఆర్‌ఎస్‌ఎస్ పెంపకం కాదా? బిజెపి ఎన్నికల ప్రణాళికే మోడీ గ్యారంటీ అంటూ వ్యక్తి చుట్టూ పరిభ్రమించేటట్లు చేసి, ఆహంకార రాజకీయాలను పెంచింది ఎవరు? ఆర్‌ఎస్‌ఎస్ కు తెలియకుండానే ఇదంతా జరిగిందా!

బిజెపికి మెజారిటీ రాకుండా రాముడు అడ్డుకున్నాడా! అయ్యో రామా నీ మీద కూడా ఇంత నిందేమిటయ్యా! అయోధ్యలో రామాలయాన్ని హడావుడిగా జనవరి 22న ప్రారంభించింది, ఎన్నికల్లో ఆయుధంగా మార్చుకోవడానికే కదా? అయోధ్య వున్న లోక్‌సభ స్థానంలో బిజెపి ఓడిపోవడమే కాదు, జనరల్ సీటులో ఓ దళిత అభ్యర్థిని గెలిపించడం ఈ దేశ ప్రజల విజ్ఞతకు నిదర్శనం. సున్నితమైన వ్యక్తిగత ఆరాధనను రాజకీయం చేసి లబ్ధి పొందాలని అన్ని ప్రయత్నాలు అటు ఆర్‌ఎస్‌ఎస్, ఇటు బిజెపి చేయాల్సింది అంతా చేసి వచ్చిన ఎన్నికల దుష్ఫలితాలను ఆ రాముడికే అంటగట్టాలని చూస్తున్నారు. 2013లో ఆర్‌ఎస్‌ఎస్ ఏ నమ్మకంతో అయితే అద్వానీ, రాజ్‌నాథ్ సింగ్, గడ్కరీ, సుష్మా స్వరాజ్ లాంటి నాయకులను పక్కన పెట్టి...గుజరాత్ దారుణాల నిందితుడిగా వున్న మోడీని దేశ ప్రధానిగా చేసిందో...ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి ఈ కాలమంతా ప్రయత్నించారు. 370 ఆర్టికల్ రద్దు, పౌరసత్వ చట్ట సవరణ, రామాలయ నిర్మాణం, పార్లమెంట్ భవన ప్రారంభాన్ని రాజుల కాలం నాటి తంతులాగా మార్చడం, ఒకే దేశం, ఒకే భాష, ఒకే ఎన్నిక, ఒకే పన్ను లాంటి కేంద్రీకృత వ్యవస్థ నిర్మాణం, రాజ్యాంగాన్ని బలహీనపరచడం ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాలో భాగమే. మోడీ పాలనకు ముగ్ధులై రాజ్యాంగాన్నే మార్చాలనే కీలక లక్ష్యం నెరవేర్చుకోవడానికి 370 స్థానాలు మాకు, మా మిత్రులతో కలిపి 400 స్థానాలు వస్తాయని ప్రధాని, హోంమంత్రి మొదలుకొని దేశంలోని బిజెపి నాయకులంతా రంకెలు వేయడం వెనుక ఆర్‌ఎస్‌ఎస్ లేదా? వీరి కుట్రలను దేశ ప్రజలు పసిగట్టారు, కీలెరిగి వాత పెట్టారు.

సంకీర్ణ రాజకీయాలంటే ఆర్‌ఎస్‌ఎస్‌కు, కార్పొరేట్ కంపెనీలకు ఏమాత్రం గిట్టదు. మతతత్వ ఎజెండా అమలు కావాలన్నా, దేశ సంపద లూటీ చేయాలన్నా బలమైన వ్యక్తి నాయకత్వంలోని ఏక పార్టీ పాలన కావాలి. మోడీ, బిజెపి గత ఈ పదేళ్లుగా ఈ ద్వంద్వ విగ్రహాల పల్లకీని సమర్థవంతంగా మోశారు. ఇప్పుడు వచ్చిన సంకీర్ణ ప్రభుత్వం వారికి అగ్నికీలల్లా కనిపిస్తున్నది. కానీ, వి.పి. సింగ్ హయాంలో రుణ మాఫీ చేసి అన్నదాతలను ఆత్మహత్యల నుండి రక్షించింది, మన్‌మోహన్ సింగ్ పాలనలో వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ చట్టం, ప్రజలకు సమాచార హక్కు, అటవీ హక్కు, ఆడపిల్లలపై దాడులను అరికట్టేందుకు పోక్సో లాంటి అనేక చట్టాలను తెచ్చింది సంకీర్ణ రాజకీయాల కాలంలోనే అన్న విషయం చరిత్ర చెబుతున్న సత్యం.

మూడోసారి ప్రధాని పదవి చేపట్టిన రోజు నుండే సంకీర్ణ ధర్మాన్ని మోడీ తుంగలో తొక్కుతున్న విషయం ఆర్‌ఎస్‌ఎస్‌కు తెలియదని అనుకోలేము. మంత్రులకు శాఖలు కేటాయించకుండానే కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద రూ.20 వేల కోట్ల నిధులను, అలాగే అదనంగా మూడు కోట్ల గృహాలను ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మోడీ ఏకపక్షంగా విడుదల చేశారు. సంకీర్ణ ప్రభుత్వంలోనే 'వినయం, సభ్యత' పాటించని ప్రధానిలో మార్పు ఆశించగలమా?

కుల, మత, ధన, కండబలాలే నేటి రాజకీయాలను శాసిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో గెలిచిన పార్లమెంట్ సభ్యుల్లో 93 శాతం మంది కోటీశ్వరులు, 46 శాతం మంది నేరస్థులు, వారిలో 31 శాతం మందిపై హత్య, అత్యాచారం లాంటి తీవ్రమైన కేసులు వున్నాయి. ఇందులో సహజంగానే బిజెపిదే అగ్రస్థానం. రెండవసారి పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికైన 115 మంది బిజెపి ఎంపీల సగటు ఆస్థి గత ఐదు సంవత్సరాల్లో రూ.18 కోట్ల నుండి రూ.26,38,61,614 కోట్లకు చేరిందని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ ప్రకటించింది. ఎన్నికల బాండ్ల పేరుతో అక్రమ సొమ్మును పోగేసుకుంటున్నపుడే ఇప్పుడు చెప్పిన నాలుగు 'సి'ల గురించి మాజీ రాష్ట్రపతి చెప్పి వుంటే ఎంత బాగుండేది. మణిపూర్ అల్లర్లపై ఆర్‌ఎస్‌ఎస్ ఛీఫ్ సంవత్సర కాలం క్రితం మాట్లాడి వుంటే ఆ రాష్ట్రం రావణ కాష్టంగా మారి, ప్రజల ప్రాణాలు పోకుండా, ఆస్తులు విధ్వంసం కాకుండా, మహిళలు వివస్త్రలు కాకుండా వుండేవారు కాదా? అప్పుడు ఎందుకు వీరంతా మాట్లాడలేదు. అవన్నీ వీరి ఎజెండాలో భాగం కాబట్టి.

ఈ పదేళ్ళలో మోడీ పాలనా విధానాలు కార్పొరేట్ కంపెనీలకు తప్ప మిగిలిన అన్ని రంగాలను పతనావస్థకు చేర్చాయి. దేశ సంపద కొద్ది మంది దగ్గర భారీగా పోగయింది. ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రకృతి వనరులను కారు చౌకగా కార్పొరేట్ సంస్థలు కొల్లగొట్టాయి. అత్యధిక మందికి ఉపాధి ఇచ్చే రైల్వే, తంతి తపాలా, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, విమానయానం లాంటి కీలక రంగాలు ప్రైవేటీకరణకు గురయ్యాయి. వివిధ శాఖల్లో వున్న ఖాళీగా వున్న లక్షలాది పోస్టులు భర్తీ చేయలేదు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు పెద్ద సంఖ్యలో దివాళా తీసి, మూతపడ్డాయి. సైనిక రంగాన్ని సైతం కాషాయీకరణ, ప్రైవేటీకరణ చేసేందుకు అగ్నిపథ్ పథకాన్ని తెచ్చారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ భారాలతో పాటు, నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల అత్యధిక ప్రజల నడ్డి విరిచింది. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పచెప్పేందుకు తీవ్ర ప్రయత్నం జరిగింది. రాజ్యాంగబద్ధ సంస్థలు అత్యంత తీవ్రంగా దుర్వినియోగం అయ్యాయి. ప్రజాస్వామ్య హక్కులపై, ఉద్యమాలపై ఉక్కుపాదాన్ని మోపారు. క్రూర చట్టాలను ప్రయోగించి మానవ హక్కుల నేతలను, జర్నలిస్టులను, రచయితలను జైళ్లలో నిర్బంధించారు. ఫెడరల్ విధానాన్ని తుంగలో తొక్కారు. ఎన్నికల్లో గెలిచి ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వాలను కూలదోసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు. వీటన్నింటి ఫలితంగా మోడీకి ఎన్నికల్లో ఘోర పరాభావం జరిగింది. ఈ విధానాల ప్రభావాన్ని గుర్తిస్తే వాటిని మార్చుకోవాలి. అలా మార్చుకుంటే ఒకవైపు ఆర్‌ఎస్‌ఎస్‌కు, మరోవైపు కార్పొరేట్ శక్తులకు ఆగ్రహం వస్తుంది. అందుకే ప్రజల దృష్టిని మరల్చేందుకు ఆర్‌ఎస్‌ఎస్సే రంగంలోకి దిగి ఎన్నికల ఫలితాలకు వక్ర భాష్యం చెబుతున్నది. వ్యక్తులను బాధ్యులుగా చేయాలని చూస్తున్నది.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

అభిప్రాయం

క్షేత్రస్థాయి పరిశీలన అవశ్యం

రాష్ట్రంలో కొత్తగా కొలువు తీరిన పలువురు మంత్రులు తమ తమ శాఖల అధికారులకు పాలనా పరమైన అంశాలపై ఆదేశాలు జారీ చేస్తున్నారు. అయితే ఆదేశాలతో తమ కర్తవ్యం అయిపోయిందనుకుంటే భంగపాటు తప్పదు. ముఖ్యమంత్రిలా క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ వాస్తవ పరిస్థితిని బేరీజు వేసుకోవాలి. అధికారులు ఇచ్చే సమాచారాన్ని తీసుకుని వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోవడానికి తరుచూ తనిఖీలు చేయాలి. ప్రజలు వినూత్నమైన, వేగవంతమైన పాలన కోరుకుంటున్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా మంత్రులు పాలనా సామర్థ్యం కనబరచాలి. కుంటి సాకులు, సంజాయిషీలకు కాలం చెల్లింది. మంత్రులు ఆ విషయం గుర్తెరిగి మసలుకోవాలి. వీరితోపాటుగా ముఖ్యమంత్రి సైతం ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలుపుకోవాలి.

- గరిమెళ్ల రామకృష్ణ,
ఏలూరు, ఏలూరు జిల్లా.

రైలు ప్రమాదాలు సమగ్ర విచారణ

మన దేశంలో జరుగుతున్న రైలు ప్రమాదాలకు కొన్ని ముఖ్యమైన కారణాలున్నాయి. దేశంలో ట్రైన్స్ ఆక్యుపెన్సీ అనేది విపరీతంగా పెరిగిపోతున్నది. సెక్షన్ కెపాసిటీకి మించి రైళ్లు పరిగెడుతున్నాయి. ఈ నేపథ్యంలో, ట్రైన్స్ వెయిటింగ్ సమయాన్ని తగ్గించడానికి ఆటో సిగ్నల్ వ్యవస్థను అమలు పరిచారు. కానీ, అదే ఆటో సిగ్నల్ వ్యవస్థ యమ పాశంగా తయారవుతోంది. దీనికి ముఖ్యమైన కారణాలను విస్మరించకూడదు. ఒకటి, స్టేషన్ మాస్టర్లకి ఆటో సిగ్నల్ వ్యవస్థలో పని చేయగల పరిజ్ఞానం లేకపోవడం. రెండు, దానికి సరైన శిక్షణ ఇవ్వకపోవడం. మూడు, ఆ వ్యవస్థలో పనిచేస్తున్న సరైన అథారిటీ ఫార్మ్స్ డిజైన్ చేయకపోవడం. నాలుగు, ఆటో సిగ్నల్ వ్యవస్థలో పనిచేస్తున్న ట్రైన్ డ్రైవర్లకి సరైన ట్రైనింగ్ ఇవ్వకపోవడం. ఐదు, ఆటో సిగ్నల్ వ్యవస్థ గురించి ఇచ్చే ట్రైనింగ్, కొన్ని దినాలను తగ్గించడం వలన పూర్తి అవగాహన రాకపోవడం. ఆరు, అధికారులు ట్రైనింగ్ అనేది సీరియస్‌గా తీసుకోకపోవడం. ఇప్పటివరకు ఘోరమైన రైలు యాక్సిడెంట్లు జరిగాయి కానీ వీటికి ఎటువంటి ప్రాథమిక ఆధారాలూ ఉండవు. ఈ దుర్ఘటనలను సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సుమోటో కేసుగా పరిగణించి విచారణ చేయడం లేదు. సిఆర్‌ఎస్ ఎంక్వైరీ అనేది వాస్తవ పరిస్థితిని వివరించడం లేదు. ఈ విచారణలో ఫీల్డ్‌లో పని చేస్తున్న కార్మికులకు మాత్రమే శిక్షలు విధిస్తున్నారు. కానీ అధికారులకు శిక్షలు పడడంలేదు. ఈ పరిస్థితిని మార్చకపోతే ఇలాంటి యాక్సిడెంట్లు జరుగుతూనే ఉంటాయి. కావున దీనిపై లోతైన సమగ్ర విచారణ జరిపించాలని, రైల్వే వ్యవస్థని, రైలు ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలని విన్నపం.

- సుబ్బారావు

'ఆదర్శ' సమస్యలు పట్టవా!

ఆదర్శ పాఠశాలల(164)పై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. ఆదర్శ పాఠశాలలు ప్రారంభమైనప్పటి నుంచి (2013) నుండి శాశ్వత సిబ్బందికి సర్వీసు నిబంధనలు లేకపోవడం వలన అనేక న్యాయమైన హక్కులను, ఆర్థిక ప్రయోజనాలను కోల్పోతున్నారు. సర్వీసు ప్రయోజనాలు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం, మంత్రి మండలిలో విద్యా వ్యవస్థకు సంబంధించిన అంశాలలో ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలు (ఏ.పీ మోడల్ స్కూల్స్) అంశాన్ని కూడా చేర్చి సమస్యలకు పరిష్కారం చూపించాలని రెగ్యులర్ టీచర్స్ (2650) కోరుతున్నారు. 2012, 2018 డీఎస్సీ ద్వారా భర్తీ అయిన రెగ్యులర్ ప్రిన్సిపాళ్లు, పిజిటి, టిడిపి సిబ్బందిని ప్రభుత్వం ఆదుకోవాలి. ఏపీ జి ఎల్ ఐ, జిఐఎస్, ఈ హెచ్ ఎస్ అమలు కావడం లేదు. కేవలం 2650 సిబ్బంది సమస్యే అయినప్పటికీ ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రభుత్వ నిర్ణయాలతో మా సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. కారుణ్య నియామకాలకు సంబంధించి కూడా పరిష్కారం దొరుకుతుందని అనేక కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి.

- బి. సురేష్

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

తెలంగాణ, కర్ణాటక మాదిరిగా ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్గించడం మంచిది. అయితే ఉచిత బస్సు ప్రయాణాలు వలన కొంతమంది నిరుద్యోగులు పరోక్షంగానైనా ఉపాధి పొందాలి. అలాగే రాష్ట్రాల టూరిజం ద్వారా అభివృద్ధికి ఈ విధంగా చేయాలి. విస్తృత అవగాహన ప్రచారం ఆర్‌టిసి బస్టాండ్లలో, మీడియా ద్వారా చేయాలి. మహిళలు వారంలో రెండు రోజుల పాటు, సెలవు రోజుల్లో టూరిస్టు ప్రాంతాలు చూసేందుకు ఉచిత బస్సులను ఉపయోగించుకోండి అంటూ ప్రచారం చేయాలి. స్లమ్ ఏరియాల నుండి కాలనీల నుండి పట్టణ, నగరాల్లో పనులకు వచ్చి వెళ్లే పేదలకు ప్రత్యేకంగా పాసులు ఇచ్చి ఆటోల్లో ఉచితంగా ప్రయాణించే సదుపాయాలు కల్పించాలి. సీరియల్ ప్రకారం తద్వారా ఆటోల వారికి నెలకు కొంత మొత్తాలు ప్రభుత్వాలు చెల్లించి ఉపాధి చూపించాలి.

- ఎ. వెంకటేష్

రష్యా-ఉత్తర కొరియా రక్షణ బంధం!

వ్యాఖ్య

రష్యా-ఉత్తర కొరియా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకోవటం ప్రపంచ పరిణామాల్లో ఒక ముఖ్యమైన అంశం. ఇరవై నాలుగు సంవత్సరాల తరువాత రష్యా అధినేత వ్లదిమిర్ పుతిన్ ఉత్తర కొరియా సందర్శనలో సంతకాలు చేశారు. తమ కంట్లో నలుసుగా, పంటి కింద రాయిగా, కాల్లో ముల్లుగా ఉన్న దేశాలను అణగదొక్కేందుకు చూస్తున్న అమెరికా నాయకత్వంలోని పశ్చిమ దేశాలకు సహజంగానే ఇది మింగుడు పడక చిందులు వేస్తున్నది. ఉక్రెయిన్‌తో పది సంవత్సరాల రక్షణ ఒప్పందాన్ని అమెరికా కుదుర్చుకున్నపుడు లేని రచ్చ ఇప్పుడు ఎందుకు? తన అణు కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకుపోయేందుకు, పదును పెంచేందుకు ఈ ఒప్పందం గురించి అమెరికా తప్పుడు ప్రచారం ప్రారంభించింది. ఉత్తర కొరియా అందిస్తున్న ఆయుధాలకు ప్రతిగా దాని అణు కార్యక్రమానికి, ఖండాంతర క్షిపణుల వృద్ధి, అణు జలాంతర్గాముల నిర్మాణానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, యుద్ధ విమానాలు, సాయుధ శకటాలను అందించనుందని అంటున్నది. ఇదంతా పశ్చిమ దేశాలను మరింతగా భయపెట్టి తన కౌగిట్లో బంధించుకొనేందుకు, వాటితో పెద్ద మొత్తంలో ఆయుధాలను కొనిపించేందుకు అన్నది స్పష్టం. నాటో కూడా దానికి తానతందాన అన్నది. అసలు ఒప్పంద పత్రాన్ని ఇంతవరకు ప్రకటించలేదు, దానిలో ఉన్న అంశాలేమిటో తెలియకుండానే ఇలా చెప్పటంలో ఆశ్చర్యం లేదు.

పశ్చిమ దేశాలు ఇస్తున్న ఆయుధాలను ఆత్మరక్షణకే గాక అవసరమైతే రష్యా భూభాగాలపై దాడులు చేసేందుకు కూడా జెలెన్‌స్కీ సేనలకు అనుమతి ఇచ్చిన అంశం తెలిసిందే. తెలివితేటలు పశ్చిమ దేశాల గుత్త సొత్తేమీ కాదు. ఎవరి తురుపు ముక్కలు వారికి ఉంటాయి. రష్యాకు వ్యతిరేకంగా, అసలు సమస్య నుంచి ప్రపంచాన్ని తప్పుదారి పట్టించేందుకు స్విట్జర్లాండ్‌లో నిర్వహించిన ఉక్రెయిన్ శాంతి సభ సాధించిందేమీ లేదు. అమెరికా కూటమికి చెంపపెట్టుగా దానికి హాజరైన అనేక ముఖ్య దేశాలు సమావేశ ప్రకటనపై సంతకాలు చేసేందుకు తిరస్కరించాయి. హాజరైన 90 దేశాలలో భారత్, బ్రెజిల్, మెక్సికో, ఇండోనేషియా వంటి పన్నెండు దేశాలు వాటిలో ఉన్నాయి. సంతకం చేసిన ఇరాక్, జోర్డాన్ తరువాత ఉపసంహరించుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ సమావేశానికి రష్యాను పిలవలేదు, ఆహ్వానం అందుకున్న చైనా తిరస్కరించింది. రష్యా లేకుండా ఆ సభ సాధించేదేమీ ఉండదని చెప్పింది. కొలంబియా చివరి నిమిషంలో తాము హాజరు కావటం లేదని తెలిపింది.

ఉక్రెయిన్ సంక్షోభ నేపథ్యంలోనే రష్యా-ఉత్తర కొరియా ఒప్పందం అన్నది స్పష్టం. ఉక్రెయిన్‌పై సైనిక చర్య జరుపుతున్న రష్యాకు ఉత్తర కొరియా అందిస్తున్న మందుగుండు, రాకెట్ల గురించి పశ్చిమ దేశాలు గుర్రుగా ఉన్నాయి. రష్యాకు సరఫరా అవుతున్న 48 లక్షల ఫిరంగి గుండ్లున్న కంటెయినర్లను తాము కనుగొన్నట్లు అమెరికా ఫిబ్రవరిలో చెప్పింది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత నాటి సోవియట్ యూనియన్, ఉత్తర కొరియా, చైనాలను బెదిరించేందుకు, అవసరమైనపుడు దాడులు చేసేందుకు వీలుగా అమెరికన్లు దక్షిణ కొరియా, జపాన్‌లో సైనిక స్థావరాలను ఏర్పాటు చేయటమే గాక జపాన్‌తో రక్షణ ఒప్పందం కూడా చేసుకున్నారు. ఇప్పుడు ఉత్తర కొరియాతో రష్యా అదే చేసింది. దీని ప్రకారం మూడో పక్షం లేదా కూటమి ఎవరి మీద దాడి చేసినా ఉమ్మడిగా ఎదుర్కొనేందుకు అవకాశం కల్పిస్తుంది. బంగ్లాదేశ్ విముక్తికి మన దేశం మిలిటరీని పంపి సాయం చేసినపుడు మనల్ని బెదిరించేందుకు అమెరికా బంగాళాఖాతం లోకి సప్తమ నౌకా దళాన్ని దించింది. అప్పుడు నాటి సోవియట్ యూనియన్‌తో మన దేశం కూడా ఇలాంటి రక్షణ ఒప్పందమే చేసుకోవటంతో అమెరికా తోక ముడిచింది. ఈ నేపథ్యంలోనే ఒప్పందం జరిగింది. రష్యా, ఉత్తర కొరియా మరింత దగ్గరయ్యాయి. రెండు దేశాల మీద సామ్రాజ్యవాద కూటమి అమలు జరుపుతున్న ఆంక్షలను ఎదుర్కొనేందుకు కూడా ఉపయోగపడుతుంది. పశ్చిమ దేశాలతో సాగుతున్న వైరుధ్యాలు ఇప్పటికిప్పుడు సమసేవి కాదు. ఇప్పటికే చైనాతో ఎంతో దగ్గరైన రష్యా మరొక ముందడుగు వేసి ఉత్తర కొరియాతో మైత్రిని పటిష్టం చేసుకోవటమే కాక పశ్చిమ దేశాలతో పోరాడే సామర్థ్యాన్ని కూడా పెంచుకున్నట్లయింది. ఉత్తర కొరియా కూడా ఎవరిని చూసీ భయపడాల్సిన పరిస్థితి ఉండదు. ఒకవైపు రష్యా, మరొకవైపు చైనా రక్షణ కవచాల్లా ఉంటాయి.

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత నాటి సోవియట్ యూనియన్, ఉత్తర కొరియా, చైనాలను బెదిరించేందుకు, అవసరమైనపుడు దాడులు చేసేందుకు వీలుగా అమెరికన్లు దక్షిణ కొరియా, జపాన్‌లో సైనిక స్థావరాలను ఏర్పాటు చేయటమే గాక జపాన్‌తో రక్షణ ఒప్పందం కూడా చేసుకున్నారు. ఇప్పుడు ఉత్తర కొరియాతో రష్యా అదే చేసింది. దీని ప్రకారం మూడో పక్షం లేదా కూటమి ఎవరి మీద దాడి చేసినా ఉమ్మడిగా ఎదుర్కొనేందుకు అవకాశం కల్పిస్తుంది.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

యుజిసి నెట్ పేపర్ లీక్..

- ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సిబిఐ

న్యూఢిల్లీ: యుజిసి నెట్ పరీక్ష లీకేజీ కేసులో సిబిఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ సూచన మేరకు గుర్తు తెలియని వ్యక్తులపై గురువారం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌కు అర్హత సాధించడానికి, పిహెచ్‌డిల్లో ప్రవేశాలకు, విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకాలకు అర్హత కోసం ఈ నెల 18న దేశ వ్యాప్తంగా ఈ నెట్ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షలో అక్రమాలు జరిగాయంటూ కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో పని చేసే భారతీయ సైబర్ నేర నివారణ సమన్వయ కేంద్రానికి (ఐసిసిసి) చెందిన జాతీయ సైబర్ నేర హెచ్చరిక విశ్లేషణ విభాగం బుధవారం యుజిసికి నివేదిక ఇచ్చింది. దీంతో పరీక్షల్లో అవకతవకలు జరిగాయనడానికి ప్రాథమిక ఆధారాలున్నాయని యుజిసి నిర్ధారించింది. పారదర్శకత, విశ్వసనీయత కోసం ఈ పరీక్షను రద్దు చేస్తున్నట్లు విద్యాశాఖ సంచలన ప్రకటన చేసింది. దేశవ్యాప్తంగా పలు కేంద్రాల్లో పెన్ను, పేపర్ విధానంలో నిర్వహించిన ఈ పరీక్షను 9లక్షల మందికి పైగా విద్యార్థులు రాశారు. త్వరలో మళ్లీ పరీక్ష నిర్వహించనున్నారు.

పంటకాలంలో కరువు బృందం పర్యటనలా?

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పంటవేసే కాలంలో, వర్షాలు కురిసే నేపథ్యంలో రాష్ట్రంలో కరువు తీవ్రతపై కేంద్రబృందం పర్యటించడం హాస్యాస్పదంగా ఉందని సిపిఐ రాష్ట్రకార్యదర్శి కె రామకృష్ణ ఎద్దేవా చేశారు. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం పదేళ్లుగా రైతుల పట్ల శీతకన్ను వేసిందని గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. గత సీజన్‌లో దాదాపు 87 మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని రాష్ట్రప్రభుత్వం కేంద్రానికి నివేదించిందని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏమాత్రం పట్టనట్లు వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరువొచ్చింది ఎప్పుడు? పంట నష్టం జరిగింది ఎప్పుడు? అని ప్రశ్నించారు. ఇప్పుడు కేంద్ర బృందం వచ్చి పంట నష్టాన్ని ఎలా అంచనా వేస్తారని ప్రశ్నించారు.

'వైఎస్ఆర్ ఉచిత విద్యుత్' పేరు మార్పు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకం పేరును రాష్ట్ర ప్రభుత్వం మార్చింది. వైఎస్ఆర్ ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకంగా ఉన్న పేరును ఆంధ్రప్రదేశ్ ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకంగా మారుస్తూ ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి కె విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో అసంఘటిత కార్మికులకు అమలు చేస్తున్న వైఎస్ఆర్ బీమా పథకాన్ని చంద్రన్న బీమాగా మారుస్తూ కార్మికశాఖ కార్యదర్శి హరి జవహర్‌లాల్ జిఒ 344ను విడుదల చేశారు.

సిఎంతో బిజెపి ఎంపిలు, ఎమ్మెల్యేలు భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును రాష్ట్రంలోని బిజెపి ఎంపిలు, ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం సాయంత్రం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఈ భేటీ జరిగింది. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, రాజమండ్రి ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఇతర ఎంపిలు, ఎమ్మెల్యేలు చంద్రబాబును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బిజెపికి చెందిన ప్రజా ప్రతినిధులకు చంద్రబాబు విందు ఇచ్చారు.

అసత్య ప్రచారాన్ని ఆపండి !

- కనీస మద్దతు ధర విషయంలో మోసపూరిత ప్రకటనలు వద్దు
- రైతులకు ద్రోహం చేయొద్దు
- బిజెపి ప్రభుత్వ చర్యలను ఎండగట్టాలని ఎఐకెఎస్ పిలుపు

న్యూఢిల్లీ : ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధరల (ఎంఎస్‌పి) విషయంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మరోసారి అబద్దాలు చెబుతూ, రైతులను మోసం చేస్తోందని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) విమర్శించింది. ఉత్పత్తి వ్యయానికన్నా 50శాతం ఎక్కువగా కనీస మద్దతు ధరను ఇస్తున్నామని చెప్పుకుంటోంది. కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి చాలా మోసపూరితమైన చతురతతో మాట్లాడుతూ, ఉత్పత్తి వ్యయాని కన్నా ఒకటిన్నర రెట్లు ఎక్కువగా ఖరీఫ్ పంటలకు ఎంఎస్‌పిని ఆమోదించినట్లు ప్రకటించారు. కార్పొరేట్ మీడియా వెంటనే ఈ విషయాన్ని పట్టేసుకుంది. దీనిపై విమర్శనాత్మకమైన విశ్లేషణలు ఏమీ లేకుండానే ప్రభుత్వానికి అనుకూలంగా ప్రచారాన్ని చేపట్టింది. ఈ ప్రచారాలన్నీ కూడా వాస్తవానికి సుదూరంగా వున్నాయనేది సుస్పష్టం. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు మేరకు సిటు ప్లస్ 50శాతం ఎంఎస్‌పి ఇస్తామని 2014లో ఇచ్చిన హామీని దారుణంగా ఉల్లంఘించింది. దీనికన్నా చాలా తక్కువగా వుండే ఎటు ప్లస్ ఎఫ్ఎల్ ప్లస్ 50శాతం ఫార్ములాకు మారిపోయింది.

వ్యవసాయ ఉపకరణాల వ్యయం, ధరలపై కమిషన్ (సిఎసిపి) వ్యయ అంచనాల ప్రకారం చూసినా కూడా ఎంఎస్‌పికి సిటు ప్లస్ 50శాతానిక ఎక్కడా పొంతన లేకుండా వుంది. 14 ఖరీఫ్ పంటలకు ప్రకటించిన మద్దతు ధరలను చూస్తే ఈ విషయం స్పష్టమై పోతోంది. వరి, పత్తి, జొన్న వంటి పంటలకు సంబందించి రాష్ట్రాలు ఇచ్చిన సిటు అంచనాలను పరిగణనలోకి తీసుకున్నా కూడా ఈ వ్యయ లెక్కింపుల్లో తేడాలు బాగా తెలుస్తున్నాయి. పెరిగిన ఎరువుల ధరలు, నీటిపారుదల వ్యయం వంటి వాటిని కేంద్రం అస్సలు పరిగణనలోకి తీసుకోలేదని దీన్ని బట్టి తెలుస్తోంది. కనీసం రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన అంచనాలకు కూడా గౌరవం ఇవ్వలేదు.

కనీస మద్దతు ధరపై తప్పుడు మాటలు చెప్పడానికి బదులుగా రైల్వే మంత్రిగా కూడా వున్న అశ్విని వైష్ణవ్ రైలు ప్రయాణికుల భద్రతపై దృష్టి పెట్టాలని ఎఐకెఎస్ సూచించింది. సమాచార, ప్రసార శాఖ మంత్రిగా ఆయన ఇలాంటి తప్పుడు సమాచారాన్ని ప్రచారంచేయకూడదని పేర్కొంది.

నరేంద్ర మోడీ ప్రభుత్వం తక్షణమే ఈ ప్రకటనను నిలుపుచేసి, సంయుక్త కిసాన్ మోర్చాతో చర్చలు జరిపిన తర్వాత సిటు ప్లస్ 50శాతం హామీకి అనుగుణంగా సవరించిన ఎంఎస్‌పితో ముందుకు రావాలని ఎఐకెఎస్ డిమాండ్ చేసింది. ప్రధాని మోడీ, బిజెపి ప్రభుత్వం ఇలా ద్వంద్వ ప్రమాణాలతో చేస్తున్న ప్రకటనలను ఎండగట్టాలని, రైతు వ్యతిరేక ప్రభుత్వ చర్యలకు నిరసనగా తమ గళాలను వినిపించాలని అన్ని శాఖలకు పిలుపునిచ్చింది.

	పంట	ఎంఎస్‌పి / క్వింటాల్	సి2ప్లస్50 శాతం క్వింటాల్	క్వింటాల్‌కు నష్టం
1.	వరి	రూ.2,300	రూ.3,012	రూ.712
2.	జొన్నలు	రూ.3,371	రూ.4,437	రూ.1,066
3.	సజ్జలు	రూ.2,625	రూ.2,904	రూ.279
4.	మొక్కజొన్న	రూ.2,225	రూ.2,795	రూ.570
5.	రాగులు	రూ.4,290	రూ.5,198	రూ.908
6.	కందులు	రూ.7,550	రూ.9,756	రూ.2,206
7.	పెసర్లు	రూ.8,682	రూ.10,956	రూ.2,274
8.	మినుములు	రూ.7,400	రూ.9,744	రూ.2,344
9.	వేరుశెనగ	రూ.6,783	రూ.8,496	రూ.1,713
10.	సోయాబీన్	రూ.4,892	రూ.6,437	రూ.1,555
11.	పొద్దు తిరుగుడు	రూ.7280	రూ.9,891	రూ.2,611
12.	నువ్వులు	రూ.9,267	రూ.12,228	రూ.2,961
13.	నైగర్‌సీడ్	రూ.8,717	రూ.11,013	రూ.2,296
14.	పత్తి	రూ.7,121	రూ.9,345	రూ.2,224

2024-25లో బిజి.. బిజీ...

- సొంతగడ్డపై టీమిండియా షెడ్యూల్ ఇదే!

ముంబయి: 2024-25 సీజన్‌లో టీమిండియా సొంతగడ్డపై ఆడే సిరీస్‌ల షెడ్యూల్‌ను భారత క్రికెట్ బోర్డు(బిసిసిఐ) వెల్లడించింది. సెప్టెంబర్ 19తో ఈ ఏడాది సీజన్ ఆరంభం కానుంది. ఈ సీజన్‌లో తొలుత బంగ్లాదేశ్‌తో రోహిత్ శర్మ సారథ్యంలోని టీమిండియా టెస్ట్ సిరీస్ ఆడనుంది. అనంతరం ఇరుజట్ల మధ్య మూడు టి20ల సిరీస్ జరగనుంది. అక్టోబర్ 12న జరిగే భారత్, బంగ్లా ఆఖరి టి20కి హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదిక కానుంది. ఆ తర్వాత న్యూజిలాండ్ జట్టు భారత పర్యటనకు రానుంది.

అక్టోబర్ 16 నుంచి నవంబర్ 15 వరకూ జరిగే మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో కివీస్ తలపడనుంది. ఈ సిరీస్ ముగియగానే ఇంగ్లండ్ జట్టు టి20, వన్డే సిరీస్ కోసం భారత్‌లో అడుగుపెట్టనుంది. 2025 జనవరి 22 నుంచి ఫిబ్రవరి 12 వరకూ జరిగే ఈ రెండు ఫార్మాట్ల సిరీస్‌లో టీమిండియాజట్టు ఇంగ్లండ్ జట్టుతో తలపడనుంది.

బంగ్లాదేశ్ సిరీస్...

తొలి టెస్టు : సెప్టెంబర్ 19 - 24(చెన్నై)
రెండో టెస్టు : సెప్టెంబర్ 27 - అక్టోబర్ 1(ముంబయి)

టి20 సిరీస్..

తొలి టి20 : అక్టోబర్ 6 (ధర్మశాల)
రెండో టి20 : అక్టోబర్ 9 (ఢిల్లీ)
మూడో టి20 : అక్టోబర్ 12 (హైదరాబాద్)

న్యూజిలాండ్ సిరీస్.. టెస్టు సిరీస్

తొలి టెస్టు : అక్టోబర్ 16 - 20(బెంగళూరు)
రెండో టెస్టు : అక్టోబర్ 24 - 28 (పుణే)
మూడో టెస్టు : నవంబర్ 1 - 5 (ముంబయి)

ఇంగ్లండ్‌తో సిరీస్..

టి20 సిరీస్..

తొలి టి20 : జనవరి 22(చెన్నై)
రెండో టి20 : జనవరి 25(కోల్‌కతా)
మూడో టి20 : జనవరి 28(రాజ్‌కోట్)
నాల్గో టి20 : జనవరి 31(పుణే
ఐదో టి20 : ఫిబ్రవరి 2(ముంబయి)

వన్డే సిరీస్..

తొలి వన్డే : ఫిబ్రవరి 6(నాగ్‌పూర్)
రెండో వన్డే : ఫిబ్రవరి 9(కటక్)
మూడో వన్డే : అక్టోబర్ 12(అహ్మదాబాద్)

నేటి నుంచి హాకీ సభ్యులకు శిక్షణ

బెంగళూరు : పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన పురుషుల హాకీ జట్టుకు బెంగళూరులోని సాయ్ కేంద్రంలో శిక్షణ ప్రారంభమైంది. 27మంది ఆటగాళ్లతో కూడిన హాకీ జట్టుకు శుక్రవారం(జూన్ 21)నుంచి జులై 8వరకు శిక్షణ జరగనుంది. పారిస్ ఒలింపిక్స్‌లో గతంలో మాదిరిగా పతకం కొట్టడమే లక్ష్యంగా హాకీజట్టు శిక్షణను ఉపక్రమించనుంది. గ్రూప్-బిలో భారత్‌తోపాటు బెల్జియం, అర్జెంటీనా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఐర్లాండ్ జట్లు ఉన్నాయి. భారతజట్టు తన తొలి లీగ్ మ్యాచ్‌ను జులై 27న న్యూజిలాండ్‌తో తలపడనుంది.

నేడు బొగ్గుగనుల వేలం

- దేశవ్యాప్తంగా 60 గనుల గుర్తింపు
- వేలంలో పాల్గొననున్న సింగరేణి
- శ్రావణపల్లి బ్లాక్‌ను దక్కించుకునేందుకు యత్నాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో బొగ్గు గనుల వేలం శుక్రవారం నిర్వహించనున్నారు. ప్రతి ఏటా ఏదో ఒక నగరంలో బొగ్గు బ్లాకుల వేలం నిర్వహిస్తారు. మన రాష్ట్రానికి చెందిన కిషన్‌రెడ్డి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రిగా ఉండటంతో 10వ రౌండ్ కమర్షియల్ మైనింగ్ వేలాన్ని ఆయన శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభించనున్నారు. దేశవ్యాప్తంగా 60 బొగ్గు బ్లాక్‌లను వేలం వేయనున్నారు. ఇందులో వివిధ రకాల కోకింగ్, నాన్-కోకింగ్ బొగ్గు గనులున్నాయి. వీటిలో 24 బొగ్గు గనులను పూర్తిగా అన్వేషించగా, 36 గనుల్లో పాక్షిక అన్వేషణ జరిగింది. రాష్ట్రాల వారీగా చూస్తే అత్యధికంగా ఒడిశా 16, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో 15, జార్ఖండ్‌లో 6, పశ్చిమబెంగాల్, బీహార్‌లలో మూడేసి బొగ్గు బ్లాకులను గుర్తించారు. తెలంగాణ, మహారాష్ట్రలో ఒక బ్లాక్‌లను వేలం వేయనున్నారు. బొగ్గు రంగంలో పారదర్శకత, పోటీతత్వం, సుస్థిరతను పెంపొందించడానికి దోహదపడుతుందని అధికార బిజెపి అంటోంది. వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల్లో వ్యూహాత్మకంగా ఉన్న ఈ బ్లాక్‌లు ప్రాంతీయ ఆర్థికాభివద్ధికి, ఉపాధి కల్పనకు దోహదం చేస్తాయని వాదిస్తోంది. అయితే ఈ వాదనను రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌తో పాటు బిఆర్ఎస్ మొదలగు పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. కేంద్రం కార్పొరేట్లకు దేశ సంపదను దోచి పెట్టేందుకే వేలం అని విమర్శిస్తున్నాయి. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వేలంలో పాల్గొనేందుకు నిర్ణయించింది. బిడ్‌లో పాల్గొనకుంటే సింగరేణి కనుమరుగవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నది. గత బిఆర్ఎస్ సర్కార్ వేలానికి మద్దతు పలికిందని ఈ సందర్భంగా వాదిస్తోంది.

శ్రావణపల్లి కోసం సింగరేణి ప్రయత్నం

రాష్ట్రంలో గుర్తించి ఏకైక బొగ్గు బ్లాకైన శ్రావణపల్లిని దక్కించుకునేందుకు సింగరేణి ప్రయత్నాలు ప్రారంభించింది. రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు వేలంలో పాల్గొనేందుకు ఆ సంస్థ అన్ని ఏర్పాట్లు చేసుకుంది. రాష్ట్రంలో సింగరేణి మొత్తం 40 గనుల్లో బొగ్గును వెలికి తీస్తోంది. 2030 కల్లా 22 గనులు మూతపడే అవకాశం ఉంది. ఇప్పుడున్న 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి 15 టన్నులకు పడిపోనుంది. కొత్త గనులు సంపాదించుకోక పోతే సింగరేణి చరిత్రలో కలిసి పోవడం ఖాయం. ఈ నేపథ్యంలో సంస్థను రక్షించుకునేందుకు 11.99 కోట్ల టన్నుల బొగ్గు నిల్వలున్న రాష్ట్రంలోని శ్రావణపల్లి గనిని దక్కించుకునేందుకు సింగరేణి తనవంతుగా వేలంలో పాల్గొనేందుకు సిద్ధమైంది.

విద్యార్థులను మోసం చేస్తున్న ఎన్‌టిఎ

- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి
- ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) మోసం చేస్తోందని, జాతీయ పరీక్షలను నిర్వహించడంలో వైఫల్యం చెందుతోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ విమర్శించింది. కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ బాధ్యతారాహిత్యాన్ని ఖండిస్తున్నట్లు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రారంభం నుంచి విద్యా వ్యవస్థను ఎన్‌టిఎ అపహాస్యం చేస్తోందని విమర్శించారు. పూర్తిగా అసమర్థంగా వ్యవహరిస్తోందని, నీట్ పేపర్ లీక్, సియుఇటి పరీక్షలో వ్యత్యాసాలు, యుజిసి నెట్ పరీక్ష రద్దు ఇందుకు నిదర్శమని పేర్కొన్నారు. నీట్‌లో జరిగిన లీకేజ్ వివాదాల తరువాత యుజిసి నెట్ రద్దు అనేది తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రైవేట్ శిక్షణ కేంద్రాలను పెంపొందించడం, బలహీన తరగతుల విద్యార్థులను విద్యకు దూరం చేయడం వంటి కుట్రను ఎల్లప్పుడూ ఎత్తిచూపుతుందని తెలిపారు. పరీక్షల ప్రమాణాలు దిగజారి లీకేజ్ వరకూ ఇది స్పష్టమైందని, ఈ భారీ అవినీతికి, బాధ్యతారాహిత్యానికి బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నెట్ పరీక్షను రద్దు చేయడం వల్ల ఈ ఏడాది పెద్ద సంఖ్యలో విద్యార్థుల పిహెచ్‌డి అడ్మిషన్లకు కూడా ప్రమాదం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పిహెచ్‌డి పోస్టులకు నెట్‌ను ప్రామాణికం చేయకుండా వేర్వేరుగా యూనివర్సిటీలు నిర్వహించేలా ఆదేశించాలని కోరారు. యుజిసి నెట్ చుట్టూ జరిగిన అవకతవకలపై పారదర్శక, స్వతంత్ర దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణ బాధ్యత నుంచి ఎన్‌టిఎను తొలగించాలని, యుజిసి జవాబుదారీగా, పటిష్టమైన పరీక్ష నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు.

తెలుగు రాష్ట్రాల్లో 2 అసెంబ్లీ, 2 లోక్‌సభ సెగ్మెంట్లలో

ఇవిఎంల వెరిఫికేషన్‌కు దరఖాస్తులు

- వెల్లడించిన ఇసిఐ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశవ్యాప్తంగా 11 చోట్ల ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఇవిఎం) వెరిఫికేషన్ కోసం దరఖాస్తులు వచ్చాయని కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ఒక ప్రకటన లో తెలిపింది. ప్రత్యేకించి ఎక్కడైనా రెండు లేదా మూడో స్థానంలో ఉన్న అభ్యర్థులు వారికి సందేహం కలిగితే ఎన్నికల ఫలితాలు వెలువడిన 45 రోజులలోపు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయవచ్చని సుప్రీంకోర్టు ఇదివరకు ఉత్తర్వులు వెలువరించింది. ఈ నేపథ్యంలో మొత్తం 8 లోక్‌సభ నియోజకవర్గాల్లోని 92 పోలింగ్ కేంద్రాల్లోనూ, మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 26 పోలింగ్ కేంద్రాల్లోనూ ఇవిఎంల వెరిఫికేషన్ కోసం దరఖాస్తు వచ్చినట్టు ఇసిఐ తెలిపింది. ఏపి, తెలంగాణ నుంచి ఐదు దరఖాస్తులు అందాయని తెలిపింది.

ఏపిలో విజయనగరం లోక్‌సభ పరిధిలో రెండు పోలింగ్ కేంద్రాల్లో, బొబ్బిలి, నెల్లిమర్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కో పోలింగ్ కేంద్రంలో వెరిఫికేషన్ కోసం దరఖాస్తులు అందినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 13 పోలింగ్ కేంద్రాల్లో వెరిఫికేషన్ చేయాలని వైసిపి విజ్ఞప్తి చేసింది.

తెలంగాణలోని జహీరాబాద్ పార్లమెంటు నియోజక వర్గంలోని 20 పోలింగ్ స్టేషన్లలో వాడిన ఇవిఎంలను వెరిఫికేషన్ చేయనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఇందులో భాగంగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నారాయణఖేడ్‌లో 7, జహీరాబాద్ లో 7, ఆందోల్(ఎస్సీ)లో 6 పోలింగ్ కేంద్రాల్లో వెరిఫికేషన్ దరఖాస్తులు వచ్చాయని ఈసిఐ తెలిపింది.

ఒరిస్సాలో ఝర్సుగూడ అసెంబ్లీ పరిధిలోని 13 పోలింగ్ కేంద్రాలలో వెరిఫికేషన్ చేయాలని బీజేడీ రిక్వెస్ట్ చేసింది. ఛత్తీస్‌గఢ్ లోని కాంకేర్ లోక్ సభ పరిధిలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాలుగు పోలింగ్ కేంద్రాల్లో, హర్యానాలో కర్నల్, ఫరీదాబాద్ లోక్ సభ నియోజకవర్గాల పరిధిలో 6 పోలింగ్ కేంద్రాల్లో వెరిఫికేషన్ చేయాలని కాంగ్రెస్ పార్టీ అప్లికేషన్ లో పేర్కొంది.

మహారాష్ట్రలోని అహ్మద్ నగర్ లోక్ సభ నియోజకవర్గంలో 40 పోలింగ్ కేంద్రాల్లో, తమిళనాడులోని వెల్లూర్ లోక్ సభ నియోజకవర్గంలో 8 పోలింగ్ కేంద్రాల్లో వెరిఫికేషన్ చేయాలని బిజెపి కోరింది. తమిళనాడులోనే విరుధ్ నగర్ లోక్ సభ పరిధిలో 14 పోలింగ్ కేంద్రాల్లో వెరిఫికేషన్ చేయాలని డిఎండికే దరఖాస్తు చేసింది.

'వందే భారత్' భోజనంలో బొద్దింక



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన సెమీహైస్పీడ్ వందే భారత్ దేశంలో అనేక రూట్లల్లో పరుగులు తీస్తోంది. అధిక ధరలు చెల్లిస్తున్నా.. ఈ రైళ్లలోని భోజన సదుపాయాలపై తరచూ ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. తాజాగా వందేభారత్‌లో ప్రయాణించిన దంపతులకు చేదు అనుభవం ఎదురైంది. రైల్వే శాఖ అందించిన భోజనంలో బొద్దింక వచ్చింది. ఈ విషయాన్ని బాధితులు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. "మా అత్త, మామయ్య భోపాల్ నుంచి ఆగ్రాకు వందేభారత్ రైల్లో ప్రయాణించారు. రైల్వే సిబ్బంది తీసుకొచ్చిన భోజనంలో వడ్డించిన పప్పులో బొద్దింక రావడంతో షాక్‌కి గురయ్యారు. ప్రయాణికుల ఆరోగ్య సమస్యలపై రైల్వేశాఖ దష్టి సారించాల్సిన అవసరం ఉంది. క్యాటరింగ్ యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలి" అని ఓ వ్యక్తి 'ఎక్స్' వేదికగా రైల్వే శాఖకు ఫిర్యాదు చేశారు. రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అధికార ఖాతాను కూడా ట్యాగ్ చేశారు. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

UNIMONI FINANCIAL SERVICES LIMITED
RO: N.G. 12 & 13 Ground Floor, North Block, Manipal Centre, Dickenson Road, Bangalore - 560 042. CIN No.U85110KA1995PLC018175

బహిరంగ ప్రకటన

తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల వేలం UNI MONI FINANCIAL SERVICES LIMITED ద్వారా 24.06.2024 ఉదయం 10.00 గంటలకు దిగువ ఇవ్వబడిన సంబంధిత కేంద్రాలలో నిర్వహించబడుతుందని ప్రజలకు తెలియజేస్తున్నాం. వేలం వేయబోయే బంగారు ఆభరణాలు బకాయిలు చెల్లించడంలో విఫలమైన మా వివిధ కస్టమర్ల రుణఖాతాలకు చెందినవి., ఈ రుణ గ్రహీతలకు మా వేలం నోటీసులు సక్రమంగా జారీ చేయబడ్డాయి. మా వివిధ కస్టమర్లు గడువు వ్యగిసిన ఋణం తిరిగి చెల్లించనందున వేలం వేయడం జరుగుతుంది. ఈ క్రింద వేలం వేయబడే బంగారు ఆభరణం బ్రాంపేరుతో పేర్కొన్నాం.

Auction Centre Address & Loan Nos: KHAMMAM (KHM - D No 8-3-215 , First Floorbeside Indus Ind Bank,Wyra Roakhammam, Khammam - 507001, Contact no : 9959617256) 2033470, 2070607, 2033258, 2035151, 2035863, 2050587, 2068057, 2070385, 2070635, 2070746, 2070938, 2071697, 2078181, 2106405, 2108219, 2057684.

(Reserves the right to alter the number of accounts to be auctioned &/ postpone / cancel the auction without any prior notice.)

IN HONOURABLE THE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM
Gr. & 1st Floor, Sri Narayana Bhawan, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020

Case No. O.A. 74 / 2024

BETWEEN:
Union Bank of India, Tadigadapa Branch, ... Applicant
AND :
Smt. Pakalapati Haveela ... Defendants

SUMMONS TO
Smt. Pakalapati Haveela, W/o. Shaik Jani Basha, Flat No. 306, Second Floor, Green Park, Guntupalli Village and Gram Panchayath, Ibrahimpatnam Mandal, Krishna Dist - 521241

SUBSTITUTED SERVICE OF SUMMONS TO THE DEFENDANT BY WAY OF PAPER PUBLICATION

Whereas, the applicant Bank instituted an application U/S 19 of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 against you for the recovery of sum together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this Tribunal at 10.30 a.m, or at such time immediately thereafter according to the convenience of Tribunal **on 08-07-2024** to answered the claim.

If You intend to file any documents, you may file the same with a list along with the written statement.

You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader / Advocate duly instructed.

Take notice that in default of your appearance on the day mentioned herein before, the proceeding will be heard and determined in your absence.

Given under my hand and seal of the Tribunal on this 29 th day May, 2024.

Signature of the Officer
Authorised to issue summons

నామినేటెడ్ అథారిటీ, బొగ్గుగనుల మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం
120, ఎఫ్-బింగ్, 1వ అంతస్తు, శాస్త్రి భవన్, న్యూఢిల్లీ-110001, 011-23384106.

"బొగ్గు అమ్మకం కొరకు బొగ్గుగనులు/ బ్లాకుల వేలం కొరకు బిడ్స్ ఆహ్వానం"

మైన్స్ అండ్ మినెరల్స్ (డెవలప్‌మెంట్ & రెగ్యులేషన్) యాక్ట్, 1957 యొక్క సెక్షన్ 11ఎ మరియు కోల్ మైన్స్ (స్పెషల్ ప్రొవిజన్స్) యాక్ట్, 2015 యొక్క సెక్షన్ 4(1) మరియు 4(2) ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని మరియు దాని క్రింద రూపొందించిన రూల్స్‌తో అనుసరించి, భారత ప్రభుత్వం. సిఎం (ఎస్‌పి) యాక్ట్, 2015 క్రింద 20వ ట్రెంచ్ ఆఫ్ యాక్షన్ క్రింద 60 బొగ్గు గనులు/ బ్లాకులు మరియు ఎంఎండిఆర్ యాక్ట్, 1957 క్రింద 10వ ట్రెంచ్ ఆఫ్ యాక్షన్ మరియు సిఎం (ఎస్‌పి) యాక్ట్, 2015 క్రింద 19వ ట్రెంచ్ ఆఫ్ యాక్షన్ యొక్క రెండవ ప్రయత్నం మరియు ఎంఎండిఆర్ యాక్ట్ 1957 క్రింద యాక్షన్ యొక్క 8వ ట్రెంచ్ యొక్క రెండవ ప్రయత్నం వేలం చేపట్టుకు నామినేటెడ్ అథారిటీ ఆదేశిచారు. టెండరు ప్రక్రియ శుక్రవారం, జూన్ 21, 2024న ప్రారంభమవుతుంది. టెండరు పత్రం మరియు ఇతర వివరాలకు https://www.mstcecommerce.com/auctionhome/coalblock/index.jsp పై అక్సెస్ చేయండి.

CBC 04107/11/0001/2425

కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్
CanFinHomes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS ◆ DEPOSITS Translating Dreams into Reality
CIN No.L85110KA1987PLC008699
డి.నెం.4-1-1, గాయత్రి ప్లాజా, మొదటి అంతస్తు, కొరిటెపాడు మెయిన్ రోడ్, గుంటూరు-522007.
ఫోన్: 0863-2333064, సెల్: 7625079146, ఇ-మెయిల్: guntur@canfinhomes.com

స్వాధీనత ప్రకటన (రూల్ 8(1)) (స్థిరాస్తి కొరకు)

15	**1. శ్రీ నాగేశ్ అల్లు,** తండ్రి రామారావు అల్లు, ఫ్లాట్ నం.ఎఫ్ఎఫ్-3, విగ్నేశ్వర రెసిడెన్సీ, లక్ష్మి నర్సింగ్ హోమ్ లైన్, పటమట, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-520010. **మరియు: శ్రీ నాగేశ్ అల్లు,** తండ్రి రామారావు అల్లు, ఫ్లాట్ నం.ఎఫ్ఎఫ్-2, విగ్నేశ్వర రెసిడెన్సీ, లక్ష్మి నర్సింగ్ హోమ్ లైన్, పటమట, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-520010. **మరియు: శ్రీ నాగేశ్ అల్లు,** తండ్రి రామారావు అల్లు, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డోర్ నం.21-25/1, తాతయ్య బాబు హాస్పిటల్ ఎదురుగా, తిరువూరు రోడ్, నూజివీడు, ఆం.ప్ర.-521201. **2. శ్రీమతి అల్లు పద్మావతి,** భర్త అల్లు నాగేశ్, ఫ్లాట్ నం.ఎఫ్ఎఫ్-3, విగ్నేశ్వర రెసిడెన్సీ, లక్ష్మి నర్సింగ్ హోమ్ లైన్, పటమట, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-520010. **లోన్ అకౌంట్ నం.: PHR006902939248 & HTR006902284261** **డిమాండ్ నోటీసు తేది:** 22.05.2024 **ఎన్‌పిఎ తేది:** 01.01.2024.	22.05.2024 నాటికి **రూ.26,11,518/-** (రూపాయలు ఇరువై ఆరు లక్షల పదకొండు వేల ఐదు వందల పద్దెనిమిది మాత్రమే) ఈ బకాయి మొత్తాలు అగ్రిమెంట్ నిలిపవేసినప్పటికి 22.05.2024 వరకు వడ్డీ& చార్జీలతోసహా ఈ మొత్తాలు తోపాటు 23.05.2024 నుండి తదుపరి వడ్డీతో.	**షెడ్యూలు-ఎ:** కృష్ణా జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రార్, పటమట సబ్-రిజిస్ట్రార్, విజయవాడ టౌన్, పటమట, ఆర్.ఎస్.నం.100/3, అసెస్మెంట్ నం.32021/బిఎల్‌టి, డోర్ నం.72-4-4, సైటు విస్తీర్ణం 353.0చ.గ.లు. **సరిహద్దులు:** తూర్పు: మున్సిపల్ కార్పొరేషన్ రోడ్, దక్షిణం: కొడాలి రెసిడెన్సీ ఆస్తి, పడమర: పాలడుగు వీరభద్రయ్య ఆస్తి, ఉత్తరం: బ్రహ్మకుమారి ఈశ్వరయ్య యూనివర్సిటీ ఆస్తి, ఈ సరిహద్దుల్లో 353.0చ.గ.లు లేదా 294.307చ.మీ.ల విస్తీర్ణంనకుగాను 44.0చ.గ.లు లేదా 36.78చ.మీ.ల విడదీయలేని మరియు సూచించజాలనీ ఆస్తి భాగం. **షెడ్యూలు-బి:** పై షెడ్యూలు-ఎలో "విగ్నేశ్వర రెసిడెన్సీ" పేరున నిర్మించిన అపార్టుమెంట్: మొదటి అంతస్తులో ఫ్లాట్ నం.ఎఫ్ఎఫ్-2 ఆస్తి. మరియు **సరిహద్దులు:** తూర్పు: మెట్లు& ఉమ్మడ కారిడార్, దక్షిణం: ఒపెన్ టు స్కై, పడమర: ఒపెన్‌టు స్కై, ఉత్తరం: ఒపెన్ టు స్కై. ఈ సరిహద్దుల్లో ఈజిమెంట్ హక్కులన్నింటితో 149.35చ.అ.ల కార్ పార్కింగ్ మరియు 146.66చ.అ.ల ఉమ్మడి ఏరియా, మొదటి అంతస్తు, ఫ్లాట్ నం.ఎఫ్ఎఫ్-2, 997చ.అ.ల ప్లింత్ ఏరియా.
17	**1. శ్రీ కలంగి శ్రీనివాస రావు,** తండ్రి కలంగి తిరుపతి రావు, 2వ అంతస్తు, రత్న కన్‌స్ట్రక్షన్స్, విశ్వశాంతి స్కూల్ దగ్గర, వుయ్యూరు, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-521165. **మరియు: శ్రీ కలంగి శ్రీనివాస రావు,** తండ్రి కలంగి తిరుపతి రావు, డోర్ నం.8/323-ఎ, రాజేంద్ర నగర్-5 లైన్, జగన్నాధపురం, టెంపుల్ దగ్గర, గుడివాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-521301. **మరియు: శ్రీ కలంగి శ్రీనివాస రావు,** తండ్రి కలంగి తిరుపతి రావు, లెక్చరర్, విశ్వ శాంతి ఎడ్యుకేషనల్ సొసైటీ, గండిగుంట, బైపాస్ దగ్గర, వుయ్యూరు, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-521165. **మరియు: శ్రీ కలంగి శ్రీనివాస రావు,** తండ్రి కలంగి తిరుపతి రావు, ఫ్లాట్ నం.ఎఫ్ఎఫ్-3, డోర్ నం.54-20/2-14ఎ, సూర్య రెసిడెన్సీ, భారతి నగర్, గుణదాల, బస్టాప్ దగ్గర, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-520008. **2. శ్రీమతి కలంగి భారతి,** భర్త కలంగి శ్రీనివాసరావు, 2వ అంతస్తు, రత్న కన్‌స్ట్రక్షన్, విశ్వశాంతి స్కూల్ దగ్గర, వుయ్యూరు, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-521165. **మరియు: శ్రీమతి కలంగి భారతి,** భర్త కలంగి శ్రీనివాస రావు, డోర్ నం.8/323-ఎ, రాజేంద్ర నగర్-5 లైన్, జగన్నాధపురం, టెంపుల్ దగ్గర, గుడివాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-521301. **లోన్ అకౌంట్ నం.: PHR006908645145** **డిమాండ్ నోటీసు తేది:** 11.06.2024 **ఎన్‌పిఎ తేది:** 08.06.2024.	11.06.2024 నాటికి **రూ.37,01,395.55 పై.లు** (రూపాయలు ముప్పై ఏడు లక్షల ఒక వేల మూడు వందల తొంబై ఐదు మరియు యాభై ఐదు పైసలు మాత్రమే) ఈ బకాయి మొత్తాలు అగ్రిమెంట్ నిలిపవేసినప్పటికి 11.06.2024 వరకు వడ్డీ& చార్జీలతోసహా ఈ మొత్తాలు తోపాటు 12.06.2024 నుండి తదుపరి వడ్డీతో.	**షెడ్యూలు-ఎ:** ఎన్‌టిఆర్ జిల్లా, సబ్-రిజిస్ట్రార్ గుణదాలా పరిధిలో విజయవాడ, గుణదాల, భారతి నగర్, ఆర్ఎస్ నం.459, 459/2, డోర్ నం.54-20/2-14ఎ లో 642.22చ.గ.లు లేదా 536.96చ.మీ.ల విస్తీర్ణపు సైటు యొక్క మొత్తం భాగం. **సరిహద్దులు:** తూర్పు: మున్సిపల్ కార్పొరేషన్ రోడ్, దక్షిణం: మున్సిపల్ కార్పొరేషన్ రోడ్, పడమర: నూటక్కి విజయ శేఖర్, అన్నె రమాదేవి, వీరమచనేని శ్రీనివాస్& ఇతరులకు చెందిన ఆస్తి, ఉత్తరం: వెలివే జయ శ్రీ, సిరిపూరపు సీతా రాంబాబుకు చెందిన ఆస్తి. పై సరిహద్దుల్లో 642.22చ.గ..లు లేదా 536.96చ.మీ.లు సైటులో 47.0చ.గ.లు లేదా 39.29చ.మీ.ల విడదీయలేని ఉమ్మడి వాటా భాగం సైటు. **షెడ్యూలు-బి:** పై సదరు షెడ్యూలు-ఎ సైటులో, "సూర్య రెసిడెన్సీ" పేరు& స్టైల్ అపార్టుమెంట్ పరిధితో ఏదైతే మొదటి అంతస్తులో ప్రస్తుత అసెస్మెంట్ నం.1073143073, డోర్ నం.54-20/2-14ఎ, ఫ్లాట్ నం.ఎఫ్ఎఫ్-3. **సరిహద్దులు:** తూర్పు: ఒపెన్ టు స్కై, దక్షిణం: బాల్కనీ& ఒపెన్ టు స్కై, పడమర: ఒపెన్ టు స్కై, ఉత్తరం: ఒపెన్ టు స్కై & ఉమ్మడి కారిడార్. ఈ సరిహద్దుల్లో అన్ని ఈజిమెంట్ హక్కులతో మరియు 100చ.అ.ల కార్ పార్కింగ్ ఏరియా, 30చ.అ.ల ఉమ్మడి ఏరియా, మొదటి అంతస్తు, ఫ్లాట్ నం.ఎఫ్.ఎఫ్-3, ప్లింత్ ఏరియా 1141చ.అ.లు.

ఒకవేళ పై పేర్కొన్న వ్యక్తులైన మీరు ఈ నోటీసు తేది నుండి 60 రోజుల్లోగా సార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద ఈ నోటీసు యొక్క నియమాలలో పైన చూపినట్లుగా తదుపరి వడ్డీ మరియు ఇన్సిడెంటల్ వ్యయాలు, ఖర్చులుతో మీచేత బకాయిపడిన పై పేర్కొన్న మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందినయెడ, బ్యాంకు, సార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(4) క్రింద మరియు సదరు చట్టం యొక్క ఇతర వర్తించు నియమాలు అనుసరించి అన్ని లేదా ఏవేని అధికారాలను వినియోగిస్తుంది. చట్టం యొక్క ఏవేని ఇతర నియమాల క్రింద ఇది అవసరమైనట్లుగా అట్టి ఇతర చర్యలు లేదా చట్టపరమైన చర్యలు ప్రారంభించుటకు బ్యాంకుకుగల అధికారాలతో పక్షపాతంలేకుండా ఈ ప్రకటన జారీచేయబడినది.

తేది: 21-06-2024, ప్రదేశం: ఆంధ్రప్రదేశ్. **సం/- అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్**

నీట్, నెట్ అక్రమాలపై కదంతొక్కిన విద్యార్థిలోకం

- దేశవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు
- ఢిల్లీలో ధర్మేంద్ర ప్రధాన్ కార్యాలయం వద్ద నిరసనాగ్రహం
- ఎన్‌టిఎ రద్దు, విద్యామంత్రి రాజీనామాకు డిమాండ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జాతీయ స్థాయి పరీక్షల ప్రశ్నాపత్రాల వరుస లీకేజీలు, అక్రమాలపై విద్యార్థిలోకం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని ప్రశ్నిస్తూ దేశవ్యాప్తంగా గురువారం నాడు భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) నేతృత్వంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. తెలుగు రాష్ట్రాల్లోనూ పలు నగరాల్లో ఆందోళనలు జరిగాయి. ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేద్ర ప్రదాన్ కార్యాలయమైన శాస్త్రీభవన్ వద్ద విద్యార్థులు కదంతొక్కారు. నీట్-యుజి, యుజిసి నెట్ పరీక్షల్లో అక్రమాలకు బాధ్యత వహించి ధర్మేద్ర తక్షణమే రాజీనామా చేయాలని, ఎన్‌టిఎను రద్దు చేయాలని విద్యార్థులు నినదించారు. ఢిల్లీలోనూ, బిజెపి పాలిత రాష్ట్రాల్లోనూ విద్యార్థుల ఆందోళనలను అణిచేసేందుకు పోలీసులు బలప్రయోగం ప్రదర్శించారు. ఢిల్లీలో జెఎన్‌యుఎస్‌యుతో పాటు, ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, డిఎస్ఎఫ్, కెవైఎస్, ఎన్ఎస్‌యుఐ విద్యార్థి సంఘాలు శాస్త్రి భవన్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాయి. ఢిల్లీ పోలీసులు విద్యార్థులపై దాడికి దిగారు. విద్యార్థినులపైనా మగ పోలీసులు దాడికి పాల్పడ్డారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులను అరెస్టు చేసి ఢిల్లీలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. పోలీసుల దౌర్జన్యాన్ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండించింది. యుజిసి నెట్ స్కామ్, నీట్, సెంట్రల్ యూనివర్శిటీస్ ఎంట్రన్స్ టెస్ట్ (సియుసెట్) నిర్వహణలో పేపర్ లీక్‌లు, స్కామ్‌లతో సహా ఎన్‌టిఎ చుట్టూ ఉన్న వివాదాల నేపథ్యంలో పరీక్షల నిర్వహణకు అర్హత కోల్పోయిన ఎన్‌టిఎని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూక్ బిశ్వాస్ డిమాండ్ చేశారు. పరీక్షల మాల్ ప్రాక్టీస్ కు కారణమైన కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పలువురు ధర్మేంద్ర ప్రధాన్ నివాసం ఎదుట ఆందోళన చేయగా, వారిని పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నో సర్వ కళాశాల ఎదుట నిరసన తెలిపిన ఎస్ఎఫ్ఐ కార్యకర్తలపై పోలీసులు దారుణంగా దాడి చేశారు. ఉత్తరప్రదేశ్‌తో పాటు బీహార్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, హిమాచల్ ప్రదేశ్, కేరళ, త్రిపుర తదితర రాష్ట్రాల్లోనూ విద్యార్థులు ఆందోళనకు దిగారు.

బిజెపి హయాంలో పరీక్షలను నాశనం చేస్తున్నారని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షులు అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. ఉక్రెయిన్-రష్యా వివాదానికి ముగింపు పలికామని, పరీక్ష పేపర్ లీక్‌ను ఆపలేకపోయామని చెబుతున్న మోడీని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. బిజెపి, ఆర్ఎస్ఎస్‌తో సంబంధం ఉన్న వారిని తొలగించకుండా విద్యా వ్యవస్థను కాపాడలేమని రాహుల్ అన్నారు.

త్రిపురలో ధర్మేంద్ర ప్రదాన్ దిష్టి బొమ్మను దగ్ధం చేస్తున్న విద్యార్థులు

కేరళలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళన చేస్తున్న నీట్ అభ్యర్థులు

ఇది ఘోరమైన వైఫల్యం

- పినరయి విజయన్

తిరువనంతపురం : కేంద్ర ప్రభుత్వ ఘోరమైన అసమర్ధత వల్ల కీలకమైన జాతీయస్థాయి పరీక్షల విశ్వసనీయత దెబ్బతిందని, లక్షలాదిమంది విద్యార్థుల భవితవ్యం ప్రతిష్టంభనలో పడిందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. ఈ మేరకు ఆయన ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టారు. పరీక్షల సమగ్రతకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) హామీ కల్పించలేకపోవడంతో యుజిసి-నెట్ పరీక్షను కేంద్రం రద్దు చేసిందన్నారు. వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు దేశవ్యాప్తంగా నిర్వహించే నీట్ పరీక్షల నిర్వహణ, నిజాయితీ విషయంలో అవినీతి జరిగిందని వార్తలు వచ్చిన నేపథ్యంలో ఈ కొత్త వివాదం చెలరేగిందని విజయన్ పేర్కొన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, పిహెచ్‌డి కోర్సులకు అభ్యర్థులను ఎంపిక చేయడానికి యుజిసి-నెట్ పరీక్షను ఏడాదికి రెండుసార్లు ఎన్‌టిఎ నిర్వహిస్తుంది. విద్యార్థులు, వారి కుటుంబాలు పెద్ద మొత్తంలో డబ్బును, కాలాన్ని పెట్టుబడిగా పెడతారని, కీలకమైన ఈ పరీక్షల కోసం ఎంతో శ్రమ పడతారని ఆయన పేర్కొన్నారు. ఎన్‌టిఎ అసమర్ధత వల్ల లక్షలాదిమంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందుల్లో పడుతున్నారని అన్నారు.

'నీట్‌పై వివాదం ఇంకా సద్దుమణగలేదు, ఈలోగా పరీక్షల సమగ్రత విషయంలో రాజీపడ్డారంటూ యుజిసి-నెట్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు కేంద్ర విద్యా శాఖ ప్రకటించింది. ఇలా పదే పదే అసమర్థత ఎంతమాత్రమూ ఆమోదయోగ్యం కాదు. దీనివల్ల వేలాదిమంది విద్యార్థులు ఆందోళనలో పడుతున్నారు, ప్రజాధనం వృధా అవుతోంది. ఎన్‌టిఎలో తలెత్తిన ఈ సంక్షోభాన్ని పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి. పారదర్శకమైన, సక్రమమైన, నమ్మకమైన పరీక్షా ప్రక్రియకు హామీ కల్పించాలి." అని విజయన్ పేర్కొన్నారు.

విద్యా రంగాన్ని కాషాయీకరణ చేయడానికి ప్రయత్నిస్తున్న బిజెపి ప్రభుత్వం విద్యార్థుల పట్ల తన ప్రాథమిక బాధ్యతను మరిచిపోయిందని విజయన్ విమర్శించారు.

పరీక్ష ముందు రోజే ప్రశ్నా పత్రం లీక్

న్యూఢిల్లీ : నీట్ పరీక్ష వివాదం కొత్త మలుపు తిరిగింది. నీట్ ప్రశ్నాపత్రం పరీక్షకు ముందు రోజు లీకైందని బీహార్‌లో అరెస్టయిన నలుగురు వ్యక్తులు అంగీకరించారు. నీట్ అభ్యర్థి అనురాగ్ యాదవ్, ధన్‌పూర్ మునిసిపల్ కౌన్సిల్‌లో జూనియర్ ఇంజనీర్ సికందర్ యాదవేందు, మరో ఇద్దరు నితీష్ కుమార్, అమిత్ ఆనంద్‌లను బీహార్ పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఏ పోటీ పరీక్ష ప్రశ్నాపత్రమైనా లీక్ చేయవచ్చని, నీట్ ప్రశ్నాపత్రానికి ఒక్కొక్కరికీ రూ. 30 లక్షలు ఖర్చు అవుతుందని అమిత్ ఆనంద్, నితీష్ కుమార్‌లు తనతో చెప్పారని యాదవెందు పేర్కొన్నారు. నలుగురు విద్యార్థులు ఉన్నారని, వారు పరీక్షలో ఉత్తీర్ణత సాధించేందుకు సహాయం కావాలని వారిని కోరారని యాదవెంతు తెలిపారు. జూన్ 4న రాత్రి ఆ విద్యార్థులను తనతో పాటు తీసుకువెళ్లానని, ఇద్దరు నిందితులు వారికి ప్రశ్నాపత్రం ఇచ్చారని అన్నారు. అయితే తాను ఒక్కొక్కరిని రూ. 30 లక్షలకు బదులుగా రూ. 40 లక్షలు అడిగానని పోలీసులకు తెలిపారు. మరుసటి రోజు వెహికల్ చెకప్‌లో విద్యార్థుల అడ్మిట్ కార్డులతో పట్టుబడ్డానని, నేరాన్ని అంగీకరించినట్లు చెప్పారు.

విద్యాసంస్థలను కబలించిన బిజెపి, ఆర్ఎస్ఎస్

- లీకేజీలను ఆపలేకపోతున్న మోడీ సర్కార్
- నీట్, నెట్ అక్రమాలపై నిలదీస్తాం
- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: దేశంలో విద్యావ్యవస్థను బిజెపి, ఆర్ఎస్ఎస్ భ్రష్టు పట్టించాయని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ మోడీ సర్కార్‌పై విరుచుకుపడ్డారు. విద్యాసంస్థలను ఆ రెండూ పూర్తిగా కబలించాయని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్, నెట్ కుంభకోణాలపై పార్లమెంటులో 'ఇండియా' ఫోరం నిలదీస్తుందని ఆయన తెలిపారు. ఢిల్లీలోని ఎఐసిసి ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో గాంధీ పలు అంశాలను ప్రస్తావించారు. 'భారత్ జోడో న్యాయ్ యాత్ర సందర్భంగా... దేశంలో నాన్‌స్టాప్ పేపర్ లీకేజీలు జరుగుతున్నాయని చాలా మంది విద్యార్థులు ఫిర్యాదు చేశారు. మీ అందరికీ తెలిసినట్టుగా నీట్, యుజిసి నెట్..2024 లీక్ అయ్యాయి. అందులో ఒకదాన్ని మాత్రమే కేంద్రం రద్దు చేసింది. రష్యా - ఉక్రెయిన్ యుద్ధాన్ని మోడీ ఆపారని చెబుతున్నారు. అది నిజమా కాదా అన్నది అలా ఉంచితే... దేశంలో పేపర్ లీకేజీలను మాత్రం మోడీ ఆపలేకపోతున్నారు" అని రాహుల్ ఘాటుగా విమర్శించారు. పదేళ్ల మోడీ పాలనలో ఉపాధి కరువైంది. ఉద్యోగాల్లేవు. పోటీ పరీక్షలు ఇలా లీకులతో రద్దవుతుంటే.. ఓడిపోయేది విద్యార్థులేనని ఆందోళన వ్యక్తం చేశారు. నెలలు, ఏండ్లపాటు ప్రిపేరై పరీక్ష రాస్తే.. భావితరాల భవిష్యత్తుతో ఈ ప్రభుత్వం ఆడుకుంటోందని అన్నారు. 'మధ్యప్రదేశ్‌లో వ్యాపం స్కాం జరిగింది. ఇపుడు దేశమంతా లీకులు విస్తరించాయి. విద్యాసంస్థల హైజాకింగ్ జరుగుతోంది. ఆర్ఎస్ఎస్ చేతుల్లో విద్యావ్యవస్థ బందీ అయ్యింది. విద్య కాషాయికరణను మోడీ మరింత సులభతరం చేశారు. అవకతవకలపై విచారణ కొనసాగుతోంది. ఇపుడు ఒక పరీక్షను రద్దు చేశారు. మరొకటి రద్దు చేస్తారో లేదో తెలియదు' అని రాహుల్ గాంధీ అన్నారు. లీకులు, రద్దుకు కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. రాబోయే పార్లమెంటు సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతారా..? అని అడిగిన ప్రశ్నకు, 'అవును, మేం దీన్ని పార్లమెంటులో ప్రస్తావిస్తాం' అని గాంధీ చెప్పారు.

వెయ్యి దాటిన హజ్ మృతుల సంఖ్య

రియాద్ : హజ్ యాత్రలో మృతుల సంఖ్య వెయ్యికి చేరినట్లు మీడియా గురువారం తెలిపింది. మృతుల్లో సగానికి పైగా అధిక వేడి, ఉక్కపోత కారణంగానే మరణించినట్లు వెల్లడించింది. గురువారం మరణించిన వారిలో 58 మంది ఈజిప్టియన్లు ఉన్నట్లు తెలిపింది. ఈ దేశానికి చెందిన మొత్తం 658 మంది మరణించారని సౌదీ అరేబియా దౌత్యవేత్త పేర్కొన్నారు. 630 మంది నమోదు కాలేదని అన్నారు. మృతుల్లో 68 మంది భారతీయులు కూడా ఉన్నారు.

హజ్ యాత్రలో సుమారు 1,081 మంది మరణించినట్లు పది దేశాలు నివేదించాయి. ఈ గణాంకాలు అధికారిక ప్రకటనలు లేదా ఆయా దేశాల దౌత్యవేత్తలు సమాచారమిచ్చినట్లు దౌత్యవేత్త పేర్కొన్నారు.

మక్కా మసీదులో ఈ వారం ప్రారంభంలో అత్యధికంగా 51.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు జాతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ ప్రాంతంలో ప్రతీ దశాబ్దానికి ఉష్ణోగ్రతలు 0.4 డిగ్రీలు పెరుగుతున్నట్లు గతనెలలో ప్రచురితమైన సౌదీ అధ్యయనం పేర్కొంది.

రామాయణంపై నాటకాన్ని ప్రదర్శించిన 8 మంది విద్యార్థులకు ఐఐటి బాంబే జరిమానా

ముంబయి : విమర్శ, వ్యంగ్యం, ప్రశ్నించేతత్వం కళలకు జీవం పోస్తాయి. అలాంటి కళలకు ఒకప్పుడు విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల నుంచి గొప్ప ప్రోత్సాహం లభించేది. కేంద్రంలో మోడీ సర్కార్ వచ్చిననాటి నుంచి ఆంక్షలు, అణిచివేతలతో ప్రశ్నించే తత్వాన్ని చంపేస్తున్నాయి. ఈ క్రమంలో తాజాగా ఐఐటి - బాంబే దుర్మార్గమైన చర్యలు చేపట్టింది. రామాయణాన్ని, అందులోని రాముడి గుణగణాలను ప్రశ్నిస్తూ 'రాహోవన్' పేరిట వ్యంగ్య నాటకాన్ని ప్రదర్శించిన 8 మంది విద్యార్థులకు ఐఐటి - బాంబే భారీ జరిమానా విధించింది. ఈ ఏడాది మార్చి 31న ఫెర్ఫార్మింగ్ ఆర్ట్స్ ఫెస్టివల్ (పిఎఎఫ్)లో భాగంగా 'రాహోవన్' నాటకాన్ని ప్రదర్శించారు. అయితే ఈ నాటకం రాముడిని, రామాయణాన్ని కించపర్చేలా ఉందని సంఘ్ పరివార్ విద్యార్థి సంఘానికి చెందినవారు విద్యాసంస్థ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి విద్యార్థులపై చర్యలకు ఒత్తిడి తీసుకొచ్చారు. సంఘ్ పరివార్ ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు నాటకాన్ని ప్రదర్శించిన 8 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.40 వేల నుంచి రూ.1,20,000 వరకూ జరిమానా విధించారు. ఈ నెల 4న ఐఐటి బాంబే రిజిస్ట్రార్ కార్యాలయం జారీ చేసిన నోటీసుల్లో ఈ విషయాన్ని తెలిపారు. జులై 30లోగా జరిమానా చెల్లించాలని తెలిపారు. అయితే ఈ విషయంపై స్పందించేందుకు ఐఐటి బాంబే నిరాకరించింది.

ఎయిర్‌లైన్స్, ఎయిర్‌పోర్టుల్లో మహిళా ఉద్యోగుల సంఖ్యను పెంచాలి

- డిజిసిఎ ఆదేశాలు

న్యూఢిల్లీ : విమానయాన సంస్థలు, విమానాశ్రయాల్లో మహిళా ఉద్యోగులను పెంచాల్సిందిగా పౌరవిమానయాన నియంత్రణ సంస్థ డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) ఆదేశించింది. 2025 నాటికి వివిధ స్థాయిల్లో 25 శాతం మహిళలు ఉండేలా చూడాలని పేర్కొంది. లింగ సమానత్వ దిశగా చర్యలు తీసుకోవాలన్న అంతర్జాతీయ పౌరవిమానయాన సంస్థ (ఐసిఎఒ) ఆలోచనకు అనుగుణంగా ఈ ఆదేశాలను జారీ చేసినట్లు డిజిసిఎ తెలిపింది.

గతేడాది డిజిసిఎ నియమించిన నలుగురు సభ్యుల కమిటీ భారత్‌లోని విమానయాన రంగంలో లింగ సమానత్వాన్ని సాధించడానికి పలు సూచనలను రూపొందించింది. పని ప్రదేశంలో లింగ సమానత్వంలో ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించడానికి వాటాదారులు వారి విధానాలు, నిబంధనలను మెరుగుపరచడానికి చేపట్టాల్సి చర్యలను సర్క్యులర్ వివరించింది. లైంగిక వేధింపులను చేపట్టడం, భిన్న లక్ష్యాలను గుర్తించడం వాటిని సాధించడం కోసం హెచ్ విధానాల్లో మార్పులు వంటి చర్యలు ఉన్నాయి. మహిళా ఉద్యోగుల పని విధానాల్లో మార్పులు చేయడం, మహిళల రోల్ మోడల్స్, లేదా పురోగతి సాధించిన వారిని హైలెట్ చేయడం, లింగబేధం లేని పని సంస్కృతిని ప్రోత్సహించడం వంటి చర్యలు చేపట్టాల్సి వుందని తెలిపింది.

డిజిసిఎ డేటా ప్రకారం.. దేశంలో 15 మంది మహిళా పైలెట్లు ఉన్నారు. ఇది ప్రపంచవ్యాప్త సగటు 5 శాతం కన్నా మూడు రెట్లు అధికం. గతేడాది డిజిసిఎ 1,622 వాణిజ్య పైలెట్ లైసెన్స్‌లు జారీ చేయగా వాటిలో 294 మంది మహిళలు ఉన్నారు. గతేడాదితో పోలిస్తే 22 శాతం పెరిగినట్లు తెలిపింది. డిజిసిఎలో శ్రామిక శక్తిలో 11 శాతం మహిళలు ఉన్నట్లు డిజిసిఎ హెడ్ విక్రమ్ దేవ్ గతంలో పేర్కొన్నారు. పితృస్వామ్య సమాజంలో ఉన్న పురుషుల మనస్తత్వ కొంత అడ్డంకిగా మారుతోందని, ఈ సమస్యను పరిష్కరించడం సవాలుగా నిలిచిందని అన్నారు. గతేడాది ప్రపంచంలోనే అత్యధికంగా మొత్తం శ్రామిక శక్తిలో 44 శాతం మహిళలను నియమించినట్లు భారత్‌లో ఇండిగో సంస్థ ప్రకటించింది.

లోక్‌సభ ప్రొటెం స్పీకర్‌గా భర్తృహరి మహతాబ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ప్రొటెం స్పీకర్‌గా భర్తృహరి మహతాబ్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నియమించారు. ఈ సందర్భంగా గురువారం ఆయనతో రాష్ట్రపతి ప్రమాణం చేయించారు. ఈ నెల 24 నుంచి పార్లమెంట్ సమావేశాలు జరగనున్న విషయం తెలిసిందే. కొత్తగా ఎంపికైన ఎంపిలతో ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. అనంతరం లోక్‌సభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్లను ఎన్నుకోనున్నారు. భర్తృహరి మహతాబ్ ఒరిస్సాలోని కటక్ నుంచి ఎంపిగా ఏడోసారి గెలుపొందారు. గతంలో ఆయన నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజెడి పార్టీలో కొనసాగారు. ఎన్నికలకు ముందు బిజెపిలో చేరారు. ఆయన మాజీ సిఎం హరేకృష్ణ మహతాబ్ తనయుడు. మహతాబ్ నియామకంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోషల్ మీడియా వేదికగా హర్షం వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 95(1) ప్రకారం ఎంపి భర్తృహరి మహతాబ్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమించడం సంతోషంగా ఉందన్నారు.

ఐఎస్ఎస్‌లోకి భారత వ్యోమగామి !

- నాసా చీఫ్ వెల్లడి

వాషింగ్టన్ : అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లోకి భారత్ నుంచి వ్యోమగామిని తీసుకెళ్లేందుకు తాము కృషి చేస్తామని, అంతరిక్ష రంగంలో భారత్‌తో బంధాన్ని మరింత బలోపేతం చేస్తామని నాసా అధిపతి బిల్ నెల్సన్ గురువారం వెల్లడించారు. రోదసీ రంగంలో భారత్‌తో సహకారాన్ని అమెరికా రోదసీ సంస్థ విస్తరిస్తుందని నెల్సన్ పేర్కొన్నారు. అమెరికా, భారత్ జాతీయ భద్రతా సలహాదారులు జేక్ సులివాన్, అజిత్ దోవల్ సోమవారం చర్చలు జరిపిన నేపథ్యంలో ఫ్యాక్ట్ షీట్‌ను విడుదల చేసిన నేపథ్యంలో నెల్సన్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికాలో ఇస్రో వ్యోమగాములకు అత్యాధునిక శిక్షణ ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు అజిత్ దోవల్ చెప్పారు. గతేడాది భారత్‌లో నెల్సన్ పర్యటించిన సంగతి తెలిసిందే. మానవాళి ప్రయోజనాల కోసం కీలకమైన, కొత్తగా ఆవిర్భవించే సాంకేతికతలపై అమెరికా, భారత్ చొరవను మరింత ముందుకు తీసుకెళ్ళడానికి నాసా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. అయితే ఐఎస్-ఎస్‌కు భారత వ్యోమగామిని తీసుకెళ్ళే మిషన్‌కు సంబంధించి ఇంకా వివరాలన్నీ ఖరారు చేయాల్సి వుందన్నారు.

6 టన్నుల బంగారం కొనుగోలు

- యుఎస్ ట్రెజరీ సెక్యూరిటీస్ విక్రయం

ముంబయి : విదేశీ నిల్వల నిర్వహణను విస్తృత పరచడంలో భాగంగా అంతర్జాతీయ సెంట్రల్ బ్యాంకులకు అనుగుణంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఇటీవల 6 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. బదులుగా ఈ ఏప్రిల్‌లో 7 బిలియన్ డాలర్ల విలువైన యుఎస్ ట్రెజరీ సెక్యూరిటీస్‌లను (యుఎస్‌టి) విక్రయించింది. భారత్ ముఖ్యంగా ఆర్‌బిఐకి చెందిన యుఎస్ ట్రెజరీ సెక్యూరిటీల విలువ ఏప్రిల్‌లో 7.1 బిలియన్ డాలర్లకు పడిపోయింది. ఇది నెలాఖరు నాటికి యుఎస్ ట్రెజరీ సెక్యూరిటీస్ ఎక్స్‌పోజర్ విలువ (యుఎస్‌టిఎస్) 233.5 బిలియన్లకు చేరుకున్నట్లు యుఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ సమాచారం పేర్కొంది.

భారత్ ఏప్రిల్‌లో సుమారు ఒక బిలియన్ డాలర్ల విలువైన యుఎస్‌టిలను కొనుగోలు చేసింది, అదే సమయంలో బంగారం స్టాక్ సుమారు 794 టన్నుల వద్ద ఉంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరిగేకొద్దీ డాలర్ వ్యతిరేక ఆస్తులను, బంగారాన్ని కూడబెడుతున్న ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇతర సెంట్రల్ బ్యాంకులకు అనుగుణంగా ఆర్‌బిఐ కూడా వ్యూహ రచన చేసినట్లు తెలుస్తోంది.

విదేశీ సెంట్రల్ బ్యాంకులు యుఎస్‌టిలకు తమ ఎక్స్‌పోజర్‌ను 30 బిలియన్ డాలర్లకు తగ్గించినట్లు యుఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ విడుదల చేసిన నివేదిక తెలుపుతోంది.

మరోవైపు, సెంట్రల్ బ్యాంకులు జనవరి మార్చి త్రైమాసికంలో ప్రపంచవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 290 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేయగా, ఈ త్రైమాసికంలో చైనా, టర్కిష్ సెంట్రల్ బ్యాంకులు అత్యధిక కొనుగోళ్లకు కారణమయ్యాయని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ సూచీ తెలిపింది.

2017 డిసెంబర్ నుండి రిజర్వ్ బ్యాంక్ మార్కెట్ నుండి క్రమం తప్పకుండా బంగారాన్ని కొనుగోలు చేస్తోంది. అయితే ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల మధ్య గత రెండు సంవత్సరాలుగా కొనుగోళ్లను తీవ్రతరం చేసింది. ఈ ఏడాది జనవరి నుండి కొనుగోళ్లను మరింత వేగవంతం చేసింది. సెంట్రల బ్యాంక్ మేలో మరో మూడు టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. ఈ ఏడాది ఇప్పటివరకు క్యాలెండర్ సంవత్సరంలో 28 టన్నులకు చేరినట్లు తాజా సమాచారం తెలుపుతోంది.

ద్రవ్యోల్బణం, విదేశీ నిల్వల ఇబ్బందులకు వ్యతిరేకంగా రక్షణగా, ప్రధానంగా విదేశీ కరెన్సీ ఆస్తుల బేస్‌కు భిన్నంగా బంగారాన్ని రిజర్వ్ చేయడం సెంట్రల్ బ్యాంక్ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. బంగారం నిల్వలను పెంచుతున్నామని, వాటి సమాచారం ఎప్పటికప్పుడు విడదలవుతుందని ఏప్రిల్ 5న పోస్ట్ పాలసీ మీడియా స మావేశంలో ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ పేర్కొన్నారు. నిల్వలను పెంచే విషయంలో అన్ని అంశాలను అంచనా వేసి, ఆపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

ఫిలిప్పైన్స్‌లో చైనా వ్యాక్సిన్లపై అమెరికా తప్పుడు ప్రచారం

- రాయిటర్స్ దర్యాప్తులో వెల్లడి

బీజింగ్ : ఫిలిప్పైన్స్‌లో చైనా వ్యాక్సిన్లను అప్రతిష్టపాల్జేసేందుకు అమెరికా మిలటరీ రహస్యంగా తప్పుడు ప్రచారాన్ని ప్రారంభించిందని ఇటీవల రాయిటర్స్ దర్యాప్తులో వెల్లడైంది. ఈ చర్యను ప్రజారోగ్య నిపుణులు తీవ్రంగా ఖండించారు. అమెరికా మాజీ ఇంటెలిజెన్స్ అధికారులు కూడా దీనిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా తన గుత్తాధిపత్యాన్ని కొనసాగించేందుకు ప్రయత్నిస్తోందని, చైనా అభివృద్ధిని తప్పుడు కథనాలు, వర్ణనలతో దెబ్బతీసేందుకు చూస్తోందని, ప్రజాభిప్రాయాన్ని తారుమారు చేస్తోందని, అంతులేని రీతిలో అసత్యాలు వ్యాప్తి చేస్తోందని పలువురు నిపుణులు విమర్శిస్తున్నారు. చైనా వ్యాక్సిన్లను అప్రతిష్టపాల్జేసే ప్రచారానికి ఎలాంటి శాస్త్రీయ సాక్ష్యాధారాలు లేవని, కేవలం భౌగోళిక, రాజకీయ లక్ష్యాలు, వ్యూహాత్మక ప్రయోజనాలే వున్నాయని విమర్శించారు.

కోవిడ్‌తో దారుణంగా దెబ్బతిన్న ఫిలిప్పైన్స్‌కు సాయమందించడానికి బీజింగ్ చేసిన యత్నాలను వాషింగ్టన్ కోవర్టు ఆపరేషన్ దెబ్బతీస్తోందని మనీలాకు చెందిన మేథో సంస్థ ఆసియన్ సెంచరీ ఫిలిప్పైన్స్ వ్యూహాత్మక అధ్యయనాల సంస్థ ఉపాధ్యక్షుడు అన్నా మలిండాగ్ విమర్శించారు. ఈ చర్యలు గణనీయమైన రీతిలో నైతిక, వ్యూహాత్మక ఆందోళనలు, ప్రశ్నలను లేవదీస్తున్నాయన్నారు. శాస్త్రీయ సాక్ష్యాధారాలతో మాట్లాడేందుకు బదులుగా భౌగోళిక, రాజకీయ లక్ష్యాల ఆధారంగా తప్పుడు ప్రచారాన్ని చేపట్టడం వల్ల కరోనా మహమ్మారిని సమిష్టిగా ఎదుర్కొనాల్న ప్రయత్నాలకు ఎదురుదెబ్బ తగలుతుందని అన్నారు.

నిజానికి, ఇలాంటి నీచమైన ఎత్తుగడలకు పాల్పడుతూ తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం అమెరికాకు ఇదే మొదటిసారి కాదు, 2019లో చైనా సోషల్ మీడియాను లక్ష్యంగా చేసుకుని ఆనాటి ట్రంప్ ప్రభుత్వం రహస్య ప్రచారాన్ని ప్రారంభించింది. చైనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాలంటూ ప్రచారం చేసింది.

విదేశీ జర్నలిస్టులకు వీసా నిరాకరణపై డియుజె దిగ్భ్రాంతి

ఇండియా న్యూస్ నెట్‌వర్క్ (ఐఎన్ఎన్)- న్యూఢిల్లీ : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇటీవల కాలంలో విదేశీ జర్నలిస్టులకు వీసా నిరాకరిస్తున్న ఘటనలపై ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్టు (డియుజె) దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఇటీవల నెలల్లో ముగ్గురు విదేశీ జర్నలిస్టులకు వీసాలు పొడిగించడానికి మోడీ ప్రభుత్వం తిరస్కరించింది. ఈ అంశాలపై డియుజె దిగ్భ్రాంతి, నిరుత్సాహం వ్యక్తం చేసింది. ఆయ దేశాల జర్నలిస్టులకు భారత్ వీసాలు నిరాకరిస్తున్న విషయం ఆయా దేశాల ప్రభుత్వాలు గమనిస్తూ ఉంటాయని, భారతీయ జర్నలిస్టులకు వీసాలు నిరాకరించే ప్రమాదం ఉందని డియుజె తెలిపింది. అలాగే భారత్ వంటి పరిణితి చెందిన ప్రజాస్వామ్య దేశం తమ దేశం లోపల, బయట ప్రచురించబడే విభిన్న అభిప్రాయాల పట్ల సహనం చూపాలని డియుజె తెలిపింది. అలాగే విదేశీ జర్నలిస్టులపై ప్రతికూల చర్యలు తీసుకోవడం వల్ల విదేశాల్లో భారత్ పరువు పోతుందని పేర్కొంది.

రాకాసి 'వాయు కాలుష్యం'

- ప్రపంచవ్యాప్తంగా 81 లక్షల మంది మృతి
- భారత్‌లో 21 లక్షల మంది
- స్టేట్ ఆఫ్ గ్లోబల్ ఎయిర్ రిపోర్ట్

న్యూఢిల్లీ : గాలి కాలుష్యం ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలను కలవర పెడుతున్నది. ఈ ప్రాణాంతక కాలుష్యం నానాటికీ పెరుగుతూ ప్రజల ప్రాణాలను తీస్తున్నది. వాయు కాలుష్యం 2021లో ప్రపంచవ్యాప్తంగా 81 లక్షల మంది మరణాలకు కారణమైంది. భారత్, చైనా వంటి దేశాల్లో దీని నష్టం ఎక్కువగా ఉన్నది. చైనాలో 23 లక్షల మంది, భారత్‌లో 21 లక్షల మంది గాలి కాలుష్యం కారణంగా ప్రాణాలు వదిలారు. ఇటీవల విడుదల చేసిన స్టేట్ ఆఫ్ గ్లోబల్ ఎయిర్ రిపోర్ట్ ఈ విషయాన్ని వెల్లడించింది.

వాయు కాలుష్యం ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ ప్రాణాంతకమైనవాటిలో ఒకటిగా ఉన్నట్లు తెలిపింది. అధిక రక్తపోటు అనేది తర్వాతి స్థానంలో ఉన్నట్లు పేర్కొంది. వాయు కాలుష్యం ప్రజారోగ్యానికి సవాలుగా మారిందని, ప్రపంచవ్యాప్తంగా పరిస్థితి అస్పష్టంగా ఉన్నప్పటికీ, వాయు కాలుష్య అత్యధిక భారాన్ని భరించే దేశాలలో భారత్ ఒకటి అని తెలిపింది. ఒక్క భారత్‌లోనే వాయు కాలుష్యం కారణంగా 21 లక్షల మంది మరణించినట్లు పేర్కొంది. భారత్, చైనాల నుంచి గాలి కాలుష్య మరణాల వాటా ప్రపంచవ్యాప్తంగా 55 శాతంగా ఉన్నదని తెలిపింది. 2021లో ప్రపంచవ్యాప్తంగా 489,000 మరణాలు ఓజోన్ ఎక్స్‌పోజర్ కారణంగా సంభవించినట్లు తెలిపింది. వీటిలో దాదాపు 50 శాతం (237,000 మరణాలు) భారత్‌లోనే జరిగాయని పేర్కొంది. 2021లో కనీసం 169,400 మరణాలు వాయు కాలుష్యం కారణంగా ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో అత్యధిక కాలుష్య-సంబంధిత మరణాలు సంభవించాయి.

తమిళనాడులో 34కు పెరిగిన కల్తీ సారా మృతులు

చెన్నై : విషపూరితమైన కల్తీ సారా తాగి తమిళనాడులో మరణించిన వారి సంఖ్య 34కి చేరుకుంది. వంద మందికి పైగా వివిధ ఆస్పత్రుల్లో చేరారని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు గురువారం నిర్ధారించారు. బుధవారం ఆరుగురు మృతి చెందగా గురువారానికి ఆ సంఖ్య 34కి పెరిగింది. స్థానికంగా దొరికే సారాలో ప్రాణాంతకమైన మిథనాల్‌ను కలిపి సేవించారని ముఖ్యమంత్రి స్టాలిన్ వెల్లడించారు. ఈ కల్తీ సారా వ్యవహారానికి సంబంధించి నలుగురిని అరెస్టు చేసినట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. ఇటువంటి నేరపూరితమైన చర్యలు సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయని అన్నారు. దేశంలో అక్రమ సారాబట్టీల్లో తయారయ్యే ఈ కల్తీసారా ఏటా వందలాదిమంది ప్రాణాలను తీస్తోంది. మరింత మత్తు ఎక్కేందుకు తరచుగా మిథనాల్‌తో కలుపుతుంటారు. దీనివల్ల కళ్ళు మసకబారడం, లివర్ దెబ్బతినడం, మరణాలు వంటివి చోటు చేసుకుంటాయన్నారు. ఈ సంఘటనపై గవర్నర్ ఆర్.ఎన్.రవి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఇంకా చాలామంది మృత్యువుతో పోరాడుతున్నారని ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

రిజర్వేషన్ల పెంపు నిర్ణయాన్ని కొట్టివేసిన పాట్నా హైకోర్టు

పాట్నా : విద్య ఉద్యోగ రంగాల్లో బిసి, ఒబిసి, ఎస్‌సి, ఎస్‌టిల రిజర్వేషన్లను 65 శాతానికి పెంచుతూ బీహార్ ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణలను పాట్నా హైకోర్టు గురువారం రద్దు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా కులగణన చేపట్టిన నితీష్ కుమార్ ప్రభుత్వం .. నివేదిక ఆధారంగా 50 శాతంగా ఉన్న రిజర్వేషన్లను 65 శాతానికి పెంచుతూ సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. రిజర్వేషన్ల సవరణ బిల్లు ప్రకారం.. ఇబిసిలకు 18 శాతం నుండి 25 శాతం, బిసిలకు 12శాతం నుండి 18 శాతం, ఎస్‌సికి 16 శాతం నుండి 20 శాతం, ఎస్‌టి 1 శాతం నుండి 2 శాతానికి పెంచింది. బిసి మహిళలకు అప్పటివరకు ఉన్న 3 శాతం రిజర్వేషన్‌ను రద్దు చేశారు. ఇక, ఆర్థికంగా వెనకబడినవారిని ఉద్దేశించిన 10శాతం రిజర్వేషన్లు కలిపితే మొత్తం రిజర్వేషన్లు 75 శాతానికి చేరాయి. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ గౌరవ్ కుమార్, ఇతరులు పాట్నా హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)ను దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లపై సుదీర్ఘ విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి కె.వి. చంద్రన్‌తో కూడిన డివిజన్ బెంచ్ మార్చి 11, 2024న తీర్పును రిజర్వ్ చేసిన సంగతి తెలిసిందే.

మీకోసం

దాల్చినచెక్క పొడికి తేనె కలిపి, ఆ మిశ్రమాన్ని మొటిమలపై రాసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

జీవన సౌరభం

పొరపాట్లను గ్రహించిన తరవాతనైనా జాగ్రత్త పడడం ఉత్తమ లక్షణం.

బడికొస్తున్నాం..!

కొత్త ఆశలతో.. అల్లరి చేస్తూ
కొత్త దుస్తులతో.. సందడి చేస్తూ
వస్తున్నాం.. మేమొస్తున్నాం
బుడి బుడి అడుగులతో వడి వడిగా
వస్తున్నాం.. మేమొస్తున్నాం

గురువులు నేర్పే పాఠం కోసం
పలకా బలపం పట్టేటందుకు
వస్తున్నాం.. మేమొస్తున్నాం

అక్షరాలను నేర్చేటందుకు
ఆటలు ఆడి పాటలు పాడేందుకు
వస్తున్నాం.. మేమొస్తున్నాం

చదువులు బాగా చదువుకుని
ఒప్పిస్తాం.. మేం మెప్పిస్తాం
బుడతలు కాము చిరుతలమని
చెప్పేస్తాం.. మేం చూపిస్తాం

కాన్వెంట్ బడులకు పోటీగా
సాధిస్తాం...మేం రాణిస్తాం!

కయ్యూరు బాలసుబ్రమణ్యం,
77802 77240.

సరిచేసి రాయండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన బొమ్మల పేర్లను పక్కనే ఆంగ్లంలో ఇచ్చాం. అయితే అవి సరైన క్రమంలో లేవు. కాస్త మీరు వాటిని సరిచేసి రాయరూ?

నేను గీసిన బొమ్మ

మెనేని జస్మిత,
6వ తరగతి,
వశిష్ట ఇంగ్లీషు మీడియం హైస్కూలు,
మదనపల్లి, ఆంధ్రప్రదేశ్.

కంచర్ల అర్పిత,
6వ తరగతి,
సెయింట్ ఫ్రాన్సిస్ హైస్కూలు,
మంగళగిరి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మాస్టర్ స్కూబా..



పిల్లలకు నీళ్లను చూస్తే భలే సరదా! ఒక పట్టాన వదిలి రారు. ఇక సముద్రాన్ని చూస్తే వాళ్ల ఆనందానికి అవధులు ఉంటాయా! కేరింతలే కేరింతలు.. గంతులే గంతులు.. అయితే బెంగుళూరుకు చెందిన 12 ఏళ్ల కైనా ఖరే, అలా నీళ్లని చూస్తూ ఊరుకునే బాపతు కాదు. ఆ నీళ్ల లోతుకు వెళ్లి దాని రహస్యాలు తెలుసుకోవాలనుకునే తాలుకా. అందుకే రెండేళ్ల నుండే ఈత నేర్చుకుంది. 10 ఏళ్లు వచ్చేసరికి స్కూబా డ్రైవింగ్‌లో నిష్ణాతురాలైంది. రెండేళ్లు తిరిగేసరికి ఇప్పుడు ఆ క్రీడలో మాస్టర్ డైవర్‌గా కీర్తి సంపాదించుకుంది.

బెంగుళూరులో నివసిస్తున్న కైనా బాలికల విభాగంలో ప్రపంచంలోనే అతిచిన్న స్కూబా డైవర్ మాస్టర్‌గా కీర్తి గడించింది. 10 ఏళ్లప్పటికే ప్రపంచ గుర్తింపు పొందిన ఈ చిన్నారి, ఓపెన్ వాటర్ సర్టిఫికేషన్, నీటి అడుగున ఫొటోగ్రఫీ, ప్రత్యేకమైన నైట్రోక్స్ డైవింగ్, పర్ఫెక్ట్ బాయిన్సీ కంట్రోల్, రెస్క్యూ డైవర్ ట్రైనింగ్ వంటి ఇతర ప్రత్యేక కోర్సుల్లో ధృవపత్రాలను సాధించింది. పెద్దలకు ఏమాత్రం తీసిపోకుండా పాల్గొన్న ప్రతి పోటీలో పతకాలు సాధిస్తున్నందుకే మాస్టర్ డైవర్ బిరుదును దక్కించుకుంది. ఈ బిరుదు అసాధారణ జ్ఞానం, నైపుణ్యం, అంకితభావం ఉన్న క్రీడాకారులకే లభిస్తుంది.

రెండేళ్లప్పుడే అండమాన్ దీవుల్లో ఓపెన్ వాటర్ డైవ్‌లో పాల్గొన్న కైనా, తన ప్రయాణం గురించి ఇలా వివరిస్తోంది. 'అప్పుడు నా వయసు రెండేళ్లే. అది 'తండేమ్' డైవ్.అందులో పాల్గొన్నప్పుడు నాకు భలే సరదా అనిపించింది. నా ఆసక్తిని గమనించి, అమ్మానాన్న ఇండోనేషియా బాలిలో ఓపెన్ వాటర్ కోర్సులో చేర్పించారు. ఆ తరువాత థాయ్‌లాండ్‌లో నా కోర్సును పూర్తిచేశాను. చాలా క్లిష్టమైన అండమాన్ వాతావరణంలో డైవ్ చేసి మాస్టర్ డైవర్‌గా గుర్తింపుపొందాను' అంటున్న కైనా తనకు ఇంతలా ప్రోత్సహించిన అమ్మానాన్నకే ఈ గొప్పతనమంతా చెందాలని అంటుంది.

కైనా చిన్నప్పటి నుండీ 'వాటర్ బేబీ'. రెండేళ్లకే ఈదడం ప్రారంభించింది. ఒక్కోసారి మేము బలవంతంగా తనని నీళ్లల్లో నుండి బయటికి లాగవలసి వచ్చేది. మొదట్లో సముద్రం లోతుల్లోకి పంపించేందుకు భయపడ్డాం. కానీ తన ఇష్టాన్ని కాదనలేకపోయాం. అయితే సర్టిఫికెట్లు సాధించాలని ఎప్పుడూ అనుకోలేదు. సరదాగా నేర్చుకుంటే చాలు అనుకున్నాం. కానీ తను అలా ఊరుకోలేదు. డైవింగ్‌లో ఎంతో కఠిన నియమాలు ఉంటాయి. వాటన్నింటినీ తట్టుకుని నిలబడింది. నైపుణ్యం గల శిక్షకుల పర్యవేక్షణలో నిత్యం శ్రమించింది. తన ఆసక్తిని గమనించి మేము కూడా ఎప్పుడూ అడ్డు చెప్పలేదు' అని తల్లి అన్షమా కైనా ప్రయాణం గురించి చెబుతున్నారు.



అది చాలా క్లిష్ట ప్రయాణం

'ఒక్కసారి సముద్రం లోతుల్లోకి వెళ్లాక అక్కడ వాతావరణం ఎప్పుడు ఎలా ఉంటుందో ఎవరూ ఊహించలేరు. మీతో పాటు డైవ్ చేస్తున్న వ్యక్తి కనిపించకుండా వుంటారు. వాళ్ల కోసం ఎదురు చూడాల్సి వస్తుంది. ఒక్కోసారి పెద్ద పెద్ద చేపలు దాడి చేయొచ్చు. ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం. ఒకసారి అండమాన్ దీవుల్లో డైవ్‌కి వెళ్లినప్పుడు మొదట ఉన్న వాతావరణం లోతుల్లోకి వెళ్లాక లేదు. రెస్క్యూ డైవింగ్‌కోర్సు నేర్చుకోవాలన్న లక్ష్యంతో నేను ఆ రోజు సముద్ర లోతుల్లోకి వెళ్లాను. అప్పుడు అక్కడ పెద్ద తుఫాను సంభవించింది. గాలి, వానతో సముద్రమంతా అల్లకల్లోలంగా ఉంది. నాతో పాటు వచ్చిన డైవర్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. 20 మీటర్ల దూరంలోని పడవ దగ్గరికి నేనొక్కదాన్నే అతన్ని లాక్కుని వెళ్లాల్సివచ్చింది' అని అప్పుడు తనకు ఎదురైన చేదు అనుభవాన్ని కైనా గుర్తుచేసుకుంది.

అయితే ఈ సవాళ్లేమీ ఆమె ప్రయాణానికి అడ్డుకట్ట వేయలేదు. సవాళ్లను అధిగమిస్తూ ఎంతో ఉత్సాహంగా ముందుకు వెళుతోంది. 'నీరు నా రెండవ ఇల్లు. అక్కడ చాలా సరదాగా ఉంటుంది. ఎంతో అద్భుతంగా ఉంటుంది. ప్రశాంతంగా ఉంటుంది. విశ్రాంతిగా ఉంటుంది. చేపలు కూడా అప్పుడప్పుడు వచ్చి చూసి వెళతాయి. భలే సరదాగా ఉంటుంది' అంటూ కళ్లు ఇంత పెద్దవి చేసుకుని తన సముద్రలోతు అనుభవాన్ని చెబుతోంది కైనా. కైనా లాంటి చిన్నారులు మన ఇంట్లోనో, మన చుట్టుపక్కలో ఉంటారు. వారి అభిరుచికి తగ్గట్లుగా ప్రోత్సాహిమిస్తే, కైనాలానే వారు కూడా ఉన్నతశిఖరాలు అధిరోహిస్తారు.

కరివేపాకును ఇలా నిల్వ చేసుకోండి..

కరివేపాకుని వంటల్లో ఎక్కువగా వినియోగిస్తాం. కొంతమందైతే కరివేపాకు లేకుండా ఏ వంటా చేయరు. అయితే ఎక్కువ మొత్తంలో కరివేపాకుని తెచ్చుకున్నప్పుడు దాన్ని నిల్వచేయడంలో ఇబ్బందిపడతారు. రెమ్మలు తుంచి గాలి చొరబడని డబ్బాలో పెట్టినా, కవర్‌లో ఉంచినా ఎంతోకొంత తేమ చేరి చివరి వరకూ తాజాగా ఉండదు. అయితే ఒక చిట్కా పాటిస్తే కరివేపాకు ఎప్పుడు వాడుకున్నా తాజాగా ఉంటుంది.

కరివేపాకు రెమ్మలను తుంచి, ఆకులను ఐస్ ట్రేలో ఉంచాలి. వాటిలో కొంచెం నీళ్లు పోసి ఐస్ క్యూబ్స్‌ని తయారుచేసుకోవాలి. ఇలా తయారైన క్యూబ్స్‌ని జిప్ లాక్ కవర్‌లో పెట్టి ఫ్రిజ్‌లో భద్రపర్చుకోవాలి. కరివేపాకు ఎప్పుడు కావాలంటే అప్పుడు కొన్ని ఐస్‌క్యూబ్స్‌ని బయటకి తీసి ఒక గిన్నెలో వేసి నీళ్లు పోస్తే క్యూబ్స్‌లో ఉన్న తాజా కరివేపాకు బయటికి వస్తుంది. ఎంచక్కా వంటల్లో ఘుమఘుమలాడుతుంది. మరి ఇంకెందుకు ఆలస్యం ఈసారి కరివేపాకును మీరు కూడా ఇలా నిల్వ చేసుకోండి.

'కల్కి..' మూడు ప్రపంచాల కథ

'కల్కి '2898ఎడి'.. 'కాశీ', 'కాంప్లెక్స్', 'శంబాలా' అనే మూడు ప్రపంచాల మధ్య నడిచే కథ. ఒకొక్క వరల్డ్‌ని ఒకొక్క థాట్ ప్రాసెస్‌తో ఫ్యూచరిస్టిక్‌గా తెరకెక్కించాం' అని దర్శకుడు నాగ్ అశ్విన్ చెబుతున్నారు. ప్రభాస్ నటిస్తున్న ఈ చిత్రం నుండి తాజాగా గురువారం 'వరల్డ్ ఆఫ్ కల్కి 2898 ఎడి – ఎపిసోడ్ 2' ని చిత్రబృందం విడుదలచేసింది. దీని గురించి నాగ్ అశ్విన్ మాట్లాడారు. 'కాశీ భూమి మీద మొదటి నగరం. అలాంటిది ఈ ప్రపంచంలో కాశీనే ఆఖరి సిటీ అయితే ఎలా ఉంటుందన్న ఐడియాతో కల్కి స్క్రిప్ట్ స్టార్ట్ చేశాం. కలియుగం చివరలో అంతా అయిపోయిన తర్వాత గంగ ఎండిపోయిన తర్వాత లాస్ట్ సిటీ ఏముటుందని అనుకుంటే, అలాంటి సమయంలో మన కాశీ వుంటే ఎలా వుంటుంది, నాగరికత పుట్టిందే కాశీలో అలాంటి ఆ సిటీని క్రియేట్ చేయడం చాలా ఇంట్రస్టింగా వుంటుంది. ఇండియన్ ఆర్కిటెక్చర్, వెహికిల్స్, కరెన్సీ ఇలా అన్ని ఫ్యూచరిస్టిక్‌గా కాశీని నిర్మించడం మొదలుపెట్టాం. ఇది చాలా లాంగ్ ప్రాసెస్. కాశీపైన పిరమిడ్ ఆకారంలో ఉండే స్ట్రక్చర్ వుంటుంది, దాన్ని మేము కాంప్లెక్స్ అంటాం. భూమిపై లేని నేచర్, యానిమల్స్, ఫుడ్, ఇలా ప్రతిదీ ఇక్కడ ఉంటుంది. ఒకరమైన స్వర్గం అనుకోవచ్చు. కల్కి కథలో మూడో వరల్డ్ కూడా వుంది. అదే 'శంబాల'. ఇది కల్కి స్టోరీకి ఇంటిగ్రల్‌గా వుంటుంది. కాశీకి కాంప్లెక్స్‌కి సంబంధం లేని థర్డ్ వరల్డ్. ఈ వరల్డ్ వున్న వారు కాంప్లెక్స్‌లో వున్నవారిని ఛాలెంజ్ చేస్తుంటారు. ఈ వరల్డ్‌లో గాడ్ అనే ఐడియా వుండదు. గాడ్‌ని బ్యాన్ చేసిన వరల్డ్. ఈ మూడు వరల్డ్స్ మధ్య మన కథ నడుస్తుంది. ఒకొక్క వరల్డ్‌ని ఒకొక్క థాట్ ప్రాసెస్‌తో డిజైన్ చేశాం. కాశీలో ప్రజలు, వెహికిల్స్, కరెన్సీ, ఫుడ్, వెపన్స్ ఒకలా వుంటాయి. కాంప్లెక్స్‌లో ఒకలా వుంటాయి. శంబాలా కంప్లీట్ డిఫరెంట్. ఒకొక్కరు ఒక్కో కల్చర్. శంబాలాలో దేవుడు మళ్ళీ పుడతాడనే ఒక నమ్మకం వుంది. కల్కి అవతారం శంబాలాలో పుడుతుందనే నమ్మకం మన పాపులర్ కల్చర్‌లో వుంది. ఈ మూడు వరల్డ్స్ ఒకదానితో ఒకటి కనెక్ట్ అవుతూ 'కల్కి' కథ నడుస్తుంది' అని చిత్ర విశేషాలు ముచ్చటించారు.

పరువు సీజన్-2 కోసం ఎదురుచూస్తున్నా : చిరంజీవి

నివేదా పేతురాజ్, నరేష్ అగస్త్య ప్రధాన పాత్రల్లో తెరకెక్కించిన వెబ్ సిరీస్ పరువు. ఈనెల 14న ఓటీటీకి వచ్చింది. ఈ సిరీస్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. గోల్డ్‌బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విష్ణుప్రసాద్ లగ్గిశెట్టి, సుస్మిత కొణిదెల నిర్మించారు. ప్రస్తుతం జీ5లో స్ట్రీమింగ్ అవుతోన్న ఈ సిరీస్‌పై చిరంజీవి ఆసక్తికరమైన ట్వీట్ చేశారు. 'పరువు సీజన్–2 కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. ఓ చక్కటి ప్లాన్‌తో చందు బాడీ మాయం చేసి, ఆ జంట పడే తిప్పలు, ఈ విషయమై ఎమ్మెల్యే పాట్లు. చివరికి ఈ జంట తప్పించుకుందా? లేదా అనే విషయమై తెలుసుకోవాలనే కుతూహలంగా ఉంది.' అంటూ కొనియాడారు. ప్రణీత పట్నాయక్, బిందు మాధవి, మిత్ తివారి కీలకపాత్రలు పోషించారు.

మట్కా షెడ్యూల్ ప్రారంభం

వైర, ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తున్న చిత్రం 'మట్కా'.వరుణ్‌తేజ్ హీరోగా కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీని డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ గ్రాండ్ స్కేల్‌లో రూపొందుతోంది. తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. 40 రోజుల ముఖ్యమైన షెడ్యూల్ కోసం మ్యాసీవ్ సెట్‌ను నిర్మించారు, ఇందులో యూనిట్ చాలా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తుంది. వరుణ్ తేజ్, నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి ఈ షెడ్యూల్‌లో పార్ట్ అయ్యారు. 'మట్కా' దేశం అంతటా సెన్సేషన్ క్రియేట్ చేసిన నిజ జీవిత సంఘటన స్ఫూర్తితో డిఫరెంట్ టైం లైన్స్ లో రూపొందుతోంది. మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి నవీన్ చంద్ర, అజయ్ ఘోష్, కన్నడ కిషోర్, రవీంద్ర విజయ్, పి. రవి శంకర్ ఉన్నారు.

బాలీవుడ్ హీరోతో మలినేని సినిమా

గతేడాది 'వీరసింహారెడ్డి' చిత్రంతో విజయాన్ని అందుకున్న గోపీచంద్ మలినేని బాలీవుడ్‌లో హీరోతో సినిమా చేయబోతున్నారు. 'గదర్–2' మళ్లీ ఫామ్‌లోకి వచ్చిన హీరో సన్నీడియోల్‌తో గోపీచంద్ సినిమా చేయబోతున్నారని మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు ట్విట్టర్ వేదికగా అప్‌డేట్ ఇచ్చాయి. 'దేశంలోనే బిగ్గెస్ట్ యాక్షన్ సినిమా మా తదుపరి చిత్రం' అంటూ కొత్త పోస్టర్ విడుదల చేశారు. పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నిర్మాత డి.సురేష్ బాబు హీరోపై క్లాప్ ఇచ్చారు. అతి త్వరలో షూటింగ్ మొదలు కానుంది. సయామీఖేర్, రెజీనా నాయికలు. తమన్ సంగీతం అందిస్తున్నారు. నవీన యెర్నేని, వై.రవిశంకర్, టీజీ విశ్వప్రసాద్ నిర్మాతలు.

అహో! విక్రమార్క' టీజర్ నచ్చుతుంది : దేవ్ గిల్

'మగధీర'తో సహా పలు దక్షిణ భారత చిత్రాల్లో విభిన్న పాత్రలు, ఆకర్షణీయమైన నటనతో దేవ్ గిల్ అందరినీ ఆకట్టుకున్నారు. ప్రస్తుతం ఆయన నేతృత్వంలో దేవ్ గిల్ ప్రొడక్షన్స్ నుంచి 'అహో! విక్రమార్క' అనే మొదటి ప్రాజెక్ట్ రాబోతోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌ను రిలీజ్ చేశారు. దేవ్‌గిల్ మాట్లాడుతూ 'మగధీర నుంచి నా మీద ప్రేమను కురిపిస్తూనే ఉన్నారు. పూణెలో మా తల్లిదండ్రులు జన్మనిచ్చి ఉండొచ్చు.. కానీ హైద్రాబాద్‌లో రాజమౌళి నాకు పేరు ఇచ్చారు. రమా నాకు తల్లిలా సపోర్ట్ ఇచ్చారు. వారి వల్లే ఈ రోజు 'అహో విక్రమార్క' అనే చిత్రాన్ని నిర్మించగలిగాను. 12, 13 ఏళ్ల క్రితం రాజమౌళి నన్ను ముంబై నుంచి పట్టుకొచ్చి నాకు లైఫ్ ఇచ్చారు. ఇప్పుడు నేను హీరోగా సినిమాను తీశాను. నాకు ఎంతో గర్వంగా, ఆనందంగా ఉంది. నన్ను ఇంత వరకు విలన్‌గా చూశారు. నా మీద ప్రేమను కురిపించారు. కానీ ఈ సినిమాతో మీ అందరికీ సర్ ప్రైజ్ ఇవ్వబోతోన్నాను. త్రికోటి చాలా పెద్ద విజన్ ఉంది. మా టీజర్ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాను. త్వరలోనే పాటలు కూడా రిలీజ్ చేస్తాం. మా సినిమా మీద ఆడియెన్స్ ప్రేమను కురిపించి, ఆదరించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

మొక్కలు నాటిన కాజల్ అభిమానులు

హీరోయిన్ కాజల్ అగర్వాల్ 39వ పుట్టినరోజును ఘనంగా జరుపుకున్నారు. అభిమానులు, తోటి సెలబ్రిటీలు శుభాకాంక్షలు తెలిపారు. కాజల్ అభిమానులు 150 మందికి భోజనం ప్యాకెట్లు పంపిణీచేశారు. ఈనెలాఖరులోగా 50 మొక్కలు నాటుతామని ప్రకటించారు. అభిమానులు ఈ వీడియాను కాజల్‌కు పంపగా ఆమె ఎంతో ఎమోషనల్‌కు గురయ్యారు. అద్భుతమైన పని చేశారంటూ అభిమానులకు అభినందనలు తెలియజేశారు.

అదరగొట్టిన టీమిండియా

- సూర్యకుమార్ అర్ధసెంచరీ
- బుమ్రా కెరీర్‌బెస్ట్ బౌలింగ్
- అర్ష్‌దీప్‌కు మూడు వికెట్లు
- ఆఫ్ఘనిస్తాన్‌పై 47పరుగుల తేడాతో ఘన విజయం

సూర్యకుమార్ (53పరుగులు)

బార్బొడాస్: టి20 ప్రపంచకప్ సూపర్–8లో టీమిండియా జూలు విదిలించింది. ఆఫ్ఘనిస్తాన్‌తో గురువారం జరిగిన సూపర్–8 తొలి మ్యాచ్‌లో రోహిత్ సేన 47పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత మిస్టర్ 360డిగ్రీస్ అర్ధసెంచరీతో రాణించడంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆఫ్ఘనిస్తాన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 134పరుగులు చేసి ఆలౌటైంది. టీమిండియా పేసర్ జస్ప్రీత్ బుమ్రా(3/7) కెరీర్ బెస్ట్ బౌలింగ్‌కి తోడు అర్ష్‌దీప్ సింగ్(3/36) రాణించారు.

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు శుభారంభం దక్కలేదు. కెప్టెన్ రోహిత్ శర్మ(8) మరోసారి నిరాశపరిచాడు. మరో ఎండ్‌లో కోహిల(24) ఆచి తూచి ఆడాడు. పంత్(20) మరోవైపు బ్యాట్ ఝుళిపిస్తున్నా.. కోహ్లి భారీషాట్స్‌కు ప్రయత్నించలేదు. వీరిద్దరి నిష్క్రమణ తర్వాత సూర్యకుమార్ యాదవ్(53) అర్ధసెంచరీతో చెలరేగాడు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా(32) సహకారంతో సూర్యకుమార్ యాదవ్ 28బంతుల్లో 5ఫోర్లు, 3సిక్సర్లతో చెలరేగాడు. హార్దిక్ పాండ్యా 24బంతుల్లో 3ఫోర్లు, 2సిక్సర్లతో 32 పరుగులు చేశాడు. చివర్లో అక్షర్ పటేల్(12; 6బంతుల్లో 2ఫోర్లు) రాణించడంతో టీమిండియా భారీస్కోర్ చేసింది. ఆఫ్ఘనిస్తాన్ కెప్టెన్ రషీద్ ఖాన్, ఫజల్–హక్–ఫరూఖీలకు మూడేసి, నవీనుల్ హక్‌కు ఒక వికెట్ దక్కాయి. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆఫ్ఘనిస్తాన్‌ను టీమిండియా బౌలర్లు జస్ప్రీత్ బుమ్రా తొలుతే కట్టడి చేశాడు. గుర్బాజ్(11), జజాయ్(2)లను ఔట్ చేశాడు. ఇబ్రహీం జద్రాన్(8)ను అక్షర్ ఔట్ చేయడంతో ఆఫ్ఘన్ జట్టు 23పరుగులకే 3వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ తర్వాత మిగిలిన బ్యాటర్లనూ టీమిండియా బౌలర్లు కట్టడి చేయగా.. ఒమర్జాయ్(26) ఫర్వాలేదనిపించాడు. ఆఫ్ఘన్ బ్యాటర్ ఏ ఒక్కరూ క్రీజ్‌లో నిలదొక్కుకొనే అవకాశం టీమిండియా బౌలర్లు ఇవ్వలేదు. అర్ష్‌దీప్, బుమ్రాకు మూడేసి, కుల్దీప్‌కు రెండు, అక్షర్, జడేజాకు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సూర్యకుమార్ యాదవ్‌కు లభించింది.

స్కోర్‌బోర్డు..

ఇండియా ఇన్నింగ్స్: రోహిత్ (సి)రషీద్ ఖాన్ (బి)ఫారూఖీ 8, కోహ్లి (సి)నబి (బి)రషీద్ ఖాన్ 24, పంత్ (ఎల్‌బి)రషీద్ ఖాన్ 20, సూర్యకుమార్ (సి)నబి (బి)ఫారూఖీ 53, దూబే (ఎల్‌బి)రషీద్ ఖాన్ 10, హార్దిక్ (సి)అజ్మతుల్లా (బి)నవీన్–ఉల్–హక్ 32, జడేజా (సి)గుల్బద్దీన్ (బి)నవీన్–ఉల్–హక్ 12, అక్షర్ పటేల్ (రనౌట్) గుర్బాజ్/నవీన్–ఉల్–హక్ 12, అర్ష్‌దీప్ సింగ్ (నాటౌట్) 2, అదనం 13. (20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 181పరుగులు. **వికెట్ల పతనం:** 1/11, 2/54, 3/62, 4/90, 5/150, 6/159, 7/165, 8/181 **బౌలింగ్:** ఫారూఖీ 4-0-33-3, మహ్మద్ నబీ 3-0-24-0, నవీన్ 4-0-40-1, రషీద్ 4-0-26-3, నూర్ అహ్మద్ 3-0-30-0, అజ్మతుల్లా 2-0-23-0

ఆఫ్ఘనిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి)పంత్ (బి)బుమ్రా 11, హజ్మతుల్లా (సి)జడేజా (బి)బుమ్రా 2, ఇబ్రహీం జద్రాన్ (సి)రోహిత్ (బి)అక్షర్ 8, గులాబుద్దిన్ నబి (సి)పంత్ (బి)కుల్దీప్ 17, ఒమర్జాయ్ (సి)అక్షర్ (బి)జడేజా 26, నజీబుల్లా (సి)అర్ష్‌దీప్ (బి)బుమ్రా 19, మహ్మద్ నబి (సి)జడేజా (బి)కుల్దీప్ 14, రషీద్ ఖాన్ (సి)జడేజా (బి)అర్ష్‌దీప్ 2, నూర్ అహ్మద్ (సి)రోహిత్ (బి)అర్ష్‌దీప్ 12, నవీన్ (సి)పంత్ (బి)అర్ష్‌దీప్ 0, ఫారూఖీ (నాటౌట్) 4, అదనం 19. (20ఓవర్లలో ఆలౌట్) 134పరుగులు. **వికెట్ల పతనం:** 1/13, 2/23, 3/23, 4/67, 5/71, 6/102, 7/114, 8/121, 9/121, 10/134 **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-36-3, బుమ్రా 4-1-7-3, అక్షర్ 3-1-15-1, హార్దిక్ 2-0-13-0, కుల్దీప్ 4-032-2, జడేజా 3-0-20-1.

శివాలెత్తిన సాల్ట్

వెస్టిండీస్‌పై ఎనిమిది వికెట్ల తేడాతో ఇంగ్లండ్ గెలుపు

సాల్ట్ (87నాటౌట్)

సెయింట్ లూసియా: టి20 ప్రపంచకప్ సూపర్–8లో ఇంగ్లండ్ జట్టు తొలి మ్యాచ్‌లోనే సత్తా చాటింది. వెస్టిండీస్‌పై ఇంగ్లండ్‌జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఇంగ్లండ్ ఓపెనర్ ఫిల్ సాల్ట్(87నాటౌట్; 47బంతుల్లో 7ఫోర్లు, 5సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడాడు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. ఆ లక్ష్యాన్ని ఇంగ్లండ్ జట్టు కేవలం 17.3 ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఇంగ్లండ్ బ్యాటర్ జానీ బెయిర్‌స్టో(48నాటౌట్; 26బంతుల్లో 5ఫోర్లు, 2సిక్సర్లు) కూడా బ్యాటింగ్‌లో రాణించాడు. అంతకుముందు ఇంగ్లండ్ బౌలర్లు జోఫ్రా ఆర్చర్, అదిల్ రషీద్‌లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. విండీస్ ఓపెనర్లు బ్రాండన్ కింగ్, జాన్సన్ చార్లెస్‌లు రఫాడించారు. తొలి అయిదు ఓవర్లలో 40 పరుగులు జోడించారు. బ్రండన్ కింగ్ 23 పరుగులకు రిటైర్డ్ హర్ట్ కాగా, జాన్సన్ ఛార్లెస్ 38, పూరన్ 36, పావెల్ 36 పరుగులు చేసి ఔటయ్యారు. రూథర్‌ఫోర్డ్ 28 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. దీంతో గ్రూప్–2లో ఇంగ్లండ్ తన పేరిట తొలి విజయాన్ని ఖాతాలో వేసుకున్నది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సాల్ట్‌కు దక్కింది.

స్కోర్‌బోర్డు..

వెస్టిండీస్ ఇన్నింగ్స్: కింగ్ (రిటైర్డ్ హర్ట్) 23, ఛార్లెస్ (సి)బ్రూక్ (బి)మొయిన్ 38, పూరన్ (సి)బట్లర్ (బి)ఆర్చర్ 36, రువన్ పావెల్ (సి)వుడ్ (బి)లివింగ్‌స్టోన్ 36, రస్సెల్ (సి)సాల్ట్ (బి)ఆదిల్ రషీద్ 1, రూథర్‌ఫోర్డ్ (నాటౌట్) 28, షెఫర్డ్ (నాటౌట్) 5, అదనం 13. (20ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 180పరుగులు.

వికెట్ల పతనం: 1/94, 2/137, 3/141, 4/143

బౌలింగ్: టోప్లే 3-0-26-0, వుడ్ 3-0-36-0, ఆర్చర్ 4-0-34-1, సామ్ కర్రన్ 3-0-25-0, ఆదిల్ రషీద్ 4-0-21-1, మొయిన్ అలీ 2-0-15-1, లివింగ్‌స్టోన్ 1-0-20-1.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: సాల్ట్ (నాటౌట్) 87, బట్లర్ (ఎల్‌బి)ఛార్లెస్ 25, మొయిన్ అలీ (సి)ఛార్లెస్ (బి)రస్సెల్ 13, బెయిర్‌స్టో (నాటౌట్) 48, అదనం 8. (17.3ఓవర్లలో 2వికెట్ల నష్టానికి) 181పరుగులు.

వికెట్ల పతనం: 1/67, 2/84 **బౌలింగ్:** హొసైన్ 4-0-35-0, షెఫర్డ్ 2-0-41-0, రస్సెల్ 2-0-21-1, జోసెఫ్ 2.3-0-32-0, మోంటీ 4-0-32-0, ఛేస్ 3-0-19-1.

టి20 ప్రపంచకప్ సూపర్-8లో నేడు..

ఆస్ట్రేలియా × బంగ్లాదేశ్
వేదిక: ఆంటిగ్వా; ఉ.6.00గం॥లకు

ఇంగ్లండ్ × దక్షిణాఫ్రికా
వేదిక: సెయింట్‌లూసియా; రా.8.00గం॥లకు

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68